



ESTD: 1999

www.voodayam.com

# వుదయం

కరీంనగర్ | 05-02-2026 గురువారం | సంపుటి : 14 | సంచిక : 59 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on










## మా పాలన చూసి తీర్పు ఇవ్వండి

**గిరిజనులు, నిరుద్యోగులు, మహిళలు, మైనార్టీల కోసం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం**

**సన్న వడ్లు పండించేవారికి రూ.500లు బోనస్ ఇస్తున్నాం..మున్సిపల్ ఎన్నికల తరువాత రైతు భరోసా : మిర్యాలగూడ విజయభేరి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**వుదయం, మిర్యాలగూడ :** తెలంగాణ జాతిపిత అంశంపై కేసీఆర్ కుటుంబం చేస్తున్న ప్రచారాన్ని రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్ జయ శంకర్ సార్‌ను జాతిపితగా పిలుచుకుంటామని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని తెలంగాణ తల్లి గా గౌరవించుకుంటామని స్పష్టం చేశారు. అసలు ఏ ప్రాతిపదికన మిమ్మల్ని మీరు జాతిపితగా పిలుచుకుంటున్నారు అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి, భార్యాభర్తల మధ్య జరిగే ప్రైవేట్ సంభాషణలను కూడా విన్న మీకు జాతిపిత అని పిలిపించుకునే నైతిక హక్కు లేదని, ఈ పనులకు మీరు సిగ్గుపడాలని ఘాటుగా విమర్శించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ వేదికగా బుధవారం జరిగిన విజయభేరి బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ , ఆయన కుటుంబంపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజలకు చేసిన అన్యాయానికి బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాల్సింది పోయి, సిగ్గు లేకుండా మాట్లాడుతోందని మండిపడ్డారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే అది తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లుగా చిత్రీకరించడాన్ని రేవంత్ తప్పుబట్టారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే తెలంగాణకు ఇచ్చినట్లా..అలా అయితే ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్‌లలో ఉన్న మీ ఫామ్‌హౌస్‌లు, మీ టీవీ ఛానళ్లు, పేపర్లను ముందుగా ప్రజలకు అప్పగించండి అంటూ సవాల్ విసిరారు.

> ఏ ప్రాతిపదికన మిమ్మల్ని మీరు జాతిపితగా పిలుచుకుంటున్నారు?
>
> జయశంకర్ సార్‌ను జాతిపితగా, సోనియాను తెలంగాణ తల్లిగా గౌరవిస్తాం
>
> పోలీసులు మంచోళ్లు కాబట్టే సిట్‌కు మిమ్మల్ని ముసుగులేసి తీసుకెళ్లలేదు : బీఆర్ఎస్ నేతలపై రేవంత్ నిప్పులు

**ముసుగులేసి తీసుకుపోలేదు...**

రాజకీయాల్లో ఎవరూ చట్టానికి అతీతులు కారని, కేటీఆర్ , హరీష్ రావులపై జరుగుతున్న విచారణల గురించి రేవంత్ ప్రస్తావించారు. పోలీసులు ఎవరినైనా విచారణకు పిలిచినప్పుడు సామాన్యులకు ఎలాంటి కఠిన నిబంధనలు వర్తిస్తాయో, వీరికి కూడా అవే వర్తించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే నిందితుల ముఖాలకు ముసుగులు వేసి తీసుకువెళ్లే ప్రోటోకాల్‌ను కూడా అమలు చేయాలని కానీ పోలీసులు మంచోళ్లన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఎవరూ కూడా తాము ప్రత్యేకం అని భావించకూడదని..

మిగతా 2లో..

## సంజయ్ పార్టీ మారారు అనడానికి సరైన ఆధారాలు లేవు

**జగిత్యాల ఎమ్మెల్యేకు స్పీకర్ క్లీన్ చీట్**





**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో మరో ఎమ్మెల్యేకు వేటు గండం తప్పింది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన ఈ కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చిట్ ఇచ్చారు. సంజయ్‌పై అనర్హత వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పిటిషన్ దాఖలు చేయగా దానిపై స్పీకర్ బుధవారం విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సంజయ్ పార్టీ మారారనేందుకు సరైన ఆధారాలు లేవని స్పీకర్ స్పష్టం చేశారు. ఇలా మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై పార్టీ ఫిరాయింపుల పిటిషన్లు దాఖలు కాగా ఇప్పటి వరకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలైన దానం నాగేందర్, కడియం శ్రీహరిలపై స్పీకర్ నిర్ణయం తెలియాల్సి ఉంది. ఇప్పటి వరకూ స్పీకర్ గడ్డం ప్రసాద్ 8 మందికి పార్టీ ఫిరాయింపుల కేసులో క్లీన్ చిట్ ఇచ్చారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మిగతా 2లో..

**నా సంసారంలో వేలు ఎందుకు పెడతావ్ : సంజయ్‌కు జీవన్‌రెడ్డి కౌంటర్**

## మణిపూర్ సిఎం ఖేమ్‌చంద్ రాష్ట్రపతి పాలన రద్దు

**ఇంఫాల్, ఫిబ్రవరి 4 (వుదయం) :** సరిహద్దు రాష్ట్రమైన మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేయడంతో బుధవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బీజేపీ నాయకుడు యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ రాష్ట్ర 13వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ అజయ్ భల్లా ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్‌కు అత్యంత సన్నిహితుడు మెయితీ సమాజానికి చెందిన వాడు. ముఖ్యమంత్రిని ఖరారు చేసేందుకు ఢిల్లీలో ఎన్డీయే సమావేశం పూర్తయిన మర్నాడు బీజేపీ శాసనసభా పక్షం ఖేమ్‌చంద్‌ను తమ నాయకుడిగా ఎన్నుకుంది.గత ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.బీరేన్ సింగ్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. అప్పటి



నుంచీ మణిపూర్ అసెంబ్లీ సస్పెండెడ్ యానిమేషన్ స్థితిలో ఉంది – అంటే రద్దు కాకపోయినా క్రియా రహితంగా ఉంది.
ఖేమ్‌చంద్ మెయితీ వర్గానికి చెందినవాడు. డిప్యూటీ ముఖ్యమంత్రులుగా మిగతా 2లో..

## సర్‌పై సుప్రీంలో మమత ఫైర్





**మూసిన తలుపుల వెనక న్యాయం ఏడుస్తోంది**

**ఇసి చర్యలు భారీగా ఓట్ల రద్దుకి దారి తీస్తున్నాయి, బెంగాల్‌నే లక్ష్యంగా చేసుకున్నారు : సిజెఐ ఎదుట మమత**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (పిఐబి) :** తమ రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణను (ఎస్ ఐఆర్)ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదించడానికి భారత ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్‌లోకి బుధవారం మధ్యాహ్నం ప్రవేశించిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. న్యాయం మూసిన తలుపుల వెనుక ఏడుస్తోందని ఆమె సుప్రీంకోర్టులో గగ్గోలు పెడుతూ, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్..

మిగతా 2లో..



## ప్రపంచ సినీ మార్కెట్ కేంద్రంగా హైదరాబాద్

**తయారీలో బ్లూ ప్రింట్, గద్దర్ అవార్డుల జ్యూరీ సభలో : ఉప ముఖ్యమంత్రి బట్టి**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్ నగరాన్ని దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే కృతనిశ్చయంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవన్నారు. కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీ హైదరాబాద్ లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకంగా ఉన్నాయని ఆయన తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్ కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. తమ పాలనలోనే హైదరాబాద్ సినీ ప్రపంచ మార్కెట్‌కు కేంద్రంగా..

మిగతా 2లో..

## రాహుల్ దేశద్రోహి

**– మాజీ కాంగ్రెస్ ఎంపి, ప్రస్తుత మంత్రి బిట్టు**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (వుదయం) :** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఆయన పాత మిత్రుడు, ప్రస్తుత కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టూకి మధ్య బుధవారం పార్లమెంటు ఆవరణలో వాగ్వాదం చోటు చేసుకుంది. సభ కార్యకలాపాలు ప్రారంభం కాకముందే ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాక ముందు ప్రతిపక్షాలు తమ నిరసన ప్రదర్శన చేస్తున్న సందర్భంగా ఈ వాక్ యుద్ధం చోటు చేసుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరే ముందు, కాంగ్రెస్ పార్టీ నుంచి మూడుసార్లు ఎంపీ అయిన రవ్‌నీత్ బిట్టును మిత్రద్రోహి అని రాహుల్ సంబోధించారు. దీనికి బీజేపీ నాయకుడు వెంటనే, సూటిగా స్పందిస్తూ, గాంధీని దేశ్ కే దుష్మన్ (దేశ ద్రోహి) అని పిలవడంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. రాహుల్‌ను దేశ ద్రోహి అని పిలుస్తూ, అతడికి కరచాలనం చేసేందుకు కూడా బిట్టూ నిరాకరించారు.కాంగ్రెస్‌లో ఉన్నప్పటి కాలాన్ని గుర్తు చేసుకుంటూ, తన వైఖరిని కేంద్ర మంత్రి వివరించారు. పంజాబ్‌లో తీవ్రవాదం చెలరేగిన కాలంలో, ఆ తర్వాత కల్లోలానికి గాంధీ కుటుంబమే బాధ్యత వహించిందని, సిక్కులను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకున్నారని...

మిగతా 2లో..

## మతం పేరుతో రెచ్చగొడుతున్న బిజెపి

**ఈ ఎన్నికల్లో దానికి గుండు సున్నాయే : టిపిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్**

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**



ఈ నెల 11న రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి గుండు సున్నా రాబోతోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ జోస్యం చెప్పారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో మతం పేరుతో రెచ్చగొట్టిన ఆ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదన్న ఆయన ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ మరోసారి మతం పేరుతో బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్ లో ఆయన మీడియతో మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి రాక అందులో భాగమేనన్నారు. తెలంగాణ ప్రజలందరూ జాగ్రత్త ఉండాలని హెచ్చరించారు. మత వైషమ్యాలకు అతీతంగా సోదరభావంతో మెలిగే తెలంగాణ ప్రజలు బీజేపీని ఆదరించవద్దని కోరారు. భైంసా అల్లర్లతోనే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ లబ్ధి పొందిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమం పేరుతో ఓట్లు అడుగుతుందనీ ఈ విషయాన్ని గమనించి మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తమను గెలిపించాలని ప్రచారం చేస్తోన్న బీజేపీ నాయకులు తెలంగాణ అభివృద్ధికి ఏం చేశారో ముందు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమది మంది ఎంపీలు కేంద్రంలో ఆ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పారు. వీరిలో ఇద్దరు కేంద్రమంత్రులు కూడా ఉన్నారన్నారు. ఇంత మంది కలిసి ఇటీవల కేంద్రం విడుదల చేసిన బడ్జెట్ లో తెలంగాణకు ఏ మేరకు నిధులు, అభివృద్ధి పనులు తీసుకువచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓట్ చోరీతోనే...

మిగతా 2లో..

## జక్రాన్‌పల్లి కెజిబివిలో విషాహారం

**8 మంది విద్యార్థులకు అస్వస్థత**

**వుదయం, నిజామాబాద్ :**

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ కళాశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన వెలుగుచూసింది. బుధవారం ఉదయం పాఠశాలలో అందించిన అల్పాహారం వికటించడంతో ఎనిమిది మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రోజులాగే ఉదయం విద్యార్థినులకు అల్పాహారం వడ్డించారు. టిఫిన్ తిన్న కొద్దిసేపటికే ఎనిమిది మంది విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పి ప్రారంభమయ్యాయి. విద్యార్థినుల పరిస్థితిని గమనించిన పాఠశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను పాఠశాల వాహనంలో వెంటనే ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం ప్రస్తుతానికి...

మిగతా 2లో..

## ఎస్సీ, ఎస్టీ నిధులతో ముస్లింల బుజ్జగింపు

**రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడిన బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్**

- ముస్లిం ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ నేతల ఆరాటం
- వారి పాలనలో బలహీన వర్గాలకు ఎటువంటి న్యాయం జరగడంలేదు
- హిందూ దేవాలయాలపై బహిరంగ దాడులు జరుపుతున్నా ఎవరూ నోరు మెదపడంలేదు
- రాష్ట్రంలో సనాతన ధర్మంపై దాడులను సహించబోము
- ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైంది : మహబూబ్ నగర్ విజయ సంకల్ప సమ్మేళనంలో నితిన్



**వుదయం, మహబూబ్ నగర్ :**

దేశం, రాష్ట్రంలో ముస్లిం ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ ఆరోపించారు. కొన్ని వర్గాలను సంతృప్తిపర్చేందుకే ప్రయత్నం చేస్తున్నారన్న ఆయన కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో భారీగా కోతలు విధిస్తోన్న కాంగ్రెస్.. సర్కార్ వక్ఫ్ బోర్డులను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బుధవారం మహబూబ్‌నగర్ లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. పలుచోట్ల హిందూ దేవాలయాలపై బహిరంగంగా దాడులు జరుగుతున్నా ఎవరూ నోరు మెదపట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను ఏమాత్రం సహించబోమన్నారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో అన్నింటా విఫలమైందని ధ్వజమెత్తారు. రైతుభరోసా,

మిగతా 2లో

# మా పాలన చూసి తీర్పు ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి..

హితవు పలికారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, గత పాలకులు పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కేసీఆర్ అహంకారం వల్లే బీఆర్ఎస్ పతనమైందని, ఇప్పటికైనా ప్రజల పక్షాన నిలబడటం నేర్చుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయ దుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**మా పాలన చూసి తీర్పు ఇవ్వండి..**

మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు నకు విజయసూచికగా వేలాది మంది తరలివచ్చారని, సభలో ఆడబిడ్డలు ఉత్సాహంగా పాల్గొనడం చూస్తే మున్సిపల్ ఎన్నికల్లో ఎదురులేదన్న విశ్వాసం కనిపిస్తోందని సీఎం రేవంత్ అన్నారు. తమ ప్రభుత్వం గిరిజనులు, పేదలు, ఆదివాసీలు, నిరుద్యోగులు, మహిళలు, మైనార్టీల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చిందని, మా ప్రభుత్వ కార్యక్రమాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు. తెలంగాణ వచ్చిన తర్వాత గత ప్రభుత్వం కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మందికి రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో మూడు కోట్ల పది లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని, గత ప్రభుత్వం ఇచ్చిన దొడ్డు బియ్యం బర్రెలకు ధానా పెట్టడానికి ఉపయోగపడ్డాయే తప్ప బుక్కెడు బువ్వ తినడానికి ఉపయోగపడలేదన్నారు. తమ ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం పేదవారికి చేరుతున్నాయని, సన్న బియ్యంతో వండుకుని తింటున్న వారందరూ కాంగ్రెస్ కు ఓటు వేయాలన్నారు. ప్రతి ఇంటికి రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, ఇళ్లలో వెలుగులే కాదు ప్రజల కళ్లలో సంతోషం చూస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ తో పాటు ఇళ్లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని సీఎం చెప్పారు.



**రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణ మిర్యాలగూడ..**

మిర్యాలగూడా లో అత్యధికంగా వరి పండుస్తున్నారని, గతంలో ఆనాటి సీఎం వరి వేసుకుంటే ఉరే అన్నాడని, తమ ప్రభుత్వం వచ్చాక సన్న వడ్లు పండిస్తే రూ. 500 బోనస్ ఇస్తున్నామని సీఎం చెప్పారు. బోనస్ తీసుకుంటున్న అత్యధిక లబ్ధిదారులు మిర్యాలగూడాలోనే ఉన్నారన్నారు.

**మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతు భరోసా**

రాష్ట్రంలో రైతు భరోసా కింద ప్రతి ఎకరాకు రూ. 6 వేలు ఇస్తున్నామని, 9 రోజుల్లోనే 9 వేల కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఈసారి మున్సిపల ఎన్నికలు ముగియగానే రైతు భరోసా ఇస్తామని సీఎం ప్రకటించారు. రైతుల కోసం ఇప్పటి వరకు తమ ప్రభుత్వం లక్షా పదివేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించామని, కోట్లాది మంది ఆడబిడ్డలు అమ్మగారి ఇంటికైనా, అమ్మవారి గుడి కైనా ఉచితంగా వెళ్తున్నారన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసిన మహిళలు కాంగ్రెస్ కు ఓటేస్తే బీజేపీ, బీఆర్ఎస్ కు వాళ్లకు డిపాజిట్లు రావన్నారు. బీఆర్ఎస్, బీజేపీ తరుపున పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థులకు కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని సీఎం అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు ఇస్తున్నామని, తాము ఎక్కడా వివక్ష చూపించలేదని, బీఆర్ఎస్ నాయకుల పిల్లలు కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ లో చదువుకోవచ్చన్నారు. రాష్ట్రంలో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, వైఎస్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించామని, డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని కేసీఆర్ ఆనాడు ఊరించాడని, పదేళ్లు సీఎంగా ఉండి ఫామ్ హౌస్, ప్రగతి భవన్ కట్టుకున్నాడని విమర్శించారు. ఏ పేదవాడికి ఇళ్లు కట్టి ఇవ్వాలన్న ఆలోచన బీఆర్ఎస్ చేయలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని సీఎం చెప్పారు. దళారులు, దగా లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే డబ్బులు వేస్తున్నామని, ప్రతి ఎమ్మెల్యే మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతున్నారని, వచ్చే బడ్జెట్ లో కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబోతున్నామని సీఎం ప్రకటించారు.

**మేం కట్టిన ప్రాజెక్టులే**

నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ ప్రాంతం అని, ఈ సమస్యకు పరిష్కారం గతంలో దొరకలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నల్గొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ పార్టీ కట్టినవే అని, ఎస్ ఎల్ బీసీ 30 కిలో మీటర్ల టన్నెల్ ను గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని, నల్గొండ జిల్లా పైన కోపం, విషంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ ఎల్ బీసీ ని పూర్తి చేయలేదని ఆరోపించారు. ఎస్ ఎల్ బీసీ ని రెండేళ్లలో పూర్తి చేయడానికి ముందుకు వచ్చామని, కానీ, అనుకోని ప్రమాదం జరిగి 8 మంది చనిపోయారని, ఎస్ ఎల్ బీసీలో 8 మంది చనిపోతే మామ, అల్లుడు, బామ్మర్ది సంతోష పడ్డారని అన్నారు. కడుపులో విషం పెట్టుకున్నవాళ్లు మున్సిపల్ ఎన్నికల్లో తమకు ఓటు వేయమని ఎలా అడుగుతారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సిగ్గు లేకుండా గంగిరెద్దుల్లా ఇంటి ముందుకు వస్తే కర్రు కాల్చి వాత పెట్టాలని, గంజికి గతి లేని వాళ్లు బెంజ్ కార్లు కొన్నారని, అదంతా మందిని ముంచినదే అని, నల్గొండ జిల్లా ప్రజలు కాంగ్రెస్ కు అండగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# సర్‌పై సుప్రీంలో మమత ఫైర్

మొదటి పేజీ తరువాయి..



ఎదుట తన వాదనను వినిపించేందుకు ఐదు నిమిషాల సమయం కోరారు. అందుకు ప్రధాన న్యాయమూర్తి అంగీకరించి, ధర్మాసనం ఎదుట మాట్లాడటానికి ఆమెకు 15 నిమిషాలు కేటాయించారు. కాగా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఇప్పటికే ఒక పిటిషన్ దాఖలు చేసిందని, నిజాయితీగల నిపుణులను మినహాయించడం గురించి వివాదాస్పదమైన సవాళ్లు, భయాలను గతంలో ఎత్తిచూపిన కపిల్ సిబల్ సహా సీనియర్ న్యాయవాదులు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించారని భారత ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.అయినప్పటికీ మమత తాను వ్యక్తిగతంగా వాదనలు వినిపించాలని నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఉద్దేశపూర్వకమైన వాదనలు ప్రారంభించారు. తన విజ్ఞప్తులను భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) విస్మరించిందని ఆరోపణలు చేస్తూ, భారత ఎన్నికల సంఘం అపారదర్శక, తొందరపాటు, రాజ్యాంగ విరుద్ధమైన, చట్టవిరుద్ధమైన చర్యలు చేపట్టి ఓటుహక్కును హరించడానికి దారితీస్తున్నాయని ఆమె ఆరోపించారు. సమస్య ఏమిటంటే, అంతిమంగా మాకు న్యాయం ఎక్కడా లభించడం లేదు. నేను ఇసిఐకి ఆరుసార్లు లేఖలు రాశాను కానీ ఇంతవరకూ నాకు జవాబు రాలేదని ముఖ్యమంత్రి ఆరోపించారు. అనంతరం అది ఎన్నికల సంఘంపై పూర్తిస్థాయి దాడిగా మారింది. ఆమె విజ్ఞప్తి వాస్తవమైనదని, ప్రతి సమస్యకు పరిష్కారముంటుందని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలీలు కూడా భాగమైన ధర్మాసనం పేర్కొంది. ఎస్ఐఆర్ నోటీసులు పంపే సమయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటూ కోర్టు ఇసిఐకు నోటీసు జారీ చేసింది. నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్, ప్రముఖ బెంగాలి కవి జాయ్ గోస్వామి, తృణమూల్ ఎంపీ దీపక్ అధికారి వంటి ప్రముఖ వ్యక్తులకు పంపిన ఎస్ఐఆర్ నోటీసుల గురించి మమత లిఖిత పూర్వకంగా చేసిన ఫిర్యాదుకు స్పందిస్తూ, మీ అధికారులను కాస్త తెలివిగా ప్రవర్తించమని చెప్పండి అంటూ ఇసిని కోర్టు కోరింది. తదుపరి విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

**బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు..**

ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల అధికారాలను తీసేసి, వారి స్థానంలో బీజేపీ పాలిత రాష్ట్రాల నుండి తీసుకున్న 8,300 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారని, సరైన ధృవీకరణ లేకుండా పేర్లను తొలగిస్తున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఫారం 6 దాఖలు చేయడానికి అనుమతి లేదని, ఫలితంగా లక్షలాది మంది తొలగింపులు, జీవించి ఉన్న వ్యక్తులు కూడా చనిపోయినట్లు ప్రకటించారని, ఈ ప్రక్రియను "మహిళా వ్యతిరేకం" అని ఆమె అన్నారు. కేవలం భాషాపరమైన సమస్యలు, అక్షర దోషాల కారణంగా వ్యక్తులను ఓటర్ జాబితాల నుంచి మినహాయించకూడదని బెనర్జీ వాదించారు. ఒక మహిళ తన అత్తగారింటి ఇంటిపేరును ఉపయోగించినందున ఆమె పేరును జాబితా నుంచి తొలగించిన ఉదాహరణను ఆమె ఎత్తి చూపారు. వివాహానంతరం ఒక మహిళ తన ఇంటి చిరునామా మార్చుకుంటే, ఆ పేరును తార్కిక వ్యత్యాసాల జాబితాలో ఉంచిందని ఆమె పేర్కొన్నారు. ఆధార్‌ను అనుమతించకుండా కోర్టు ఆదేశాలను ఇసిఐ ఉల్లంఘిస్తోందని, ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాల్‌ను ఎంపిక చేసుకుని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ఇతర రాష్ట్రాలలో డొమిసైల్ సర్టిఫికెట్లను, కుల సర్టిఫికెట్లను అనుమతిస్తున్నారని, వారు ఎన్నికల ముందు కేవలం బెంగాల్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్నారు. దాదాపు 24 ఏళ్ల తర్వాత, మూడు నెలల్లో దీన్ని పూర్తి చేయాలన్న హడావిడి ఎందుకని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంలో తీర్పు రిజర్వ్‌లో ఉండగా కోర్టు సూచించింది. ముఖ్యమంత్రి ఎస్ఐఆర్ ప్రక్రియను ముడిపడి ఉన్న బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓల) మరణాల విషయాన్ని కూడా ప్రస్తావించారు. పంట కోత కాలంలో, ప్రజలు ప్రయాణాలు చేస్తున్నప్పుడు, 100 మందికి పైగా చనిపోయారు. బీఎల్ఓలు మరణించారు. చాలా మంది ఆసుపత్రిలో చేరారు. మరి అస్సాంలో ఎందుకు కాదు? అని అన్నారు.విచారణ ముగిసే ముందు, బెంగాల్‌ను అణచివేస్తున్నారని మమత ఆరోపించారు. చేతులు జోడించి అయ్యా, దయచేసి ప్రజల హక్కులను పరిరక్షించండి అని న్యాయస్థానం ముందు విజ్ఞప్తి చేస్తున్నప్పుడు నాటకీయత స్పష్టంగా కనిపించింది.

# రాహుల్ దేశద్రోహి

మొదటి పేజీ తరువాయి..

ఆయన ఆరోపించారు. తాను ఇంకా కాంగ్రెస్‌లోనే ఉండి ఉంటే, గాంధీ, ఆయన సహచరులు తనను గౌరవంగా చూసుకునేవారని ఆయన అన్నారు. తన సిక్కు గుర్తింపును నొక్కి చెబుతూ, తాను తన తలపాగాను గర్వంగా ధరిస్తానని బిట్టూ పేర్కొన్నారు. దేశానికి శత్రువులుగా తాను భావించే గాంధీ కుటుంబంతో తాను ఎప్పటికీ కరచాలనం చేయనని ఆయన పునరుద్ఘాటించారు. ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా కూడా రాహుల్ వ్యాఖ్యలను ఖండించారు. మీరు ఈ పాపం చేశారు. మీరు సిక్కులను అవమానించారు, దుర్భాషలాడారు, మేం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇటువంటి వ్యాఖ్యలను సహించబోమని ఆయన అన్నారు.

ఇటువంటి వ్యాఖ్యలు వారికి గల నిరంతర పక్షపాతాన్ని ప్రతిఫలిస్తాయని సిర్సా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం, సిక్కుల పట్ల ఇలాంటి భావాలు కలిగి ఉండటం కాంగ్రెస్ పార్టీ మనస్తత్వంలో ఎలాంటి మార్పు రాలేదని స్పష్టంగా చూపిస్తోంది. 1980వ దశకంలో సిక్కుల పట్ల ఉన్న అదే ద్వేషం నేటికీ కొనసాగుతోందని ఆయన అన్నారు. ఈ విషయంలో జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని రవనీత్ బిట్టు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన రెండు సంవత్సరాల తర్వాత, నేడు ఈ వాగ్వాదం చోటుచేసుకుంది. 2024లో, బిట్టు అమెరికా పర్యటన సందర్భంగా సిక్కుల గురించి కాంగ్రెస్ ఎంపీ చేసిన వ్యాఖ్యలను విమర్శించారు. అంతటితో ఆగకుండా అతడిని దేశంలో నంబర్ వన్ ఉగ్రవాది అని కూడా అభివర్ణించారు.కాంగ్రెస్ పార్టీ ఈ ప్రకటనను తీవ్రంగా ఖండించింది. బిట్టు వ్యాఖ్యలను అత్యంత నీచమైనవి గా అభివర్ణించింది. అతను బీజేపీలోకి మారక ముందు కాంగ్రెస్‌లో అతని రాజకీయ జీవితం ఒక అస్తవ్యస్తంగా ఉందని పేర్కొంది. ఈ వ్యాఖ్యల కారణంగా బీజేపీ అతన్ని తక్షణమే పార్టీ నుండి తొలగించాలని కూడా ఆ పార్టీ డిమాండ్ చేసింది.

# సంజయ్ పార్టీ మారారు అనడానికి సరైన ఆధారాలు లేవు

మొదటి పేజీ తరువాయి..

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు క్లీన్ చిట్ పొందారు.

**నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే : ఎమ్మెల్యే..**

పార్టీ ఫిరాయింపు కేసులో తనకు క్లీన్ చిట్ రావడంపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్పందించకాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదన్నారు. అలాగే తాను బీఆర్ఎస్ పార్టీకి నెలకు రూ.5 వేలు కడుతున్నానని బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు అఫిడవిట్ ఇచ్చానని స్పష్టం చేశారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచానని చెప్పారు. తాను ఇప్పటికీ ఆ పార్టీ ఎమ్మెల్యేగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ బిల్లులు ప్రవేశపెట్టి విప్ జారీ చేస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేగానే మద్దతు ఇస్తానని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి శాలువ కప్పుకున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదు రేవంత్ రెడ్డి ఎక్కడా చెప్పలేదన్నారు.

**కడియం విచారణ వాయిదా..**

పార్టీ ఫిరాయింపు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటోన్నస్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విచారణ ఈ నెల 19న వాయిదా పడింది. ఇప్పటికే అసెంబ్లీ స్పీకర్ నుంచి ఫిరాయింపు నోటీసులుఅందుకున్న కడియం బుధవారం విచచారణ కోసం నేడు స్పీకర్ ఎదుట హాజరయ్యారు. మరోవైపు కడియంపై పార్టీ ఫిరాయింపు పిటిషన్ దాఖలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ కూడా విచారణకు హాజరై తన వాదనలు వినిపించారు. ఆ సమయంలో వివేకానంద తనవద్ద ఉన్న సాక్ష్యాధారాలను స్పీకర్ కు అందించారు. ఈ క్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇరువురు నుంచి వాంగూల్మాలు తీసుకున్నారు. కాగా మున్సిపల్ ఎన్నికలు, ఫలితాలు అన్నీ పూర్తయ్యాక ఈనెల 19న మరోసారి విచారణకు హాజరు కావాలని స్పీకర్ ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేశారు. కాగా ఈనెల 18న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను కూడా మరోసారి విచారణకు హాజరు కావాలని రెండ్రోజుల క్రితం ఆదేశించారు. వీరిద్దరి విచారణ పూర్తయ్యాక అనర్హత పిటిషన్ పై స్పీకర్ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దానం నాగేందర్ విషయంపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

**కాంగ్రెస్ లో చేరావని ఒప్పుకో..**

కడియం శ్రీహరి విచారణ నేపథ్యంలో ఎమ్మెల్యే వివేకానంద కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో పనిచేస్తూ బీఆర్ఎస్ లోనే ఉన్నామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. నీతులు చెప్పడం ఆపి.. కాంగ్రెస్ లో చేరినట్లు స్పీకర్ ఎదుట అంగీకరించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలోనే ఆ పార్టీ తీర్థం పుచ్చుకుని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. స్పీకర్ విచారణలో కాలయాపన చేస్తూ.. అనర్హత నుంచి ఎమ్మెల్యేలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు ..**

పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో పాల్గొన్నారంటేనే పార్టీ ఫిరాయించినట్టు కదా అని ప్రశ్నించారు. ఇంతకు మించిన ఆధారాలు ఇంకేముంటాయి స్పీకర్ గారు? అని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టేసిన స్పీకర్ నిర్ణయాన్ని కవిత తప్పుబట్టారు. పార్టీ మారారనడానికి సరైన ఆధారాలు లేవని స్పీకర్ సంజయ్ కు క్లీన్ చిట్ ఇవ్వడం దారుణమన్నారు. స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఎక్స్ వేదికగా కవిత స్పందించారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాలలో మీరు క్లీన్ చిట్ ఇచ్చిన ఎమ్మెల్యేనే కాంగ్రెస్ పార్టీ బీ–ఫామ్ లు ఇవ్వడం ఎంత వివాదాస్పదం అయ్యిందో లోకమంతా చూసిందన్నారు. అయినా ఆ విషయం మీ దృష్టికి రాలేదా? అని కవిత స్పీకర్ ను ప్రశ్నించారు. జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ మారారు అనడానికి ఆధారాలు లేవంటూ పిటిషన్ కొట్టివేసిన స్పీకర్.. మీరు రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ చైర్‌లో ఉండి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు అనుకోవాలా? అన్నారు. అదే నిజమైతే మీరు భారత రాజ్యాంగాన్ని, చట్ట సభల ఔన్నత్యాన్ని ఎలా కాపాడగలుగుతారు? అని నిలదీశారు.

# మతం పేరుతో రెచ్చగొడుతున్న బిజెపి

మొదటి పేజీ తరువాయి..

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీలుగా గెలిచారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు న్యాయంగా రావాల్సిన పథకాలు, నిధులు, ప్రాజెక్టులు మంజూరు చేయడం లేదన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా, నవోదయ పాఠశాలలు, ఐఐఎమ్ ఏర్పాటుతో పాటు పలు అంశాల్లో కేంద్రం తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా రాష్ట్రం ప్రణాళికలు రూపొందిస్తూ దేశ, అంతర్జాతీయ సంస్థల నుండి పెట్టుబడులను ఆకర్షిస్తుంటే కేంద్రం మాత్రం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించడం లేదని విమర్శించారు. ఆర్ఆర్ఆర్ రోడ్డు, మెట్రో రైలు, మూసీ ప్రాజెక్టు వంటి కీలకాంశాలను విస్మరిస్తోందని మండిపడ్డారు. బయో, ఫార్మ, సెమి కండక్టర్ పరిశ్రమల్లో, టూరిజంలో రాష్ట్రాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.01 శాతం అనీ ఈ లెక్కన కేంద్రం నుండి రూ.3.76 లక్షల కోట్లు దక్కాల్సి ఉందని మహేశ్ కుమార్ చెప్పారు. అయినా గత ఐదేళ్లలో రూ.1.84 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ ఐదేండ్లలో రూ.4.32 లక్షల కోట్లు కేంద్రానికి ఇస్తే రాష్ట్రానికి తిరిగి రూ.3.76 లక్షల కోట్లే ఇచ్చిందన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద పీట వేస్తూ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కడుతున్న పన్నులు గుజరాత్ కు తరలిస్తున్నారని విమర్శించారు. మహిళలకు బడ్జెట్ లో రూ.90 వేల కోట్ల నిధులు కోత పెట్టారన్న ఆయన బీసీలకు ఇచ్చింది రూ.13,600కోట్లు మాత్రమేనన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో ప్రచారంపై టీపీసీసీ స్పందించారు. పవన్ కల్యాణ్ రాజకీయాలు ఏపీలో చేసుకోవాలని సూచించారు. ఆయన తెలంగాణ వ్యతిరేకి అని, గతంలో తెలంగాణ గురించి నీచంగా మాట్లాడారని విమర్శించారు. పవన్ చెప్పారని ఇక్కడ ఎవరూ ఓటు వేయరన్నారు.

# ప్రపంచ సినీ మార్కెట్ కేంద్రంగా హైదరాబాద్



మొదటి పేజీ తరువాయి..

మారుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం కొన్ని దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేసిందన్నారు. సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందన్నారు. సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని చెప్పారు. తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని తెలిపారు. అందుకే వారి పేరు మీద గతేడాది నుంచి సినిమా అవార్డులు ఇస్తున్నట్లు వివరించారు. తద్వారా సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత లే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందన్న భట్టి... గతేడాది జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్నిగుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగంపై వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులుగా ఎంపిక చేశారన్నారు. ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తి స్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలనీ ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పని సరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుంది 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా, ప్రపంచవ్యాప్తంగా ఓ గొప్ప సందేశం ఇచ్చేలా నిర్వహించినట్లు వివరించారు. ఈ ఏడాది కూడా అదే రీతిలో పెద్ద ఎత్తున గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్, ఐ అండ్ పీఆర్ శాఖలకు పూర్తి స్వాతంత్రం, అవసరమైన సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐఅండ్ పీ ఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్ డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కెవెస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్ సిఎం ఖేమ్‌చంద్

మొదటి పేజీ తరువాయి..

ప్రమాణ స్వీకారం చేయనున్న నెమ్చా కిగ్పెన్, లోస్సీ దిఖో కూకీ, నాగా తెగలకు చెందిన వారు. ఉపముఖ్యమంత్రిగా నియమితులైన నెమ్చాకిగ్పెన్, ఢిల్లీలోని మణిపూర్ ప్రభుత్వ గెస్ట్ హౌజ్ నుంచి ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ఆయన సన్నిహితులు తెలిపారు. బిష్ణుపూర్ జిల్లా నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యే అయిన గోవిందాస్ కొంతౌజమ్, తనకు హోం మంత్రిత్వ శాఖ ఛార్జి ఇచ్చినట్టు తెలిపారు. నేను క్రమశిక్షణ, సంయమనంతో, స్థిరత్వం, ప్రజా శాంతిభద్రత పట్ల అంకిత భావంతో మణిపూర్‌కు సేవ చేయడానికి కట్టుబడి ఉన్నానని ఆయన అన్నారు. రాజకీయ పరివర్తన కాలంలో పార్టీలోని అంతర్గత వర్గాలన్నింటికీ ఆమోదయోగ్యమైన, వివాదరహిత వ్యక్తిగా అరవై ఒక్క ఏళ్ల ఖేమ్‌చంద్‌ను పరిగణిస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. క్షేత్రస్థాయిలో ఇంకా రుజువు కానప్పటికీ, రాజకీయ అనిశ్చితి సమయాల్లో ఆయనను ఒక స్థిరమైన పరిపాలనా ఎంపికగా చూస్తున్నారు; ఆయన జనరంజక ప్రసంగాల కంటే సంస్థాగత సామర్థ్యం, క్రమశిక్షణ , నిరాడంబరమైన అధికారంతో అందరినీ ఏకం చేయగలరని వారు అన్నారు.

**అస్థిర శాంతి..**

మణిపూర్‌లోని లోయ ప్రాంతాలలో ఆధిపత్యం వహించే మెయితీ సమాజానికి, కొండ ప్రాంతాలుగా వర్గీకరించిన కొన్ని జిల్లాల్లో ఆధిపత్యం వహించే కుకీ గిరిజన తెగలకు మధ్య ఘర్షణలు చెలరేగిన దాదాపు మూడు సంవత్సరాల తర్వాత, మణిపూర్‌లో అస్థిర శాంతి నెలకొంది. కుకీ తెగలలోని ఒక వర్గం రాష్ట్రం నుండి విడిపోయి, తమ సొంత సమాజం కోసం ప్రత్యేక పరిపాలనను ఏర్పాటు చేయాలని కోరుకుంటోంది. ఆపరేషన్ల నిలుపుదల (ఎస్ఓఒ) ఒప్పందంపై సంతకం చేసిన రెండు ప్రధాన సంస్థల కింద ఉన్న ఇరవై నాలుగు తిరుగుబాటు బృందాలు ఈ చర్చలను నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ ఏర్పాటు చర్చలు గత కొన్ని వారాలుగా జరుగుతున్న సమయంలో, కొన్ని కుకీ పౌర సమాజ సంస్థలు ప్రకటనలు విడుదల చేస్తూ, తాము మణిపూర్‌లోని ఏ ప్రభుత్వంలోనూ భాగం కాబోమని ప్రకటించాయి. ప్రభుత్వంలో భాగమవుతారని భావిస్తున్న కుకీ ఎమ్మెల్యేల నుండి కూడా వారు తమను తాము దూరం చేసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి తీవ్ర విమర్శకులలో ఒకరైన కుకీ నాయకుడు పావోలియన్‌లాల్ హావోకిప్, కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రకటనకు ఒక రోజు ముందు, సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మా ప్రజలపై జరిగిన జాతిపరమైన అత్యాచారాల విషయంలో న్యాయం జరగకుండా, రాజకీయ పరిష్కారం కోసం లిఖితపూర్వక హామీ లేకుండా, కుకీ జో ప్రజా ప్రతినిధులు మణిపూర్ శాసనసభ పక్ష నాయకుడి ఎన్నికలో పాలు పంచుకోలేరు అంటూ పోస్ట్ చేశారు.

చర్చలు కొనసాగినా, అంతర్గతంగా నిర్వాసితులైన ప్రజలను సురక్షితంగా తిరిగి వచ్చేలా చూడాలని మెయితీ పౌర సామాజిక సంస్థలు పేర్కొంటున్నాయి. పునరావాస శిబిరాలలో జీవిస్తున్న వేలాదిమంది ప్రజలు తిరిగి రావడం సహా మరే ఇతర సమస్యల కన్నా ముందు ప్రత్యేక పాలన ఏర్పాటు రూపంలో రాజకీయ పరిష్కారాన్ని కూకీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.కుకీ నాయకులు జాతి కేంద్రిత స్వదేశ డిమాండ్‌ను సృష్టిస్తున్నారని ఆరోపించడానికి మెయితీ నాయకులు ఈ పరిస్థితిని ఉదహరించారు; ఏ భూభాగమూ ఒకే జాతికి ప్రత్యేకమైనది కానందున, చర్చలు కొనసాగిస్తూనే, శిబిరాల్లో క్లిష్ట పరిస్థితుల్లో నివసిస్తున్న ప్రజలు కూడా తిరిగి రావచ్చన్నది మెయితీల వాదన.

# నా సంసారంలో నీ వేలేందుకు..?

## బీఆర్ఎస్ లో ఉన్నానని ఒప్పుకున్నందుకు సంతోషం

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కు జీవన్‌రెడ్డి కౌంటర్

**వుదయం, జగిత్యాల :**

పార్టీ ఫిరాయింపు కేసులో బుధవారం అసెంబ్లీ స్పీకర్ ముందుకు వెళ్లిన సంజయ్ తాను బీఆర్ఎస్ లోనే ఉన్నానని వివరణ ఇచ్చుకోవడం సంతోషకరమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నారో ఆయనకు ఇప్పుడు గుర్తుకు వచ్చిందేమోనన్నారు. బుధవారం జగిత్యాలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇన్నాళ్లూ బీఆర్ఎస్ లో ఉన్న నీవు... కాంగ్రెస్ లో ఎందుకు హల్ చల్ చేశావంటూ సంజయ్ ను నిలదీశారు. నీ సంసారం నువ్వు చేసుకోకుండా నా సంసారంలో ఎందుకు చిచ్చు పెతున్నావంటూ మండిపడ్డారు. స్పీకర్ తీర్పు వచ్చిన తర్వాత అయినా నీ సంసారం నువ్వు చూసుకోవాలని అన్నారు. కాంట్రాక్టులు, అభివృద్ధి అంటే పక్కింటోడికి కన్నం వేయడం కాదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి 20 నెలలు ప్రయాణం చేశారనీ చేసిన ఒక్క అభివృద్ధి ఏంటో చెప్పు అంటూ ప్రశ్నించారు. అభివృద్ధి కోసమే సీఎంతో ప్రయాణం చేస్తున్నట్టు చెబుతున్నాడని ఏం చేశాడో ఒక్కటైనా చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఒక క్రమశిక్షణ గల పార్టీ నాయకుడిగా రాజ్యాంగ నిబంధనల మేరకు చట్టసభలకు ఎన్నికైనప్పుడు మన విధులు నిర్వహించాలన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ రాజకీయం వ్యభిచారం

## కేంద్రమంత్రి బండి సంజయ్

**వుదయం, సిరిసిల్ల :**

అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిసన ఫిరాయింపు ఎమ్మెల్యేలందరూ ప్రస్తుతం గాంధీభవన్‌లోనే సంసారం చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ రాజకీయం వ్యభిచారం చేస్తుందని మండిపడ్డారు. సదరు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు అన్ని ఆధారాలున్నా స్పీకర్ ఒక్కొక్కటీగా కేసులను కొట్టి వేయడం దారుణమన్నారు. ఇలాంటి తీర్పులతో ప్రజాస్వామ్యం అపహాస్యమౌతుందని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో కొనసాగుతూ ఆ మచ్చతో చరిత్రహీనులు కావద్దని సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన పార్టీ స్ట్రీట్ కార్నర్ సమావేశంలో బండిసంజయ్ పాల్గొన్నారు. ఈ పందర్భంగా ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం వరదల్లా నిధులిస్తే, ఆ నిధులను మాజీ మంత్రి కేటీఆర్ పక్కదారి పట్టించాడని కేంద్రమంత్రి ఆరోపించారు. ఆ నిధులతో తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న సిరిసిల్ల పట్టణాన్ని వరదల్లో మునిగేలా చేశాడని కేటీఆర్ పై మండిపడ్డారు. పార్టీలో, గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న కేటీఆర్ సిరిసిల్లను నాశనం చేశాడని విమర్శించారు. వర్షాకాలం వరదలు వస్తే సిరిసిల్లలో పలు కాలనీలతో పాటు ఇటీవల నిర్మించిన కలెక్టరేట్ కూడా నీట మునగడం మనం కళ్లారా చూశామన్నారు. జిల్లా కలెక్టర్ ట్రాక్టర్‌లో ఆ జలదిగ్బందం నుంచి బయటపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు విలువైన గ్రామాలను గ్రామ పంచాయతీలుగా చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని, ఓట్లు వేస్తే సిరిసిల్లను తాను అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డిబోయిన గోపి, రాష్ట్ర అధికార ప్రతినిధి జే సంఘప్పతోపాటు, 39 వార్డుల అభ్యర్థులు, పార్టీ జిల్లా నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జక్రాన్‌పల్లి కెజిబివిలో విషాహారం

మొదటి పేజీ తరువాయి..

నిలకడగానే ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు ప్రాథమికంగా వెల్లడించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనతో ఆసుపత్రికి చేరుకుంటున్నారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేపట్టాలని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అసలు తప్పు ఎక్కడ జరిగిందనే కారణాలు అధికారులు విచారణ చేపడుతున్నారు.

# బీజేపీ హిందుత్వ పార్టీ కాదు

## నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

**వుదయం, నిజామాబాద్ :**

హిందుత్వం కోసం రాజకీయాలు చేసే అవసరం బీజేపీకి లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. అభివృద్ధే తమ పార్టీ ఎజెండా అన్నారు. సోనియా రేవంత్ కంటే తనకే దగ్గరన్నారు. అయినా కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేకి కాబట్టే తాను కాంగ్రెస్‌లోకి వెళ్లలేదన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతీ రూపాయి ప్రజల కోసం ఖర్చు పెట్టి అభివృద్ధి చేయడమే బీజేపీ అజెండా అని అర్వింద్ అన్నారు. అవినీతిపరులకు, పార్టీ మారిన వారికి బీజేపి టికెట్ ఇవ్వలేదన్నారు. బీజేపీ కి ప్రజలు ముందు.. పార్టీ సెకండ్ అని ఇదే మా ఎజెండా అన్నారు. స్వచ్ఛ పాలన కోసం బీజేపీకి ప్రజలు ఓటేయాలని ప్రజలను కోరారు. నిజామాబాదు కార్పొరేషన్ లో బీజేపీ మేయర్ పదవి గెలిస్తే ఏ వర్గానికి, ఓటు బ్యాంక్ కు లొంగకుండా నిజామాబాద్ లో ఆక్రమణలు తొలగిస్తామని అర్వింద్ నగర ప్రజలకు హామీ ఇచ్చారు. అవినీతిరహిత పాలనను, సుపరిపాలనను అందిస్తామన్నారు. బీజేపీ మేయర్ అభ్యర్థిని ఎవరినేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. మెజారిటీ, మైనార్టీ కాదు అభివృద్ధి ఎజెండా గా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. నిజామాబాదుకు వందే భారత్ తెచ్చే బాధ్యత తనదన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి కార్పొరేషన్ కు బకాయి పడ్డ రూ. 8.16 కోట్లు ఎగవేత ధోరణితో ఇంత కాలం చెల్లించలేదన్నారు. ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ కోసమే అస్తిపన్ను బకాయిలు రూ. 8.16 కోట్లు కట్టాడన్నారు. అంత పెద్ద మొత్తాన్ని కట్టించింది తామేనని అర్వింద్ అన్నారు. ఇన్ని రోజులు కట్టిచ్చేటోళ్లు లేరని, ఇప్పుడు కట్టించేటోళ్లు కక్కించెటోల్లచ్చిండ్రని సెటైర్లు వేశారు. మేయర్ పదవి కోసం ఒక్క రోజులో అంత పెద్ద మొత్తంలో కార్పొరేషన్ కు చెల్లించిన వ్యక్తి రేపు మేయర్ అయితే నిలువు దోపిడీ జరుగుతుందన్నారు. కార్పొరేషన్ లో బహిరంగ దోపిడికి తెరలేపి.. ఇందూరు నగరాన్ని పూర్తిగా దోచుకుంటాడని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ బద్దంగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను 17 యేళ్లుగా ఎందుకు చెల్లించలేదో, కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఒక్క రోజులోనే ఎందుకు చెల్లించారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇన్నాళ్లూ లేని డబ్బు ఉన్నట్టుండి ఒకేసారి ఎలా వచ్చాయని ప్రశ్నించిన ఎంపీ... లంకెబిందెలు దొరికాయా..? అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసిన వ్యక్తికి పోటీ చేసే నైతికత లేదన్నారు. అలాంటి వ్యక్తి రేపు మేయర్ అయితే నిజామాబాదు కార్పొరేషన్ ను శ్రీరాముడే కాపాడాలన్నారు. నైతికత, బాధ్యత లేకుండా ప్రజలకు శఠగోపం పెట్టాలనే నైజం నరేందర్ రెడ్డిదన్నారు. ఇలాంటి వారిని ఓటు ద్వారానే శిక్షించాలని అర్వింద్ ప్రజలకు పిలుపునిచ్చారు. 19వ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కకుండా చేయాలన్నారు.

# ఎస్సీ, ఎస్టీ నిధులతో ముస్లింల బుజ్జగింపు..

మొదటి పేజీ తరువాయి..

రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే బీజేపీని గెలిపించాలని నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కమీషన్ల పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు చిన్న చిన్న కాంట్రాక్టర్లు కూడా ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి దాపురించిందని అన్నారు. ఈ అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించాలని నితిన్ నబీన్ ప్రజలకు పిలుపునిచ్చారు.



# గ్రేటర్ హైదరాబాద్



## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**రామచంద్రాపురం డివిజన్ లో రూ.40.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**





**హైదరాబాద్, ఫిబ్రవరి 04 (ఉదయం):** రామచంద్రాపురం డివిజన్‌లో మొత్తం రూ.40.70 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజి రెడ్డి లు బుధవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొదట శ్రీనివాస్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్, రామచంద్రాపురంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, డివిజన్ అభివృద్ధికి నూతన నిధులు మంజూరైన పనులకు శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా శ్రీనివాస్‌నగర్‌లో హిందూ స్మశానవాటిక, గాంధీ బాలవిహార్ పార్క్, ఓల్డ్ రామచంద్రాపురంలో మీట్ మార్కెట్, రాయసముద్రం చెరువు సుందరీకరణ, చెరువులో మురికినీటి మళ్లింపు పనులు, పలు కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఓపెన్ డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్లు, మహిళా సమాఖ్య భవనం, థీమ్ పార్క్ వంటి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రామచంద్రాపురం డివిజన్‌లో మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నాగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ , అధికారులు పాల్గొన్నారు.





## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

**వికారాబాద్, ఫిబ్రవరి4(ఉదయం) :** ఎన్నికల నిబంధనల మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా, సామరస్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా సహకరించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు జి. రవి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ బరిలో పాల్గొంటున్న అభ్యర్థులకు ఎన్నికల నియమావళి , ప్రచార సరళి, వివిధ అనుమతులు, ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేస్తున్న వివరాల సమర్పణ తదితర అంశాలపై చేపడుతున్న అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు జి.రవి పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలోకి దిగారని, ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా ఎన్నికల నిర్వహించుకునేలా అందరి సహకారం అవసరం అన్నారు. అభ్యర్థులు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకునేందుకు అదేవిధంగా మైకుల వినియోగానికి కూడా ముందస్తుగానే అనుమతులు పొందాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ప్రార్థన స్థలాల్లో ప్రచారం చేయకూడదని, వ్యక్తిత్వాన్ని అవమానపరిచే విధంగా ప్రచారాలు నిర్వహించకూడదని ఆయన అభ్యర్థులకు సూచించారు. రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్రంగా పోటీచేసే అభ్యర్థులకు కూడా అన్ని నిబంధనలను వర్తిస్తాయని ఆయన స్పష్టం చేశారు. ప్రతి వార్డులో ఓటర్లందరికి బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వెళ్లే క్రమంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 17 గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒక కార్డును పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చేలా అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు తెలియజేయాలని ఆయన తెలిపారు. పోలింగ్ కు 48 గంటల ముందుగానే ప్రచారాలు పూర్తి చేసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికలు పూర్తిఅయిన 45 రోజుల లోపు ఎన్నికల్లో ఖర్చు చేసిన పూర్తి వివరాలను సమర్పించాలని లేనిపక్షంలో గెలిచిన అభ్యర్థుల ఎన్నికను రద్దు చేయడం జరుగుతుందనే విషయాన్ని అభ్యర్థులు గుర్తించాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజంలో మార్పు రావాలి



**వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఉదయం) :** సామాజిక న్యాయం, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేటులోని సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ సామాజికపరంగా, వివక్షతో కూడిన సమాజంలో మార్పు రావాలన్న సదుద్దేశంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ సమానత్వం, న్యాయం, గౌరవం కోసం నిలబడాలని, ఏ రూపంలోనైనా అన్యాయని ఎప్పుడూ సమర్థించవద్దని సూచించారు. భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నో విలువలతో కూడిన రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని, రాజ్యాంగ సూత్రాలను సమర్థిస్తూ న్యాయమైన, సామరస్య పూర్వకమైన, సాధికారత కలిగిన తెలంగాణ మరియు దేశ కోసం కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్, జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర, డిబిసిడిఓ మాధవ రెడ్డి లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాంకేతిక పురోగతులపై జాతీయ వర్క్ షాప్



**సంగారెడ్డి, ఫిబ్రవరి 04 ( ఉదయం) :** ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతల వినియోగాన్ని పెంచే ఉద్దేశంతో ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ANRF) - PAIR కార్యక్రమం కింద "ఆరోగ్య పరిశోధనలో సాంకేతిక పురోగతులు" అనే అంశంపై ఈ నెల 29 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు ఈ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ, బయోమెడికల్ రంగాల్లో కొత్త సాంకేతికతలపై నిపుణులు ఉపన్యాసాలు ఇచ్చారు. ఏఐ ఆధారిత వ్యాధి నిర్ధారణ, ఆధునిక చికిత్సా విధానాలపై చర్చలు జరిగాయి. పరిశోధకులకు ఉపయోగపడేలా హ్యాండ్స్-ఆన్ శిక్షణ సెషన్లు కూడా నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా ఆరోగ్య రంగ పరిశోధనల్లో సంస్థల మధ్య సహకారం మరింత బలపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## భర్త కోసం భార్య ప్రచారం

**నారాయణపేట ఫిబ్రవరి 04 (ఉదయం)** నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో నీ 7 వార్డులో బిజెపి అభ్యర్థి డి.మల్లేష్ గెలుపు కోసం ఆయన భార్య మంజుల ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.ఉందమ్మా బొట్టు పెడతా మా ఆయనను ఆదరించి కౌన్సిలర్ గా గెలిపించాలని మహిళలకు బొట్టు పెట్టి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు ఆదరించి కౌన్సిలర్ గా గెలిపి స్తే వార్డు అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. గెలిపిస్తే అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తామ ని ప్రజల సమస్యలు పరిష్కరి స్తానని హామీ ఇస్తున్నారు.

## అర్హత లేని వైద్యులు స్కానింగ్ చేస్తే చర్యలు

**జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్**

**నారాయణపేట టౌన్ ఫిబ్రవరి 04 (ఉదయం ప్రతినిధి)**



అర్హత లేని వైద్యులు స్కానింగ్ చేస్తే పిసిపిఎన్ డి టి యాక్ట్ ప్రకారం శిక్షార్హులు అవుతారని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన జిల్లాస్థాయి బహుళ సభ్య అప్రా ప్రియేట్ అథారిటీ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమీక్ష సమా వేశంలో జిల్లా కలెక్టర్ మాట్లా దుతూజిల్లాలో ప్రతీ స్కానింగ్ సెంటర్ ను సందర్శించి అన్నీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీ లించాలని జిల్లా వైద్య ఆరో గ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ కు సూచిం చారు. అర్హత లేని డాక్టర్స్ స్కానింగ్ చేయరాదని, ఒకవేళ చేస్తే జైలు శిక్ష తప్ప దని ఆమె హెచ్చరించారు. జిల్లాలో తక్కువ జెండర్ రేషియో( నిష్పత్తి) ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి (06 ఇయర్స్ ) జెండర్ రేషియో పెంచాలని సూచించారు. మూడేళ్ల క్రితం ఎక్కువ ఉన్న రేషియో ఈ ఏడాది తక్కువ కావడంపై కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తు, కారణాలను విశ్లే షించాలని, గర్భిణి లు రెండోసారి స్కానింగ్ తర్వాత మళ్ళీ స్కానింగ్ కు రాక పోతే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అంతకు ముందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ (06 ) జెండర్ రేషియో గురించి మండలాల వారీగా వివ రించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను తరచూ తనిఖీ చేసి రికార్డులను పరిశీలిస్తానని కలెక్టర్ కు తెలి పారు. కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రతి స్కానింగ్ సెంటర్ లో ప్రతినెలా 10 ఫామ్ ఎఫ్ లను ఆడిట్ చేస్తున్నామని అందులో ప్రతిదీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఫామ్ ఎఫ్ ఆన్ లైన్ లో అప్ లోడ్ అయ్యేలా చూస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు ఎన్ లింగ య్య, ఐఎంఏ ప్రెసిడెంట్ మల్లికార్జున్, సీ. ఐ. శివ శంకర్ పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలు లేని పార్టీకి ఆకర్షితులవుతున్నారు



**షాద్ నగర్, ఫిబ్రవరి 04( ఉదయం):** అవినీతి అక్రమాలకు తావు లేకుండా పరిపాలిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి ఎంతోమంది ఆకర్షితులవుతున్నారని మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి సుజీవన్ రావడం ఎంతో సంతోషంగా ఉందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతున్న సందర్భంగా సుజీవన్ ప్రస్తావన చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, పట్టణ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపి వన్నాడ ప్రకాష్ గౌడ్ తదితరుల సమక్షంలో సుజీవన్ ను పార్టీలోకి చేరుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. సుజీవన్ రాకతో పట్టణంలోని 16, 17, 18 వార్డులపై ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. సుజీవన్ చిరకాల మిత్రుడని ఎల్లవేళలా రాజకీయాల్లో రాణిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారని అలాంటి వ్యక్తి తన పార్టీలోకి రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఎన్నికల తర్వాత పార్టీ మరింత బలోపేతం అవుతుందని వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. పెద్ద ఎత్తున సుజీవన్ ఆధ్వర్యంలో చేరికలు ఉంటాయని స్పష్టం చేశారు. సుజీవన్ పార్టీ అలంకరీటం కోసం కృషిచేసిన తిరుపతిరెడ్డి ప్రకాష్ గౌడ్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**శంకరన్న ప్రతాప్ అన్నల అభివృద్ధి చూసి వచ్చా - సుజీవన్**

ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిల అభివృద్ధి చూసి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితుడయ్యానని సుజీవన్ తెలిపారు. పార్టీలో చేరడం ఆనందంగా ఉందని ఈ ఎన్నికల్లో తనపై పెట్టిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు.

## క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలిద్దాం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 04:-(ఉ దయం ప్రతి నిధి)**




ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో జువాలజీ, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు.

ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు రావడం వల్ల పలువురు అతి ప్రమాదకరమైన క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవలసిన అవసరం ఉందని, అయితే ఈ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుందన్నారు. తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవలసి ఉంటుందన్నారు. క్యాన్సర్ వ్యాధికి వయస్సుతో సంబంధం లేదని ,ఈ వ్యాధిని దేశం నుండి తరిమి వేయవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ అనిత, డాక్టర్ మిథున్ కుమార్ రాథోడ్ ,ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ కుమార్ ఇతర అధ్యాపక బృందము విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ లోనే ప్రసవం

**సంగారెడ్డి, ఫిబ్రవరి 04 (ఉ దయం) :** సంగారెడ్డి జిల్లా కంది మండలంలో మంగళవారం ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. చర్లగూడెం గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ సేవలను ఆశ్రయించారు. 108 సిబ్బంది ఆమెను సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే అంబులెన్స్‌లోనే లక్ష్మీ ప్రసవించింది. అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి అవసరమైన ప్రాథమిక వైద్యం అందించారు. అదృష్టవశాత్తూ తల్లి, శిశువు ఇద్దరూ పూర్తిగా క్షేమంగా ఉన్నారని 108 అంబులెన్స్ పైలెట్ తెలిపారు.

## షాద్ నగర్ మున్సిపల్ పోరులో భార్య భర్తలు

### ఒక వార్డులో పతి.. మరో వార్డులో సతి..



**షాద్ నగర్, ఫిబ్రవరి 04( ఉదయం):** పతి ఉన్నచోట సతికి.. సతి ఉన్నచోట పతికి.. ఇద్దరికీ ఒకే పార్టీ నుంచి టికెట్ ఇవ్వడం అనేది విశేషం.. కానీ సౌమ్యుడుగా, సేవకుడుగా, వార్డులో ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని షాద్ నగర్ బీఆర్ఎస్ అగ్ర నాయకులు రాజకీయంగా వీరికి ప్రోత్సాహం ఇచ్చారు. పట్టణంలోని 09వ వార్డు నుంచి మాజీ వార్డు సభ్యుడు చేగురు వేణుగోపాల్ కు అవకాశం కల్పించడమే కాకుండా, అతని సతీమణి చేగురు లక్ష్మీప్రసన్నకు 28వ వార్డు నుంచి అవకాశం కల్పించారు. దీనితో భార్యాభర్తలు ఒకరికొకరు సహకరించుకుంటూ విజయం వైపు దూసుకుపోతున్నారు. ఇంటింటి ప్రచారాల ద్వారా నిత్యం ప్రజల్లో ఉంటూ తమకు విజయాలు అందించాలని కోరుతున్నారు. దసరా నవరాత్రులైన, వినాయక చవితి నవరాత్రులైన గాంధీ నగర్ లో ముందుండి నడిపించడమే కాకుండా ఆర్థిక సహాయం అందించి వేడుకలను వైభవంగా నిర్వహించే వేణుగోపాల్ కు వార్డు పరిధిలో చాలా మంచి పేరు ఉంది. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునే వ్యక్తిగా గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలోనే రంగంలోకి దిగిన ఈ ఆదర్శ దంపతులకు అడుగడుగున వార్డులో ఆదరణ కనిపిస్తుంది. ఎక్కడ చూసినా ప్రజల్లో వీరి పేరే వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ భార్యాభర్తలు చేస్తున్న ఇంటింటి ప్రచారంలో కూడా ప్రజలు అడుగడుగునా నీరాజనం అందిస్తుండడం విశేషం.

**చైర్మన్ బరిలో చేగూరి..?**

ఇదిలా ఉంటే బీఆర్ఎస్ మున్సిపాలిటీ చైర్మన్ బరిలో చేగూరి వేణుగోపాల్ ఉన్నట్లు తెలుస్తుంది. వివిధ కార్యక్రమాల ద్వారా మంచి పేరు తెచ్చుకొని సౌమ్యుడుగా గుర్తింపు ఉండడం, చైర్మన్ స్థానం బీసీ రిజర్వుడ్ అయిన నేపథ్యంలో బీసీకి అవకాశం ఉండడం ద్వారా చైర్మన్ బరిలో వేణుగోపాల్ ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. అతడు గాని అతని సతీమణి లక్ష్మీ ప్రసన్న గాని టిఆర్ఎస్ అధిక సీట్లు సాధిస్తే చైర్మన్ రేస్ లోకి వచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. పార్టీలోని అగ్రనేతలతో పాటు, పలువురు కౌన్సిలర్లు అభ్యర్థులు కూడా వీరికి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనితో గెలుపు కోసం భార్యాభర్తలు అహర్నిశలు కృషి చేస్తున్నారు. ప్రజల ఆదరణ కూడా ఈ దంపతులకు విపరీతంగా కనిపిస్తుండడంతో బీఆర్ఎస్ గెలిచే స్థానాలలో ఈ రెండు స్థానాలు ఉండే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది.

**మళ్లీ రిపీట్ అవుతుందా..?**

బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో గాంధీనగర్ కౌన్సిల స్థానం నుండి పోటీ చేసిన నరేందర్ మున్సిపల్ కౌన్సిలర్ గా గెలుపొంది మున్సిపల్ చైర్మన్ అయ్యారు. అదే సమయంలో ఆయన సతీమణి మహేశ్వరి కూడా ఇద్దరు కలిసి వేరువేరు వార్డులో పోటీ చేశారు. అయితే భార్యాభర్తలు ఇద్దరు గెలిచి మున్సిపల్ పీఠాన్ని అధిష్టించారు. ఇప్పుడు మళ్లీ సేమ్ అదే విధంగా బిఆర్ఎస్ పార్టీ అదే ఫార్ములాను తెరపైకి తీసుకువచ్చింది. గతంలో లాగానే ఇప్పుడు కూడా ఇదే వార్డు నుండి చేగురు లక్ష్మీప్రసన్న, ఆమె భర్త చేగూరు వేణు ఇరువురు పోటీ చేస్తుండడంతో హిస్టరీ మళ్లీ రిపీట్ అవుతుందా అని పలువురు చర్చించుకుంటున్నారు.






“ప్రెసిడెంట్ ట్రంప్ ఇండియాతో మరో గొప్ప ఒప్పందాన్ని సాధించారు. భారత ప్రధాని మోడీతో ఆయన నేరుగా మాట్లాడారు. వారిద్దరికి మధ్య అత్యంత మంచి సంబంధాలున్నాయి. ఇక ముందు రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయకుండా ఉండడానికి కట్టుబడి ఉంటానని ఇండియా స్పష్టం చేసింది. ఆ మేరకు అమెరికా నుంచి, బహుశా వెనిజువెలా నుంచి చమురును కొనడానికి ఒప్పుకున్నది. ఇది అమెరికాకు దాని ప్రజలకు నేరుగా మేలు చేస్తుంది. అమెరికాలో 500 బిలియన్ల డాలర్ల పెట్టుబడులు పెట్టడానికి కూడా భారత్ అంగీరించింది. – వైట్ హౌజ్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్”

## వేమన పద్యం

**నీళ్లమీద నోడ నిగిడి తిన్నగ బ్రాకు**
**బయట మూరెడైన పారలేదు**
**నెలవు దప్పుచోట నేర్పరి కొరగాడు**
**విశ్వదాభిరామ వినుర వేమా..!**



## సంపాదకీయం

# కుంచించుకుపోయిన కేటాయింపులు

ఇంతటి సువిశాల భారత దేశ వార్షిక ఆదాయ వ్యయాల (బడ్జెట్ ) పట్టిక ఎంత విలువైనదో చెప్పనక్కరలేదు. 140 కోట్ల జనాభా బతుకులపై ప్రభావం చూపే ఈ బడ్జెట్ లో ఏమున్నది దాని వల్ల వారికి ఏమి కలుగనున్నది అనే విశ్లేషణ అవసరం. ఈ బడ్జెట్ లో ఏ రంగానికి ఎంతెంత కేటాయించారు ప్రభుత్వ ప్రాధాన్యా లేమిటనే అంశాలపై ప్రజల దృష్టి పడుతుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మొన్న ఆదివారం నాడు పార్లమెంటుకు సమర్పించిన 2026-27 బడ్జెట్ లో కొన్ని విస్తు పోయే అంశాలున్నాయి.రూపాయి విలువ పడిపోతూ ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో బడ్జెట్ లో గత ఏడాది కంటే కేటాయింపులు పెరిగినా వాటి వాస్తవ విలువ తక్కువగానే ఉంటుంది. అటువంటప్పుడు వివిధ పథకాలకు కేటాయింపులను గతం కంటే తగ్గించివేస్తే అది వాటిపై పిడుగు పాటే అవుతుంది.నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్ లో మోడీ ప్రభుత్వ ప్రధాన గృహ నిర్మాణ పథకం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ( పి ఎం ఎ వై ) కి నిధులను 5.9 శాతం తగ్గించారు. అందరికీ ఇళ్ళు నినాదంతో తలపెట్టిన ఇటువంటి పథకాలకు తక్కువ కేటాయింపులు చేసి సవరించిన బడ్జెట్ లలో మరింత కత్తెర వేయడం వల్ల లక్ష్యాలు నీరుగారిపోయి ఆ మేరకు ప్రజలకు చేసే మేలుకు కోత పడుతుంది. ఆవాసం ఎంత ముఖ్యమైనదో చెప్పనవసరం లేదు.2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 17 లక్షల 70 వేల మంది ఇళ్ళు లేనివారు ఉన్నారు. వాస్తవంలో 30 లక్షల మంది ఉంటారని భావిస్తున్నారు. అలాగే ప్రపంచంలో అత్యధికంగా కోటి ఎనభై లక్షలమంది వీధి బాలలున్నారు. ఇటువంటి దేశంలో గృహ నిర్మాణానికి తగినంతగా నిధులు కేటాయించకపోవడం క్షమించరానిది.అమృత్, స్మార్ట్ సిటీ మిషన్ లకు ఈ ఏడాది నిధులను 20 శాతం తగ్గించేశారు. ఇక్కడ ఇంకో విషయం:ఆరోగ్య సెస్ ను వసూలు చేస్తున్న ప్రభుత్వం ఆ రంగంపై గతం కంటే తక్కువ ఖర్చు చేస్తున్నది.కేంద్రం ఈ సెస్ ను 2018 లో విధించింది. ప్రజల నుంచి అలా వసూలు చేసిన సొమ్మును అది ఆరోగ్య రంగానికి వినియోగించి తమకు అత్యవసర అదనపు సౌకర్యాలు కల్పిస్తారని కోవిడ్ వంటి ఆపత్కాలాల్లో తమకు ముఖం చూపించలేని దుస్థితిని పాలకులు తొలగించుకుంటారని జనం ఆశిస్తారు. జరిగింది అందుకు భిన్నం.ఈ సెస్ కు ముందు 2017-18 లో మొత్తం ప్రభుత్వ ఖర్చులో ఆరోగ్యానిది 2.4 శాతం కాగా 2026-27 లో ఇది 1.9 శాతానికి కుంచించుకుపోయింది. ప్రజల కళ్ళు కప్పుతున్నారు,సంపన్నులకు తలవంచుతున్నారు అనే అభిప్రాయానికి తావివ్వడం దేశానికి మంచిది కాదు.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## ఆర్థిక సామాజిక

# స్వాతంత్ర్యం సాధించామా?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 వసంతాలు పూర్తయ్యాయి.నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చి 77 సంవత్సరాలు కావస్తుంది. ఇండో బ్రిటీష్ రాజ్యాంగం సుమారు 250 ఏండ్లు నాడే వచ్చింది. కానీ మనువాద బ్రాహ్మణీయ భావజాలమే సామాజిక కట్టుబాట్ల రూపంలో ఇప్పటికీ దేశ ప్రజల సామాజిక, సాంస్కతిక రంగాలను అజమాయిషీ చేస్తున్నది.1950 జనవరి 26న భారత దేశానికి వచ్చిన కొత్త రాజ్యాంగం ప్రజాస్వామ్య, మతాతీత, సామ్యవాద లక్ష్యాలను ప్రకటించింది. ఇది సహించని మనువాదులు రాజ్యాంగంపై దాడికి పూనుకున్నారు. అసలు రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలు, ఆదర్శాలు ఏమిటి? రాజ్యాంగ స్వాతంత్ర్యాన్ని సాధించిన మనం ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాలు సాధించామా? ఇవన్నీ సమీక్షించుకోవలసిన సమయం ఇది. అరవై దేశాల రాజ్యాంగాలను తులనాత్మక అధ్యయనం చేసి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నాయకత్వంలో ఉన్నతమైన రాజ్యాంగాన్ని రూపొందించి రాజ్యాంగ పీఠికలు, రాజ్యాంగ ఆశయాలు, లక్ష్యాలను వివరించారు.సమాఖ్య విధానం (ఫెడరిలిజం),లౌకిక విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆర్థిక- సామాజిక న్యాయం మొదలైనవి రాజ్యాంగ లక్ష్యాలుగా ఉన్నాయని కేరళ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసంస్కరణలకు వ్యతిరేకంగా కేశవానంద భారతి వేసిన కేసులో 1973లో సుప్రీంకోర్టు పేర్కొన్నది. కానీ నేడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత సమాఖ్యను (ఫెడరిలిజం) దెబ్బ తీయటానికే ప్రయత్నిస్తున్నది.జిఎస్‌టిని ప్రవేశపెట్టి రాష్ట్రాల ఆర్థిక వనరులు దెబ్బతీసినది. నీతి ఆయోగ్‌కు ఎటువంటి చట్టబద్ధత లేదు. దాని ద్వారా రాష్ట్రాలపై కేంద్రం స్వారీ చేస్తున్నది. రాష్ట్రాలలో ప్రభుత్వాలను రకరకాల కుట్రలతో కూల్చివేస్తున్నది. తమకు నచ్చని రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు సక్రమంగా కేటాయించటం లేదు.

భారత సమాఖ్య దెబ్బతింటే దేశ సమగ్రత ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుంది.భారత దేశ సమగ్రత, ప్రజాస్వామ్య భద్రత లౌకికవాదంతో ముడిపడి ఉన్నది. రాజ్యాంగం మన దేశాన్ని లౌకిక రాజ్యంగా పేర్కొన్నది. అయితే హిందూ - ముస్లింల మధ్య అగాధాన్ని సష్టించి మెజారిటీ హిందూ మత పార్టీగా ఉండాలని బిజెపి అనేక ప్రయత్నాలు చేస్తున్నది. జమ్మూ కశ్మీర్ 370వ ఆర్టికల్ రద్దు చేసింది. మైనారిటీలపై, దళితులపై దాడులు చేస్తూ మతపరమైన విభజనలు సృష్టిస్తున్నారు.పాఠ్య పుస్తకాలను, సిలబస్‌ను మత ఆధారిత అంశాలుగా మారుస్తున్నారు. మత సామరస్యాన్ని దెబ్బ తీసి లౌకిక వాదం బలహీనపడే విధంగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం బాహాటంగా ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఈ మతపరమైన విభజన లౌకిక వాదానికి, దేశ సమగ్రతకు నష్టదాయకం. మన రాజ్యాంగం ప్రాథమిక హక్కుల ద్వారా ప్రజలకు భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించి, సంఘాలను ఏర్పాటు చేసుకోవటానికి ఉద్యమాలకు అవకాశం కల్పించింది. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిరంకుశ విధానాల ద్వారా భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తుంది.భిన్నాభిప్రాయాలను సహించలేని పరిస్థితులు, అసహన పరిస్థితులు దేశంలో ఏర్పడ్డాయి. నిజమైన జాతీయ నాయకులను తమ స్వంతం చేసుకునే పనిలో విఫలం కావడంతో ఆర్ఎస్ఎస్, బిజెపిల కేంద్ర ప్రభుత్వం అధికారిక మీడియా మీద, ఎన్‌సిఇఆర్‌టి మీద, పాఠ్య పుస్తకాల మీద తమ అధికారాన్ని వినియోగిస్తూ సావర్కర్, హెడ్గేవార్ వంటి వారిని గొప్ప జాతీయతావాద నాయకులుగా చెలామణి చేయాలని ప్రయత్నిస్తోంది.రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆర్థిక,సామాజిక న్యాయాన్ని ప్రస్తుత పాలకులు పూర్తిగా విస్మరించారు. ఆర్థిక సంస్కరణల వేగాన్ని పెంచి, లాభాలతో నడిచే పరిశ్రమలను సైతం ప్రైవేటీకరిస్తున్నారు. మానిటైజేషన్ పేరుతో మౌలిక రంగాలను కూడా ప్రభుత్వం అమ్ముతున్నది.

ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పేద ప్రజలకు, రైతులకు, అసంఘటిత రంగ కార్మికులకు, సామాజిక వర్గాలకు నష్టదాయకమే. ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే మార్కెట్, ఒకే పన్ను, ఒకే విద్యా విధానం, ఒకే ఆహారపు అలవాట్లు ఇలా పైకి ఆకర్షణీయంగా కనిపించే నినాదాలతో హిందూత్వ - బిజెపి ప్రభుత్వం మన దేశంలోని వివిధ జాతుల, భాషల, సంస్కృతుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని కాలరాయజూస్తున్నది. మనువాదాన్నే మన దేశ జీవన విధానంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్నది. భిన్న మతాల నడుమ ఉన్న సామరస్యాన్ని నాశనం చేస్తున్నది. రాష్ట్రాల స్వయం



ప్రతిపత్తిని దెబ్బ తీసి, అధికారాలన్నీ తన గుప్పెట్లో బిగించుకుంటున్నది. హిందూత్వ శక్తులు ఎక్కిస్తున్న జాతీయతా భావం నిజానికి దేశంలోని వివిధ జాతుల, మతాల, ప్రాంతాల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరుస్తుంది.భిన్న భాషలను, భిన్న సంస్కతులను బేఖాతరు చేస్తుంది. చివరికి ఏ తిండి తినాలో, ఏ విధంగా దుస్తులు ధరించాలో, ఏ సినిమా చూడాలో, ఎవరిని పెళ్ళాడాలో కూడా శాసిస్తుంది. దీనికి తలొగ్గడం అంటే మన యువత తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే. ఇక్కడ విచిత్రమేమిటంటే చేసే వ్యాఖ్యలూ, వ్యవహారాలూ, దాడులూ, దౌర్జన్యాలూ దేశభక్తి పేరుతో జరుగుతున్నాయి. దేశాన్ని రక్షించే పేరుతో నడుస్తున్నాయి. ఆవులకు ఒక ప్రత్యేకత, పవిత్రత ఆపాదించి మనుషులపై దాడులు, హత్యలూ జరుగుతున్నాయి. దేశభక్తి గురించి మాట్లాడుతూ భిన్నాభిప్రాయంపై దాడులూ,దౌర్జన్యాలూ, మహిళల గొప్పతనం గురించి కీర్తిస్తూ కథలు కల్పిస్తూ స్త్రీలపై, వారి ప్రాథమిక హక్కులపై దాడులూ,దౌర్జన్యాలూ దేశభక్తి పేరుతో జరుగుతున్నాయి. దేశాన్ని రక్షించే పేరుతో నడుస్తున్నాయి. ఆవులకు ఒక ప్రత్యేకత, పవిత్రత ఆపాదించి మనుషులపై దాడులు, హత్యలూ జరుగుతున్నాయి. దేశభక్తి గురించి మాట్లాడుతూ భిన్నాభిప్రాయంపై దాడులూ దౌర్జన్యాలూ, మహిళల గొప్పతనం గురించి కీర్తిస్తూ కథలు కల్పిస్తూ స్త్రీలపై, వారి ప్రాథమిక హక్కులపై దాడులూ, అత్యాచారాలూ నిత్యకృత్యంగా జరుగుతున్నాయి. కాబట్టి కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగం కన్నా మనుస్మృతి ఎక్కువ. ఆధునిక సమాజపు ఆకాంక్షల కన్నా ఆటవిక యుగపు దౌర్జన్యాలపై మక్కువతో దేశాన్ని మనుషులతో చూడలేని అంధత్వంలో నిండియున్నారు.దేశాన్ని మనుషులుగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వారిని కులాలుగా, మతాలుగా విడగొట్టి భావోద్వేగాలను రెచ్చగొట్టే కుతంత్రం దాగి ఉన్నది. ఇలాంటి విధ్వంసం జరుగుతున్నప్పుడు స్వాతంత్ర్యానికి అర్థం ఏముంది? కుల మతాలకు అతీతంగా పౌరుడిని పౌరుడిగా గుర్తించాలన్న రాజ్యాంగం స్ఫూర్తికి మూకస్వామ్యపు ఉన్మాదంతో ఆ స్ఫూర్తికి బహిరంగంగానే తూట్లు పొడుస్తోంది. మనమిప్పుడు స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, చివరకు రాజ్యాంగాన్నీ కాపాడుకోవాల్సిన ఆత్మగౌరవ స్థితిలో ఉన్నాం. హిందూత్వ గురించి గొప్పగా చెప్పుకుంటూ మరో వైపు దేశాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదులకు అప్పజెప్తున్న బిజెపి,ఆరెస్సెస్ ద్రోహాన్ని ఇటువంటి ఆత్మగౌరవ ఉద్యమమే బయటపెట్టగలదు. అందుకే నాడు స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పోరాడిన అమరవీరులు మనకు స్ఫూర్తి కావాలి. భారత రాజ్యాంగాన్ని భారత దేశ ప్రజలమైన మేము.. అని మొదలు పెట్టి ఈ దేశ ప్రజానీకానికి సార్వభౌమాధికారాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు కట్టబెట్టారు.అంతేకాదు సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర, గణతంత్ర రాజ్యంగా రాజ్యాంగ పీఠికలోనే స్పష్టంగా వుంది.అందువల్ల పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్న శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు ఏ ఒక్కటీ సర్వోన్నతం కాదు కాబోవు. ఈ దేశంలో సర్వోన్నత సార్వభౌమాధికారం రాజ్యాంగానిదే అంటే ప్రజలదే. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగా ఈ మూడింటిలో ఒక అంగంలో మెజార్టీ సభ్యులున్నంత మాత్రాన రాజ్యాంగాన్ని మార్చేయాలనుకుంటే అలాంటి పప్పులుడకవు. భారత గణతంత్ర, లౌకిక, ప్రజాతంత్ర లక్షణాన్ని ధ్వంసం చేసి ఆ స్థానంలో ఫాసిస్టు హిందూత్వ రాష్ట్ర ఏర్పాటుకు జరుగుతున్న కుట్రల పట్ల ప్రజాస్వామ్య వాదులందరూ అప్రమత్తంగా వుండాలి. సార్వభౌమాధికారాన్ని కలిగియున్న దేశ ప్రజానీకమే రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని కూడా పరిరక్షించుకోవాలి.



- నాదెండ్ల శ్రీనివాస్
సెల్: 9676407140

# ఫేస్‌బుక్‌కు 22 ఏండ్లు

నాడు హార్వర్డ్ యూనివర్సిటీ విద్యార్థులు, హాస్టల్ రూమ్‌మేట్స్‌గా మార్క్ జుకర్‌బర్గ్, ఎడుఆర్డో సవెరిన్, డస్టిన్ మోస్కొవిట్, క్రిస్ హూజెస్ చదువుతున్న రోజులవి. 04 ఫిబ్రవరి 2004 రోజున యూనివర్సిటీ విద్యార్థుల ప్రయోజనం కోసం జుకర్‌బర్గ్‌తో కలిసి తన మిత్రులు ఫేస్‌బుక్ యాప్‌ను తీసుకురావడం జరిగింది. వెంటనే అమెరికాలోని ఇతర యూనివర్సిటీలు, పాఠశాలల విద్యార్థుల వాడకానికి అందుబాటులోకి రావడం, 2006 వరకు అన్ని దేశాలకు వ్యాపించా ఓ సంచలనం సృష్టించిన సామాజిక మాధ్యమంగా అనతి కాలంలోనే పేరు తెచ్చుకోవడం, వినియోగదారుల మన్ననలు పొందడం డిజిటల్ తెరలపై ఓ విప్లవంగా చరిత్రలో నిలిచిపోయింది. దినదినం తన విస్తరణను పెంచుకుంటూ, వార్తలను ఫీడ్ చేయడం, ఐపిఓ, తదనంతరం ఇన్‌స్టాగ్రామ్, వాట్స్‌యాప్‌లను స్వంతం చేసుకోవడం త్వరత్వరగా జరిగిపోయింది.

**22 ఏండ్ల ఫేస్‌బుక్ ప్రస్థానం:**

నాటి హార్వర్డ్ ప్రాంగణానికి మాత్రమే పరిమితమైన ఫేస్‌బుక్ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడికి అత్యంత సమీప యాప్‌గా పేరు తెచ్చుకుంది. నిజానికి 2003 - 2004లో జుకర్‌బర్గ్ తొలుత “ఫేస్‌మాస్” అనబడే యాప్‌ను తీసుకువచ్చారు. తర్వాత 04 ఫిబ్రవరి 2004 రోజున దానిని “పేస్‌బుక్” అని పేరును మార్చడంతో దాని ప్రభంజనం ప్రారంభమైంది. ఈ-మెయిల్ ఐడీ ఉన్న ప్రతి ఒక 13 ఏండ్లకు పైగా వయస్సు ఉన్న వారు ఫేస్‌బుక్‌ను వినియోగించుకోవచ్చు. సెప్టెంబర్ 2004లో “వాల్”ను ప్రవేశపెట్టారు. 2006లో “న్యూస్ ఫీడ్”, 2012లో ఐపిఓ, 2012లో ఇన్‌స్టాగ్రామ్‌ను స్వంతం చేసుకోవడం, 2014లో వాట్స్అప్‌ను స్వంతం చేసుకొని తన సత్తాను చాటుకొని సామాజిక మాధ్యమాల్లో “రారాజు”గా వెలుగొందుతున్నది. అక్టోబర్ 2021లో తన పేరును “మెటా ప్లాట్‌ఫామ్స్”గా మార్చుకొని అప్రతిహతంగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నది.

మార్క్ జుకర్‌బర్గ్ సిఈఓగా కొనసాగుతున్న ఫేస్‌బుక్ పలు కేసులను కూడా ఎదుర్కొంటున్నది. వ్యక్తిగత సమాచారాన్ని బయట పెట్టడం, లీగల్ సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ తన పట్టును ఏ మాత్రం కోల్పోకపోవడం హర్షదాయకం.



డా. బుర్ర మధుసూధన్ రెడ్డి
9949700037

# యోగులు-స్వాముల కొట్లాట

వేదాలు నాలుగు, వాటి ప్రాతిపదికన దేశంలో ఏర్పాటు చేసిన నాలుగు పీఠాలకు నలుగురు జగద్గురువులైన శంకరాచార్యులు ఉన్నారు. ఒడిషాలోని పూరీలో ఉన్న గోవర్ధన మఠం రుగ్వేదంతో సంబంధం కలిగినది, నిశ్చలానంద అధిపతి, గుజరాత్‌లోని ద్వారకలో ఉన్నది శారదా పీఠం, సామవేదం ప్రకారం నడుస్తుంది, స్వామి సదానంద సరస్వతి, కర్ణాటక శృంగేరిలో ఉన్న శారదా పీఠం యజుర్వేదాన్ని అనుసరిస్తుంది, స్వామి భారతీ తీర్థ.నాలుగవది ఉత్తరాఖండ్‌లో ఉన్న జ్యోతిర్మఠం. ఇది అధర్వణవేదాన్ని పాటిస్తుంది. స్వామి అవిముక్తేశ్వరానంద అధిపతి. ఆయన నియామకాన్ని కొందరు సవాలు చేయటంతో అది సుప్రీం కోర్టుకు చేరింది.ఈ శంకరాచార్యకు యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తున్నది. మాఘ మాసం సందర్భంగా జనవరి 18న మౌనీ అమావాస్య రోజున ప్రయాగరాజ్‌లో పల్లకిలో ఊరేగుతూ త్రివేణీ సంగమంలో స్నానం చేసేందుకు రాగా కుదరదని అధికార యంత్రాంగం అడ్డుకుంది.రద్దీ ఎక్కువగా ఉందని సాకు చెప్పింది, కావాలంటే అందరి మాదిరి కాలినడకన వెళ్ల వచ్చంటూ అసలు ముందు మీరు శంకరాచార్య అని రుజువు ఏమిటి అని ప్రశ్నించింది. ముఖ్యమంత్రి అండ లేదా ప్రమేయం లేకుండా ఇలా జరుగుతుందని ఎవరూ నమ్మటం లేదు. మొత్తం మీద ఈ వివాదం కొత్తమలుపు తిరిగింది. మార్చినెల పదవ తేదీలోగా ఆవును రాష్ట్రమాతగా ప్రకటించాలని, గోవధను, గొడ్డు మాంసాన్ని నిషేధించాలని లేనట్లయితే పది, పదకొండు తేదీలలో లక్నోలో జరిగే సాధు, సంతుల సభలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను “ నకిలీ హిందువు ” గా ప్రకటిస్తామని అవిముక్తేశ్వరానంద ప్రకటించారు.

తానే జ్యోతిర్మఠ శంకరాచార్యనని, తాను చూపిన రుజువును పదిహేను రోజుల తరువాత కూడా తిరస్కరించలేదంటే ఇంతకంటే వేరే ఆధారం ఏమి కావాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని పీఠాధిపతి ప్రశ్నించారు. జనవరి 29న వారణాసిలో నిర్వహించిన పత్రికా గోష్టిలో ముఖ్యమంత్రికి అవిముక్తేశ్వరానంద సవాల్ విసిరారు. యోగి ప్రభుత్వం తనను వేధిస్తున్నదని 1966లో కరపత్రి జీ మహారాజ్ ఉదంతాన్ని గుర్తుకు తెస్తున్నదని అన్నారు.సిఎం సన్నిహితుడు రామభద్రాచార్య తనకు వ్యతిరేకంగా కుట్రపన్నారని, వేధిస్తున్నారని ఆరోపించారు. ఇరవై నాలుగు గంటల్లో తన ఆచార్యత్వం గురించి రుజువులు చూపాలని అడిగారని, చూపి పదిహేను రోజులు కావస్తున్నా ప్రభుత్వం వాటిని కాదని తిరస్కరించలేదని చెప్పారు. యోగి నిజమైన హిందువో కాదో నిరూపించుకోవాలన్నది ఇప్పుడు ప్రశ్న అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం క్షమాపణలు చెప్పి రక్షణ కల్పిస్తే ఫిబ్రవరి ఒకటవ తేదీన ప్రయాగరాజ్‌లో మాఘపూర్ణిమ రోజున పవిత్ర స్నానం చేస్తారని అవిముక్తేశ్వరానంద మీడియా ప్రతినిధి శైలేంద్ర యోగిరాజ్ చెప్పారు గానీ జరిగినట్లు వార్తలు లేవు. మౌనీ అమావాస్య రోజున తన పరివారంతో స్నానమాచరించటానికి అనుమతి నిరాకరించటంతో జనవరి 18 నుంచి పది రోజుల పాటు ప్రయాగరాజ్‌లోని తన శిబిరంలోనే నిరసన దీక్ష చేసి 28వ తేదీన వెళ్లిపోయారు. తన అంతరాత్మ సంతృప్తికోసం సంగమంలో స్నానమాచరించాలని తలపెట్టానని అనుమతించకపోవటంతో ఎంతో కలచివేతకు గురయ్యానని, స్నానమాచరించకుండానే బరువైన హృదయంతో వెళ్లిపోతున్నట్లు శంకరాచార్యచెప్పారు. తానిలాంటి పరిస్థితిని ఎన్నడూ ఊహించలేదన్నారు. స్వామి అనుచరులు బారికేడ్‌ను ధ్వంసం చేసినట్లు పోలీసులు ఆరోపించారు.శంకరాచార్య ఎవరనేది సుప్రీం కోర్టులో వివాదం ఉన్నందున మీరు శంకరాచార్య అని ఎలా చెప్పుకుంటారంటూ అధికార యంత్రాంగం నోటీసు జారీ చేసింది.

శంకరాచార్య పట్ల అనుసరించిన వైఖరి దురహంకారానికి నిదర్శనం, తీవ్ర అరిష్టదాయకమని సమాజవాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ వర్ణించారు.యోగి ప్రభుత్వ చర్యతో ప్రపంచంలోని సనాతనులందరూ బాధపడ్డారని, అధికారం బిజెపిని గుడ్డిదానిగా మార్చిందన్నారు.కాంగ్రెస్ పార్టీ కూడా శంకరాచార్యకు మద్దతుగా నిలిచింది.తప్పిదాన్ని సరిచేసుకొనేందుకు మాఘపూర్ణిమ రోజున లాంఛనాలతో స్నానమాచరించేందుకు అధికారులు చూస్తున్నారని అవిముక్తేశ్వరానంద చెప్పగా అలాంటిదేమీ లేదని అధికారవర్గాలు చెప్పాయి.తనకు క్షమాపణ చెప్పాలని, రానున్న రోజుల్లో నలుగురు శంకరాచార్యలకు ప్రామాణిక లాంఛనాలతో పవిత్ర స్నానాలు ఆచరించే విధంగా నిబంధనలు రూపొందించాలని స్వామి డిమాండ్ చేశారు. జనవరి 18 ఉదంతంపై సిబిఐ విచారణకు ఆదేశించాలంటూ అలహాబాద్ హైకోర్టులో ఒక పిటీషన్ దాఖలైంది. ప్రయాగరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, మేలా అధికారిపై కేసులు దాఖలు చేయాలని కూడా దానిలో కోరారు. యోగి ఆదిత్యనాథ్‌పై అవిముక్తేశ్వరానంద చేసిన ఆరోపణలతో మనోభావాలు దెబ్బతిన్న కారణంగా తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు రాష్ట్ర జిఎస్‌టి ఆయోధ్య ఉపకమిషనర్ ప్రశాంత కుమార్ సింగ్ ప్రకటించారు.రాజీనామాను నేరుగా గవర్నర్‌కు పంపారు, అయితే దాన్ని ఆమోదించిందీ లేనిదీ





తెలియదు..

జ్యోతిర్మఠ్ పీఠం శంకరాచార్య గురించి గత ఎనిమిది దశాబ్దాలుగా వివాదాలు నడుస్తున్నాయి.అవిముక్తేశ్వరానంద 2022 నుంచి శంకరాచార్యగా గుర్తింపు పొందారు. అయితే అప్పటి నుంచీ వివాదం ప్రారంభమైంది. ఎక్కడా లేని విధంగా స్వామి రామకృష్ణ తీర్థ మరణించిన తరువాత గత 168 సంవత్సరాల నుంచి ఈ పీఠానికి గుర్తింపు పొందిన శంకరాచార్యల గురించి వివాదాలు నడుస్తున్నాయి. అనేక మంది తమను పీఠాధిపతులుగా ప్రకటించుకొని కొనసాగారు.స్వాతంత్ర్యానికి ముందు 1941లో మిగిలిన ముగ్గురు శంకరాచార్యులు ఉత్తరాఖండ్ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించాలని స్వామి బ్రహ్మానంద సరస్వతిని కోరారు. ఆయన 1953 మే 20వ తేదీన మరణించినప్పటి నుంచి వారసత్వం గురించి ఇప్పటి వరకు వివాదాలు కొనసాగుతున్నాయి.బ్రహ్మానంద శిష్యుడు హరిహరానంద పీఠాన్ని అలంకరించేందుకు నిరాకరించారు. వారసుడిగా శాంతానంద సరస్వతి అని బ్రహ్మానంద విల్లు రాసినట్లుగా చెప్పటమే దీనికి కారణం. విల్లు చట్టబద్ధతను ఇతర శంకరాచార్యులు ప్రశ్నించారు. ఆది శంకరుడు మహాత్మన్యాయ మహానుశాసనం ప్రకారం విల్లుద్వారా వారసుల నియామకం చెల్లదని వారు పేర్కొన్నారు. తరువాత కూడా వివాదాలు కొనసాగాయి. 1973లో స్వామి కృష్ణబోధ్ మరణంతో స్వామి స్వరూపానంద నియామకం జరిగింది. తరువాత వాసుదేవానంద సరస్వతిని కూడా శంకరాచార్యగా గుర్తించటంతో ఒకేసమయంలో ఇద్దరు శంకరాచార్యులు తయారయ్యారు. ఇది కోర్టుకెక్కటంతో 2017లో వీరిద్దరినీ గుర్తించేందుకు అలహాబాద్ హైకోర్టు నిరాకరించింది. స్వామి స్వరూపానంద 2022 సెప్టెంబరు 11న మరణించారు. ఆ మరుసటి రోజే తానే నూతన శంకరాచార్య అని స్వామి అవిముక్తేశ్వరానంద ప్రకటించుకున్నారు. అయితే అక్టోబరు 16నఆచారం ప్రకారం నిర్ణయించిన పీఠాధిపత్య స్వీకార కార్యక్రమాన్ని సుప్రీం కోర్టు నిలిపివేసింది. అయితే కోర్టు ఉత్తరువులో పలు చోట్ల అవిముక్తేశ్వరానందను శంకరాచార్యగా ప్రస్తావించటం సమస్యను జటిలం చేసింది.కోర్టు అలా పేర్కొన్నది కనుక తానే ఆ స్థానంలో ఉన్నట్లు అప్పటి నుంచి అవిముక్తేశ్వరానంద చెబుతున్నారు.పీఠంలో కొనసాగుతున్నారు. సాంప్రదాయాలు, చట్టపరమైన అంశాల గురించి కోర్టు ఇంతవరకు తేల్చలేదు. దీనికి తోడు రాజకీయనేతలు కూడా వేలుబెట్టటం మరింతగా వివాదాన్ని పెంచింది. ఈ కారణంగానే ఉత్తర ప్రదేశ్ అధికార యంత్రాంగం మీరు శంకరాచార్యులనేందుకు ఆధారాలేమిటని ప్రశ్నించింది, పల్లకిలో ఊరేగుతూ స్నానానికి వెళ్లటాన్ని అడ్డుకుంది.

పదిరోజుల పాటు జరిపిన ధర్నా సమయంలో మాటల తూటాలు పేలాయి. యోగి ఆదిత్యనాథ్‌ను హిందువుగా పిలవాల్సిన అవసరం లేదని, అతన్ని తాను అక్బర్, ఔరంగజేబ్ అంటానని, సదరు వ్యక్తి దేవాలయాల కూల్చివేతకు మద్దతు పలికాడని అవిముక్తేశ్వరానంద ధ్వజమెత్తారు. ధర్మం పేరుతో కొందరు వ్యక్తులు బలహీనపరిచేందుకు కుట్రలు పన్నుతున్నారంటూ పేరు పెట్టకుండా యోగి ఆదిత్యనాథ్ ధ్వజమెత్తారు.ఇలాంటి వారి పట్ల సనాతన ధర్మాన్ని నమ్మేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. హర్యానాలో ఒక మతపరమైన క్రతువులో మాట్లాడుతూ ఒక యోగి అంటే అన్నింటినీ త్యజించిన వాడు, ఒక స్వామి అంటే ధర్మం, జాతికంటే గొప్పవ్యక్తి కాదు. అతనికేమీ వ్యక్తిగత ఆస్తి ఉండదు,అనేక మంది కాలనేమి వంటి వారు ఉన్నారు.(రామాయణంలో హనుమంతుడు లక్ష్మణుడి కోసం సంజీవినీ మూలిక తెచ్చేందుకు హిమాలయాలకు ఎగిరి వెళుతున్న సమయంలో కాలనేమి అనే రాక్షసుడు మునివేషంలో వచ్చి తప్పుదారి పట్టించేందుకు చూస్తాడు) స్వాముల పేరుతో ఉండేవారు ధర్మం ముసుగు వేసుకుంటారు.వారు సనాతన ధర్మాన్ని బలహీన పరిచేందుకు కుట్ర చేస్తున్నారు. అయితే యోగి మాట్లాడిన కొద్ది గంటల తరువాత అవిముక్తేశ్వరానందకు మద్దతుగా ఉత్తర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య ముందుకు వచ్చారు. భగవాన్ శంకరాచార్య లేదా గౌరవనీయమైన స్వాములు, ఆచార్యలు ఎవరి పట్లా కూడా అగౌరవాన్ని ప్రదర్శించకూడదని, అలాంటి ఉదంతాలు జరిగినట్లు వెల్లడైతే విచారణ జరుపుతామని, తప్పుచేసిన వారి మీద చర్య తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి మీడియాకు చెప్పారు. శంకరాచార్యకు పాదాభివందనం చేస్తాం, పవిత్ర స్నానం ఆచరించాలని కోరతాం. వివాదం దాంతో సమసి పోవాలి. ఎవరైనా తప్పు చేస్తే విచారణ జరిపి బాధ్యులైన వారి మీద చర్య తీసుకుంటామని చెప్పారు.శంకరాచార్యను అవమానించటం అంటే సనాతన ధర్మాన్ని అవమానించటమే అని బిజెపి నేత సునీల్ భరాలా విమర్శించారు. ప్రయాగరాజ్ అధికారులు దయ్యాల మాదిరి అవమానించారని, శంకరాచార్య శిష్యుల శిఖలు పట్టుకొని లాగారని అన్నారు.బిజెపి నేతల ఈ పరస్పర విరుద్ధమైన వ్యాఖ్యలతో ఆ పార్టీలో ఉన్న గందరగోళంతో పాటు విబేధాలు కూడా వెల్లడయ్యాయి. వ్యక్తులుగా అభిప్రాయాలు వెల్లడించటం మినహా పార్టీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేని దుస్థితిలో ఉంది. అనేక మంది సంత్‌లు, ఆలిండియా అఖారాపరిషత్ కూడా అవిముక్తేశ్వరానందకు మద్దతు పలికింది.యోగి-శంకరాచార్య మధ్య వివాదం కొత్తగా తలెత్తింది కాదు,పరోక్షంగా చాలా కాలం నుంచి కొనసాగుతున్నది,అవిముక్తేశ్వరానంద బ్రాహ్మణ సామాజిక తరగతికి చెందగా యోగి ఠాకూర్.గతేడాది కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట, మరణాల గురించి యోగి అబద్దాలు చెప్పినందున రాజీనామా చేయాలని గతేడాది జనవరిలోనే అవిముక్తేశ్వరానంద డిమాండ్ చేశారు.నలభై రోజుల్లో ఆవును రాష్ట్రమాతగా ప్రకటించాలని,గొడ్డు మాంస ఎగుమతుల నిషేధం చేయకపోతే యోగిని నకిలీ హిందువుగా ప్రకటిస్తామని శంకరాచార్య చేసిన ప్రకటన ఏమౌతుందో ఆసక్తి కలిగిస్తోంది !



ఎం కోటేశ్వరరావు
8331013288

# జాతీయం-అంతర్జాతీయం

## ప్రధానిని ఘెరావ్ చేసేందుకు మహిళా ఎంపీల యత్నం?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఉదయం):** బుధవారం సాయంత్రం రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై జరిగే చర్చకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇచ్చే అవకాశం ఉందనే సంకేతాల మధ్య, ప్రతిపక్షాలకు చెందిన మహిళా ఎంపీలు సభలో ఆయన సీటు చుట్టూ ఉన్న ప్రదేశం నుండి కదలడానికి నిరాకరించడంతో లోక్‌సభ వాయిదా పడిందని తెలుస్తోంది.

బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నెహ్రూపై చేసిన వ్యాఖ్యల నుంచి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తన మాజీ సహచరుడు, ప్రస్తుత బీజేపీ ఎంపీ రవనీత్ సింగ్ బిట్టూను మిత్ర ద్రోహి అని పిలవడం వరకు పార్లమెంటు బుధవారం అట్టుడికింది. లోక్‌సభ తిరిగి సాయంత్రం 5 గంటలకు సమావేశమైనప్పుడు, వివిధ అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న గందరగోళం మధ్య స్పీకర్ సభను వాయిదా వేశారు.



**మోడీని ఘెరావ్ చేద్దామనుకున్నారా?**

ప్రతిపక్షాలకు చెందిన, ముఖ్యంగా కాంగ్రెస్‌కు చెందిన మహిళా ఎంపీలు సభలో మోడీ కూర్చునే స్థానం వద్ద అడ్డుగా నిలబడ్డారని పార్టీ వర్గాల కథనం. ఆయన ఆ స్థానం వద్దకు చేరుకోవడానికి అటుగా నడిచి రావలసి ఉంటుంది. కాంగ్రెస్ ఎంపీలు వర్షా గైక్వాడ్, జ్యోతిమణి సహా పలువురు మోడీ సీట్ వద్ద నిలబడి అక్కడి నుంచి కదిలేందుకు నిరాకరించారు. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వారికి నచ్చచెప్పేందుకు యత్నించి విఫలమైనట్టు తెలుస్తోంది.

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా మాట్లాడుతూ, కేంద్రమే ప్రతిపక్షాల ఉపన్యాసాన్ని రాసివ్వలేదని, మాకు కావాలనుకున్నది మేం మాట్లాడతామని అన్నారు. ప్రతిపక్షానికి చెందిన మహిళా ఎంపీలు ప్రధానిని అడ్డుకోవాలనుకుని, సభ ప్రారంభం కాకముందే వచ్చేశారని కొన్ని వర్గాల కథనం. వారి వైఖరి చాలా మొండిగా కనిపించిందని, గురువారం ప్రధాని ఉపన్యాస సమయంలో వారు అంతరాయం కలిగించేందుకు ప్రయత్నిస్తారని తెలుస్తోంది. ప్రధానమంత్రి సభలోకి నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు మహిళా ఎంపీలు ఆయనను ఘెరావ్ చేయడానికి ప్రయత్నిస్తారని ప్రభుత్వం భావిస్తోందని వారు చెప్పారు, అందుకే ఆ రోజుకు సభను వాయిదా వేయాలని నిర్ణయించారు. దీని ఫలితంగా, లోక్‌సభను ఆ రోజుకు వాయిదా వేయడంతో మోదీ ప్రసంగం ఆలస్యమైంది.

## బడ్జెట్‌లో లోపాలు చెప్పగలరా?

**ఉదయం:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సీతారామన్ మాట్లాడుతూ.. ఆయన చేసిన వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారం లేదని అన్నారు. బడ్జెట్‌లో లోపాలు ఉన్నాయని చేస్తున్న ఆరోపణలను నిరూపించే అంశాలను కాంగ్రెస్ నేత తన ముందు నిలబడి చెప్పగలరా?అని సవాల్ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలన్నారు.

తమ ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న కార్మిక మార్కెట్ అవసరాలను తీర్చడానికి వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాలు వంటి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని..దేశం ఎదుర్కొంటున్న నిజమైన సంక్షోభాలపై



దృష్టి సారించలేకపోయిందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు లేవని, తయారీ రంగం పతనమవుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులు పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులు, ప్రపంచ దేశాల నుంచి తగులుతున్న ఎదురు దెబ్బలు వంటి అంశాలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

## పుస్తకానికి, పుస్తకం

### పార్లమెంటులో అధికార, విపక్షాల ఆరోపణ, ప్రత్యారోపణలు

> దుబే వ్యాఖ్యల కారణంగా, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వడానికి ముందే సభ వాయిదా పడింది. సాయంత్రం 5 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ, చివరి క్షణంలో దానిని ఆ రోజుకు వాయిదా వేయడంతో మోదీ ప్రసంగం కూడా వాయిదా పడింది.

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఉదయం):** బుధవారం పార్లమెంటులో పుస్తకాల యుద్ధం సభను రెండుగా చీల్చేసింది. ప్రచురితమైన, అప్రచురితమైన పుస్తకాల నుంచి పరస్పర విరుద్ధమైన భాగాలను చదవడం సభలో అంతరాయాలకు దారి తీసింది. బీజేపీ ఎంపి నిషికాంత్ దూబే, నెహ్రూ గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, ఎడ్వినా అండ్ నెహ్రూ వంటి వివాదాస్పద పుస్తకాల నుంచి ఉటంకించిన తర్వాత మోదీ ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందంటూ ప్రతిపక్షం విరుచుకుపడింది. నిజానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడకుండా నిలిపివేసిన విషయం తెలిసిందే.



పార్లమెంటు పనితీరు నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఎక్కువ అనుకూలంగా ఉందని విమర్శిస్తూ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ, దుబేపై తీవ్రంగా మండిపడ్డారు. భారతదేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఆయన కుమార్తె ఇందిరా గాంధీ, సోనియా గాంధీతో సహా గాంధీ కుటుంబాన్ని అయ్యాషీ, మక్కారీ, భ్రష్టాచార్ (విలాసవంతమైన జీవితం, మోసం, అవినీతి)కి పాల్పడ్డారని ఆరోపిస్తూ, దూబే పలు పుస్తకాల నుండి కొన్ని భాగాలను ఉటంకించిన తర్వాత ఈ ఘటన జరిగింది.

తాను మాత్రమే పార్లమెంటును నడుపుతామని చూపించుకోవాలని మోడీ ప్రభుత్వం అనుకుంటుందని, ఇది స్పీకర్ పదవికి, హోదాకి, పార్లమెంటుకి, ప్రజాస్వామ్యానికి, ఈ దేశ ప్రజలకు కూడా అవమానమేనని పార్లమెంటు బయట మాట్లాడుతూ ప్రియాంక విమర్శించారు.

సభ తిరిగి మధ్యాహ్నం రెండుగంటలకు సమావేశం కాగానే, రాహుల్ గాంధీ అప్రచురితమైన పుస్తకం నుంచి కొన్ని వాక్యాలు చదివినందున, గాంధీ కుటుంబాన్ని బహిర్గతం చేయడం తన వంతంటూ, మాట్లాడేందుకు దూబేలేచి నిలబడ్డారు. ఆయన తన ఉపన్యాసంలో పలు పుస్తకాలను ప్రస్తావించారు.

గాంధీ కుటుంబంపై పుస్తకాల జాబితాను బీజేపీ ఎంపి చదవడాన్ని కొనసాగిస్తుండగా, లోక్‌సభ స్పీకర్ జోక్యం చేసుకున్నారు.

సభ కార్యకలాపాలకు సంబంధించిన విషయాలు తప్ప, సభ్యులు ఏ పుస్తకం, వార్తాపత్రిక లేదా లేఖ నుండి చదవడాన్ని నిషేధించే నియమం 349ను ఉటంకిస్తూ, స్పీకర్ ఈ విషయాన్ని తాను అనుమతించలేనని అన్నారు.

గత రెండు రోజులుగా రాహుల్ గాంధీ మాజీ సైన్యాధ్యక్షుడు జనరల్ నరవణే ప్రచురితం కాని జ్ఞాపకాల పుస్తకంతో లోక్‌సభలో నిలబడినప్పుడు ఈ విషయంపై ఇప్పటికే ఒక తీర్పు ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

దూబే వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష సభ్యులు ఏకమై నిలబడటం, ఆయన తన ప్రసంగాన్ని ఆపే సూచనలు కనిపించకపోవడంతో, స్పీకర్ లోక్‌సభను సాయంత్రం 5 గంటల వరకు వాయిదా వేశారు.

శాసనసభ చర్చల్లో తన కుటుంబం పేరును పదే పదే ప్రస్తావించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రియాంక గాంధీ, మోదీ ప్రభుత్వం సభను అడ్డుకోవాలనుకున్నప్పుడు, నిషికాంత్ దుబేను మాట్లాడమని చెబుతుంది అని మండిపడ్డారు.

ఒకవైపు, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని పార్లమెంటులో ప్రచురించని ఒక పుస్తకం నుండి ఉటంకించడానికి అనుమతించరు. మరోవైపు, నిషికాంత్ దుబే ఆరు పుస్తకాలతో కూర్చుని, వాటిని బహిరంగంగా ప్రదర్శిస్తూ, వాటి నుండి ఉటంకిస్తున్నా, అతని మైక్రోఫోన్‌ను మాత్రం ఆపివేయరు," అని ఆమె అన్నారు.

జనరల్ నరవణే చేసిన పనిని ప్రస్తావించకుండా ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకోవడం ద్వారా, నరేంద్ర మోదీ ప్రభుత్వం మొత్తం ప్రతిపక్షాన్ని, ప్రతిపక్ష ఎంపీలకు ఓటు వేసిన కోట్లాది మంది ప్రజల నోళ్లు మూయించాలనిచూస్తోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు.

ఒకవైపు ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు, మరోవైపు ఎవరో ఒకరికి లేచి అన్ని రకాల అసంబద్ధమైన విషయాలు మాట్లాడటానికి అనుమతిస్తున్నారు. సభలో నెహ్రూ పేరును పదే పదే ప్రస్తావిస్తున్నారు, అని ఆమె అన్నారు.

భారత్ దృష్టిని మళ్లించడానికి ఇదొక ఎత్తుగడ అని ఆరోపిస్తూ, జనరల్ నరవణె ఏం రాశారో ప్రజలకు తెలియడం మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదు. మన సరిహద్దుల్లో చైనా సైన్యం నిలిచినప్పుడు, ఏం చేయాలో మన నాయకులు నిర్ణయించుకోలేకపోయారని ఆమె విమర్శించారు.

ఇప్పుడు యుద్ధానికి రంగం సిద్ధమైంది. ప్రచురితం కాని ఒక పుస్తకం నుండి ఉటంకించడానికి ప్రయత్నిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీపడ్డారని రాహుల్ గాంధీ ఆరోపించిన తర్వాత, బుధవారం బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారు. నెహ్రూగాంధీ కుటుంబం దశాబ్దాలుగా చేసిన మోసం, ద్రోహం, అవినీతి వివరాలు ఉన్నాయని తాను చెప్పిన అనేక పుస్తకాలను ఆయన ప్రదర్శించారు.

## వాణిజ్య ఒప్పందంతో ఆ రంగాలకు ముప్పులేదు

### పీయూష్ గోయల్

**ఉదయం:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నప్పటికీ వ్యవసాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను వీడలేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్ పేర్కొన్నారు. దేశంలోని ముఖ్యమైన రంగాల్లో దేనినీ విస్మరించలేదన్నారు. ఇరుదేశాల ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకొని దౌత్య సంబంధాలపై ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఇందులోభాగంగా 140 కోట్ల మంది దేశ ప్రజల ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఏడాది పాటు అమెరికాతో పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం దీనిపై ట్రంప్ ప్రకటన వెలువరించారని తెలిపారు.

భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో మాట్లాడుతూ పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారని గోయల్ పేర్కొన్నారు. తోలు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని కార్మికులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాంల కన్నా తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయని పేర్కొన్నారు. దీనిపై త్వరలో రెండు దేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయని, అందులో మరిన్ని వివరాలు వెల్లడవుతాయన్నారు.



## అవినీతి ఆరోపణల్లో మాజీ ఎమ్మెల్యే అరెస్టు

**జైపూర్, ఫిబ్రవరి 4 (ఉదయం):** ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో తన నియోజకవర్గంలోని పాఠశాలలకు నాణ్యత లేని క్రీడా సామగ్రిని సరఫరా చేయడంలో ఎమ్మెల్యే నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మాజీ స్వతంత్ర ఎమ్మెల్యే బల్జీత్ యాదవ్‌ను అరెస్టు చేసింది. అతడిని జైపూర్‌లోని ఈడీ కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు ఆయనను మూడు రోజుల రిమాండ్‌కు పంపింది. ఒక రాజకీయ కుట్రలో భాగంగానే తనను ఇరికిస్తున్నారంటూ కోర్టుకు వెడుతున్న సమయంలో బల్జీత్ యాదవ్ ఆరోపించారు.



**నిర్బంధం, అరెస్టు**

మంగళవారం రాత్రి అల్వార్‌లోని షాజహాన్‌పూర్ టోల్ ప్లాజా వద్ద (ఢిల్లీ-జైపూర్ జాతీయ రహదారిపై ఉన్న ఎన్‌హెచ్‌ఏఐ కార్యాలయం సమీపంలో) యాదవ్‌ను ఈడీ జైపూర్ ప్రాంతీయ యూనిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం అతడిని జైపూర్‌లోని ఈడీ కార్యాలయానికి తీసుకువచ్చి, విచారణ తర్వాత అరెస్టు చేశారు.

**ఎమ్మెల్యే నిధుల దుర్వినియోగం ఆరోపణలు**

స్థానిక ప్రాంత అభివృద్ధి నిధి (ఎమ్మెల్యే ఫండ్) నుంచి రూ. 3 కోట్లకు పైగా నిధులను దుర్వినియోగం చేసి, స్వాహా చేశారనే ఆరోపణలపై యాదవ్‌ను నిందితుడిగా పరిగణించారు..

**సోదాలు, పీఎంఎల్ఏ కేసు**

జనవరి 2025లో, ఈడీ జైపూర్‌లో ఎనిమిది చోట్ల, దౌసా, బహ్రోర్‌లో ఒక్కో చోట సహా యాదవ్‌కు చెందిన ఆవరణలలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో కీలక పత్రాలు, నేరారోపణకు సంబంధించిన ఆధారాలు లభించాయి. ఈ విషయంలో ఈడీ పీఎంఎల్ఏ చట్టం కింద కేసు నమోదు చేసింది. దీనితో పాటుగా, రాజస్థాన్‌కు చెందిన యాంటీ కరప్షన్ బ్యూరో కూడా యాదవ్, మరో ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసింది.

**అవినీతి వ్యతిరేక ఇమేజ్**

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్వతంత్ర ఎమ్మెల్యేగా సేవలు అందిస్తున్న తరుణంలో బల్జీత్ యాదవ్ తనను తాను అవినీతి వ్యతిరేక పోరాట యోధుడిగా చిత్రీకరించుకున్నాడు. ఉదయం నుండి సాయంత్రం వరకు నల్లటి దుస్తులు ధరించి జైపూర్‌లోని సెంట్రల్ పార్క్‌లో అతను పరుగెత్తడమే కాక అవినీతిని బయటపెట్టిన వారికి 51,000 రూపాయల బహుమతిని ప్రకటించే పోస్టర్లను తన నియోజకవర్గంలో ప్రదర్శింప చేశాడు.

## గత 5 ఏళ్లలో 70 వేలకు పైగా చిత్రాలకు ధ్రువీకరణ జారీ చేసిన సీబీఎఫ్‌సీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (పిఐబి):** సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని చట్టబద్ధ సంస్థ 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ మండలి).. సినిమాటోగ్రాఫీ చట్టం 1952, సినిమాటోగ్రాఫీ సర్టిఫికేషన్ నియమాలు 2024, సంబంధిత మార్గదర్శకాల ప్రకారం సినిమాల ప్రదర్శన కోసం వాటికి ముందుగా ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తుంది.

దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, భద్రత, శాంతిభద్రతలు, సభ్యత, నైతికత, పరువు నష్టం, కోర్టు ధిక్కరణ లేదా నేరానికి ప్రేరేపించడం వంటి చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినప్పుడు మాత్రమే చిత్రాల్లో కోతలు, మార్పులు సిఫార్సు చేస్తుంది.

గత ఐదేళ్లలో (2020-21 నుంచి 2024-25 వరకు) మొత్తం 71,963 సినిమాలకు సీబీఎఫ్‌సీ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది. సినిమాటోగ్రాఫీ చట్టం ప్రకారం బోర్డు ఇచ్చే ఉత్తర్వులకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. అటువంటి కేసులను న్యాయపరమైన విచారణ ఫలితాల ఆధారంగా పరిష్కరిస్తారు.

సృజనాత్మక స్వేచ్ఛను కాపాడుతూనే, సినిమాటోగ్రాఫీ చట్టం కింద తన విధులను నిర్వర్తిస్తూ.. పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన ధ్రువీకరణ ప్రక్రియను కొనసాగించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మనీష్ తివారీ, టి.ఆర్. బాలు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లోక్‌సభలో ఈ సమాచారాన్ని అందించారు.




## ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం

### ఆత్మహత్య చేసుకున్న 3 అక్కచెల్లెళ్లు

**గాజియాబాద్, ఫిబ్రవరి 4 (ఉదయం)::** చౌకగా మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్ రావడంతో యువత ఫోన్‌లో ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలవుతున్నారు. ఆడవద్దంటూ తండ్రి కటువుగా చెప్పినందుకు ముగ్గురు అక్కచెల్లెళ్లు గాజియాబాద్‌లో ఆత్మహత్య చేసుకోవడం సంచలనాన్ని సృష్టించింది.

ఉత్తర ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లోని ఒక టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు టీనేజీ అక్కచెల్లెళ్లకు కరోనా కాలంలో ఫోన్ చూడటం, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం ఒక వ్యసనమైంది. ఇందులో పడి చదువును నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టారు. బడికి వెళ్లకుండా రోజంతా ఫోన్‌లోనే ఉంటుండడంతో, తండ్రి ఫోన్ వినియోగం తగ్గించమని పిల్లలను మందలించినా వారు దారిలోకి రాలేదని పోలీసులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి ఈ విషయంలో గొడవ జరిగినట్టు చుట్టుపక్కల వారి కథనం. దీని తర్వాతే ముగ్గురు అక్కచెల్లెళ్లూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని, 9వ అంతస్తు నుంచి దూకేశారు. ఈ ఘటన అర్ధరాత్రి జరిగిందని భావిస్తున్నారు. అందరూ నిద్రిస్తున్న సమయంలో పెద్దగా శబ్దం వినిపించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చి, పోలీసులకు సమాచారం అందింది. వారు వచ్చి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి పంపి, సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**తమను తాము కొరియన్ రాజకుమార్తెలని భావించేంతగా...**

అక్కచెల్లెళ్లు ముగ్గురూ ఒక కొరియన్



గేమింగ్ యాప్‌తో మమేకం అయిపోయారంటే, వారు తమను తాము కొరియన్ రాజకుమార్తెలుగా భావించేవారే తప్ప భారతీయ పౌరులుగా కాదని పోలీసులు చెబుతున్నారు.

కాగా, తన కుమార్తెలు ఆడుతున్న ఆన్‌లైన్ ఆటలో ఆత్మహత్యే చివరి టాస్క్ అని బాలికల తండ్రి మీడియాకు వెల్లడించారు. 'రెండున్నరేళ్లుగా మా ముగ్గురు పిల్లలు ఈ గేమ్ ఆడుతున్నారు. దీంతో వీరు క్రమక్రమంగా కుటుంబానికి దూరమవుతూ వచ్చారు. ఎప్పుడూ ఫోన్లు పట్టుకొని వారి గదుల్లోనే ఉండేవారు. వారిలో ఒకరు ఇన్‌స్ట్రక్టర్‌గా ఉంటే.. మిగతా ఇద్దరు ఆదేశాలు పాటించేవారు. వారి ఫోన్లలో చివరి టాస్క్ సూసైడ్ అని ఉందని దర్యాప్తు అధికారులు మాకు చెప్పారు అని మీడియాకు వెల్లడించారు.

కాగా, పోలీసులు మాత్రం వారు ఏ టాస్క్ ఆధారిత గేమ్ ఆడుతున్నట్టు తమకు సమాచారం లభించలేదని, వారు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడినా అవి గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉన్నవే తప్ప కొరియన్ గేమ్స్ కావని చెప్పారు.

ఇప్పటి వరకూ తాము చేసిన దర్యాప్తు ప్రకారం, ఈ ముగ్గురు ఆడపిల్లలూ కొరియన్ సినిమా, సంగీతం, కొన్ని ఆటలు సహా కొరియన్ సంస్కృతితో తీవ్రంగా ప్రభావితమయ్యారు. వారు సాధారణంగా కూడా తమ మొబైల్ ఫోన్లకు బానిసలయ్యారు అని, డిసిపి పాటిల్ వెల్లడించారు. ఇంతవరకూ, ఆన్‌లైన్ గేమింగ్ గురించి ఏ రకమైన వాస్తవాలు లేదా ఆ ఆటల్లో ఇచ్చిన టాస్క్‌ల గురించి తమకు ఆధారాలు లభించలేదని ఆయన అన్నారు.

## హిట్ & రన్ రాజకీయాల శకం ముగిసింది

### గొగోయ్ వ్యాఖ్యలపై హిమంత స్పందన



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 (ఉదయం):** రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కుటుంబం 12వేల బీఘాల భూమిని ఆక్రమించిందని అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గోగోయ్ ఆరోపించిన కొద్ది గంటల్లోనే, ఈ ఆరోపణలు తప్పుడు, హానికరమైన, పరువుకు భంగం కలిగించేవిగా ఉన్నాయంటూ ముఖ్యమంత్రి స్పందించారు. తాను గోగోయ్, మరో ముగ్గురు కాంగ్రెస్ నేతలపై ఫిబ్రవరి 9వ తేదీన తాను సివిల్, నేరపూరిత పరువు నష్టం ప్రొసీడింగ్‌లను ప్రారంభిస్తామంటూ బుధవారం ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నేటి విలేకరుల సమావేశంలో తనకు వ్యతిరేకంగా తప్పుడు, హానికరమైన, పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేసిన జితేంద్ర సింగ్ ఆల్వార్, భూపేష్ బఘేల్, గౌరవ్ గొగోయ్, దేవవ్రత సైకియాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 9న క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు శ్రీకారం చుడతానని శర్మ సామాజిక మాధ్యమం ఎక్స్‌పై చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. వారికి ఇసుమంతైనా సాహసం కానీ ఆధారం కానీ ఉంటే, కోర్టులో వారు చేసిన ప్రతి ఆరోపణను రుజువు చేయనివ్వండి. నేను దుష్ప్రచారానికి, సమన్వయంతో కూడిన బురదజల్లుడికి లేదా గాంధీ కుటుంబ బానిసల రాజకీయ నాటకీయతతో తాను బెదిరిపోనని ఆయన అన్నారు.

అంతకు ముందు, గువాహతిలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ, కాంగ్రెస్ పార్టీ ఒక విచారణ జరిపిందని, దానిలో కొన్ని దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని, అస్సాం రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు దాదాపు 12,000 బిఘాల భూమిని ఆక్రమించుకున్నారని గౌరవ్ గొగోయ్ ఆరోపించారు.

శర్మ పరువు నష్టం దావా బెదిరింపుపై స్పందిస్తూ, ఈ రోజు మా పత్రికా సమావేశానికి హిమంత బిశ్వ శర్మ భయపడ్డారని స్పష్టంగా తెలుస్తోంది. త్వరలోనే, అతని అవినీతి, ఆస్తుల వివరాలు అస్సాంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు తెలియజేస్తాం. అతనికి ధైర్యం ఉంటే, ఆశ్రయం కోరడానికి బదులుగా ప్రజాన్యాయ స్థానంలో మాతో పోరాడాలంటూ గొగోయ్ స్పందించారు.



# సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
**హనుమకొండ జిల్లా భీమారంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో సామాజిక న్యాయ దినోత్సవం- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్**

**హనుమకొండ, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**
ప్రతి సామాజిక వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమారంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం( దర్శనాగర్ )లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యా సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచించారు. బాలికలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించిన తర్వాతనే బాలికలు వివాహం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, హసన్ పర్తి తహసిల్దార్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపత్, వసతి గృహ వార్డెన్ ప్రియాంక, అధ్యాపకులు, కళాశాల వసతిగృహం విద్యార్థినులు పాల్గొన్నారు.



# సేవా పథంలో ధర్మపురి లయన్స్ క్లబ్ జోరు





**రీజియన్ మీట్‌లో పురస్కారాల వెల్లువ**
**ఉత్తమ జోనల్ చైర్‌పర్సన్‌గా పిన్న శ్రీనివాస్**
**పలు కీలక విభాగాల్లో ధర్మపురి అగ్రస్థానం**
**సామాజిక సేవలో పునరంకితం అవుతాం**
**జోనల్ చైర్పర్సన్ పిన్న.శ్రీనివాస్**

**ధర్మపురి, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**
లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320 జి పరిధిలో ధర్మపురి సేవా విభాగం సరికొత్త రికార్డును సృష్టించింది. ఆరో రీజియన్ పరిధిలో నిర్వహించిన వార్షిక సమీక్షా సమావేశంలో ధర్మపురి లయన్స్ క్లబ్ తన అద్వితీయ ప్రతిభను చాటుతూ పలు కీలక విభాగాల్లో అగ్రస్థానం లో నిలిచింది.జగిత్యాల జిల్లా ధర్మారం మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామ పరిధిలోని మహేశ్వరి ఫంక్షన్ హాల్ లో ఈ 'రీజియన్ మీట్' అట్టహాసంగా జరిగింది.

***ఘన స్వాగతం స్ఫూర్తి దాయక ప్రసంగాలు**
ఈ కార్యక్రమానికి రీజియన్ చైర్పర్సన్ డాక్టర్ కామిని శ్రీనివాస్ దంపతులు నేతృత్వం వహించా రు.ముఖ్య అతిథులుగా విచ్చేసిన 320 జి గవర్నర్ లయన్ సింహా రాజు కోదండరాం, ప్రముఖ మోటి వేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ సేవా దృక్పథం అనేది మనిషికి అత్యంత తృప్తిని ఇస్తుందని, లయన్స్ క్లబ్ వంటి సంస్థలు సమాజంలో అట్టడుగున ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**పురస్కారాల జోరు..ధర్మపురి దే హవా***
ఈ రీజియన్ పరిధిలోని మూడు జోన్ల పనితీరును పరిశీలించిన అనంతరం పురస్కారాలను ప్రకటించారు.ఉత్తమ జోనల్ చైర్పర్సన్ గా పిన్న శ్రీనివాస్ ప్రభంజనం సృష్టించారు.రీజియ న్ మొత్తం మీద అత్యుత్తమ జోనల్ చైర్పర్సన్‌గా పిన్న శ్రీనివాస్ అవార్డును దక్కించుకున్నారు.ఆయన పర్యవేక్షణలోని క్లబ్బు చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, సభ్యుల సమన్వయం గవర్నర్ను మెప్పించాయి.

**బ్యానర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ స్థానం**
సృజనాత్మకతకు,క్లబ్ కార్యకలా పాల ప్రదర్శనకు వేదికైన బ్యానర్ ప్రజెంటేషన్లో ధర్మపురి లయన్స్ క్లబ్ మొదటి బహుమతిని గెలుచుకుంది.అత్యుత్తమ బృందం క్లబ్ అధ్యక్షుడిగా మామిడాల రవీందర్, సెక్రటరీగా సజ్జరావు,ట్రెజరర్‌గా పప్పుల శ్రీనివాస్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బెస్ట్ అవార్డులను కైవసం చేసుకున్నారు.క్లబ్ కార్యక లాపాల్లో చురుగ్గా పాల్గొన్నందుకు కట్ల శ్రీహరి బెస్ట్ లయన్ అవార్డును అందుకున్నారు.

**సమిష్టి కృషికి దక్కిన గౌరవం పిన్న శ్రీనివాస్**
అవార్డు స్వీకరించిన అనంతరం జోనల్ చైర్పర్సన్ పిన్న శ్రీనివాస్ మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు .ఈ పురస్కారం కేవలం నా వ్యక్తిగత విజయం కాదు. ధర్మపురి, జగిత్యాల, గొల్లపెల్లి ప్రాంతాల్లోని ప్రతి లయన్ సభ్యుడి కష్టార్జితం. మా సేవలను సరికొత్త పుంతలు తొక్కిస్తున్న గవర్నర్కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ గుర్తింపు తో మాపై బాధ్యత పెరిగింది. రానున్న రోజుల్లో విద్య, వైద్య రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం అని ఆయన పేర్కొన్నారు.

**సేవారంగంలో లయన్స్ క్లబ్ అగ్రగామి**
300 మందికి చూపును ప్రసాదించిన సేవా సంస్థ సమాజ సేవలే ధ్యేయంగా గత 25-26 సంవత్సరాలుగా నిర్విరామంగా సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఈ ఏడాది మరిన్ని అద్భుతమైన మైలురాళ్ళను అధిగమించింది.సేవా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఈ క్లబ్ ఈ సంవత్సరం సుమారు 100 సామాజిక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది.ఈ ఏడాది క్లబ్‌లోకి 8 మంది కొత్త సభ్యులు చేరి సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అంది స్తున్నారు.సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసినందుకు గాను ధర్మపురి లయన్స్ క్లబ్ జోనల్ చైర్పర్సన్ శ్రీనివాస్,అధ్యక్షుడు మామిడాల. రవీందర్, సెక్రెటరీ డాక్టర్ సజ్జరావు లకు ప్రతిష్టాత్మక మెల్విన్ జోన్స్ ఫెలోషిప్ పిన్‌ను (ఎం జె ఎఫ్), క్లబ్ కు అందజేయగా గవర్నర్ వారిని అభినందించారు.ప్రత్యేకంగా నేత్రవైద్య సేవలలో లయన్స్ క్లబ్ కీలక పాత్ర పోషించింది. ఈ ఏడాది నిర్వహించిన 4 భారీ ఉచిత నేత్ర వైద్య శిబిరాల ద్వారా సుమారు 300 మంది అంధత్వం తో బాధ పడుతున్న వారికి శస్త్ర చికిత్సలు, చికిత్సలు అందించి తిరిగి చూపు ని ప్రసాదించారు.ఈ సేవా కార్యక్ర మాలు పేద ప్రజలకు ఆశాదీపం గా నిలిచాయి.సమాజ హితమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ,రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని క్లబ్ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

**కొనసాగుతున్న అభినందనల వర్షం**
ధర్మపురి లయన్స్ క్లబ్ కు ఇన్ని అవార్డులు రావడం పట్ల పట్టణంలోని ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవే లక్ష్యంగా పని చేస్తున్న వీరిని ఆదర్శంగా తీసుకోవాలని పలువు రు కొనియాడారు.ఈ కార్యక్ర మంలో రీజియన్ లోని వివిధ క్లబ్ల ప్రతినిధులు, లయన్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**జగిత్యాల,ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**
రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు ఇందులో జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి బి సత్యప్రసాద్ బుధవారం జనరల్ అబ్జర్వర్ ఖర్గాడే కాళీచరణ్ సుదామా రావు సమక్షంలో రెండవ రాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో ఈ రాండమైజేషన్ చేపట్టినట్లుగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పేర్కొన్నారు రాబోయే మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ జిల్లా నోడల్ అధికారి కె రాము కలెక్టరేట్ ఏఓ హాకిమ్ ఈడీఎం మహత సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సామాజిక సమానత్వంతోనే అభివృద్ధి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**
సామాజిక సమానత్వం ద్వారానే అన్ని వర్గాలు, తద్వారా దేశం అభివృద్ధి చెందుతాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.భగత్ నగర్ లోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో 'తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం' నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అన్నివర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దివ్యాంగులు, నిరుపేదలందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, వృద్ధులకు న్యాయం, సేవ అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అందరూ ఐక్యంగా ఉంటూ ఒకరికి ఒకరు సహకరించుకుంటూ సమాజాన్ని గొప్పగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యార్థులు గొప్ప ఆశయంతో ముందుకు వెళ్లాలని, ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్య అభ్యసించి ఉపాధి అవకాశాలతో ఆర్థిక సాధికారత సాధించాలని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్లో విద్యార్థుల కోసం అమర్చిన గీజర్, పలు సౌకర్యాలు పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్త తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**
నారాయణపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ( ప్రమాదకర ప్రదేశాలు) లో ఇకపై ప్రమాదాలు జరగకుండా రోడ్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నారాయణపేట నియోజక వర్గ పరిధిలోని ప్రమాదకర ప్రదేశాల్లో అర్ అండ్ బీ అధికారులు, మక్తల్ నియోజకవర్గంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన కార్యాచరణ ప్రణాళిక లు రూపొందించుకొని నెల రోజులలో ఆయా బ్లాక్ స్పాట్ లలో ప్రమాద నివారణనే లక్ష్యంగా సాగాలన్నారు. సమావేశం లో ఆర్ అండ్ బీ అధికారులు పోలీసు శాఖతో కలిసి జిల్లాలోని బ్లాక్ స్పాట్ ల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను జిల్లా కలెక్టర్,ఎస్పీలకు చూపించారు. పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు సూచించిన ప్రమాద నియంత్రికలను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రియాజ్ హూల్ హక్, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటరమణ, ఆర్టీవో మేఘా గాంధీ, ఆర్టీవో నెంబర్ పోషల్ రాజేష్, డిపో మేనేజర్ లావణ్య, ఎన్ హెచ్ అధికారి, ఆర్ అండ్ బి డీ.ఈ. తదితరులు పాల్గొన్నారు.



# చెన్ షెడ్డు కు భూమి పూజ

- **ఎంపీడీవో ప్రవీణ్ కుమార్.**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4 (వుదయం ప్రతినిధి ):**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం మర్థిడి గ్రామపంచాయతీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం కిచెన్ షెడ్డు కు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ భూమి పూజ చేశారు. అదేవిధంగా ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారం ఉపాధి హామీ కూలీలు పనులు చేసినట్లయితే 307 రూపాయల కూలీ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పాఠశాలల్లో ఉపాధి హామీ పథకం లో కిచెన్ షెడ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మల్లేష్ ,ఏపీవో రాజన్న, టిఏ విజయ్ తదితరులున్నారు.

# మెట్టుపల్లి గ్రామానికి కాలువల ద్వారా సాగునీరు

**హరీష్ రావుకు గ్రామస్తుల కృతజ్ఞతలు**



**సిద్దిపేట , ఫిబ్రవరి 04(వుదయం):**
కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రంగనాయక సాగర్ నుంచి చిన్నకోదూరు మండలం మెట్టుపల్లి గ్రామానికి సాగునీరు అందడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల మెట్టుపల్లి గ్రామానికి కాలువల ద్వారా పంట పొలాలకు నీళ్లు రావడం లేదని రైతులు, గ్రామస్తులు చిన్నకోదూరు పర్యటనకు వెళ్లిన సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావును కలిసి సమస్యను విన్నవించుకున్నారు. గ్రామస్తుల విజ్ఞప్తికి స్పందించిన హరీష్ రావు అదే రోజు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే నీళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు స్పందించి సలంద్రి ద్వారా మెట్టుపల్లి గ్రామానికి కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు విడుదల చేశారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు చిత్రపటాలకు గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. "మేము అడిగిన వెంటనే స్పందించి నీళ్లు వచ్చేలా కృషి చేసిన మీకు ఎంత చేసినా తక్కువే. మీ ఋణం మేము ఎలా తీర్చుకోగలం" అంటూ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మెట్టుపల్లి సర్పంచ్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనక రాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, చిన్నకోదూరు సర్పంచ్ ఇట్టబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేష్, శంకర్, సీనియర్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేట లో పశు వైద్య శిబిరం



**నిజాంసాగర్, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**
నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో బుధవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.. అదే విధంగా పశువుల సంరక్షణ కు పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వైద్యులు స్థానిక రైతులకు పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ శృతిలయ, గోపాలమిత్ర సూపర్వైజర్ బసవరాజు, గోపాలమిత్ర లు సిద్ధు, నందు పాల్గొనగా ఈ శిబిరంలో గర్భకోశ చికిత్స 23 పశువులకు సాధారణ చికిత్స 31, దూడలకు నట్టల నివారణ మందు తాగింపజేశారు.

# ఎన్నికల విధులకు హాజరు కావాలి



**మహబూబ్ నగర్, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**
కలెక్టరేట్ మీటింగ్ హాల్ లో బుధవారం అదనంగా అవసరం ఉన్న 61 మంది పి.ఓ, ఓ .పి.ఓ లకు మొదటి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ లో శిక్షణ నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు నియమింపబడిన అందరూ హాజరు కావాలని, ఏలాంటి పొరపాటు లకు తావివ్వకుండా విధుల్లో పని చేయాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమం లో సిఎంఓ సుధాకర్ రెడ్డి, ఎఏంఓ దుంకుడు శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ నాగరాజు పాల్గొన్నారు.

# అందుబాటులో ఉంటా ఆదరించండి



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 04(వుదయం ప్రతినిధి);**
క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బిఆర్ఎస్, సిపిఐ పార్టీ కలిసి పోటీ చేస్తున్న నేపద్యంలో ఒకటో వార్డులో సిపిఐ పార్టీ అభ్యర్థి కౌడగాని సాంబయ్య జోరుగా ప్రచారం నిర్వహించారు. ఒకటో వార్డ్ లో తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, తారక రామ కాలనీ, అల్లూరి సీత రామ రాజు నగర్ ల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.ప్రచారం లో భాగంగా కూటమి బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రచారం నిర్వహించారు. 40 ఏండ్లు గా సీ. పి. ఐ పార్టీ లో కార్య కర్త గా కొనసాగుతున్న తనకు ఒకటో వార్డ్ అభ్యర్థి గా సీ.పి. ఐ& బి. ఆర్. ఎస్ లు బల పరచారని తెలిపారు. కంకి కొడవలి గుర్తు కు ఓటు వేసి భారీ విజయం అందించాలని కోరారు.

# సోషల్ మీడియాలో అసభ్య, అవహేళన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు

- **జిల్లా ఎస్పీ నితిక పంత్**

**కొమరం భీమ్, ఫిబ్రవరి 4 ( వుదయం ప్రతినిధి):**
కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్, కాగజ్ నగర్ పట్టణాల పరిధిలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ నితిక పంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల సమయంలో ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లో ఇతరులను అవహేళన చేసే వ్యాఖ్యలు, అసభ్య పదజాలం, వ్యక్తిగత దూషణలు, కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, అలాగే ఇతరుల మనోభావాలను దెబ్బతీసే వాక్యాలు లేదా వీడియోలు, ఫొటోలు పోస్టు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.అలాగే ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే విధంగా అసత్య ప్రచారాలు, తప్పుడు వార్తలు, వదంతులు వ్యాప్తి చేయడం నేరమని, అటువంటి చర్యల వల్ల శాంతి భద్రతలకు భంగం కలిగితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, అభ్యంతరకర పోస్టులు లేదా సందేశాలు కనిపిస్తే ప్రజలు వెంటనే జిల్లా పోలీసు శాఖకు సమాచారం అందించాలని కోరారు. ఇందుకోసం స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్‌ను 8712670505 / 551 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో బాధ్యతాయుతంగా ప్రవర్తించి, పోలీస్ శాఖ కు సహకరించాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4 ( వుదయం ప్రతినిధి):**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గురువారం సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.పట్టణంలోని 10వ వార్డు బిజెపి అభ్యర్థి సిందం లతా శ్రీనివాస్, 28 వార్డు అభ్యర్థి ఈర్ల విశ్వేశ్వరరావు, 26 అభ్యర్థి ఆడేటి శంకర్ లకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిలక్ నగర్ నవగాంబస్తి లో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కనుగొంటామని రోడ్లు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి బిజెపి బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివకుమార్ వార్డు ఇన్చార్జీలు కుంచాల విజయ్, తేలిబాపు,దుర్గం మొతీరం, రేహాన్ కరా తిరుపతి, పసి తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై క్షేత్రస్థాయిలో సమీక్ష

**అక్రమాలకు చోటు లేని ఎన్నికల కోసం పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు**
**పారదర్శక ఎన్నికల నిర్వహణ కోసం అధికారులకు దిశా నిర్దేశం**
**స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ధ్యేయం**
**జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**

**కామారెడ్డి, ఫిబ్రవరి 4 (వుదయం):-**
మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్యన జరిపేందుకు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం బాన్సువాడ, బిచ్కుంద పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ సందర్శించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై యస్ఐ, సిఐ, డియస్పి అధికారులతో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలకమైనవి కావున ప్రతి ఓటరు తన ఓటు హక్కును ఎటువంటి ఆటంకాలు, ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛయుత వాతావరణంలో వినియోగించుకునే విధముగా పోలీసు యంత్రాంగం అంకితభావంతో పని చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో అదనపు బలగాల ద్వారా భద్రత ఏర్పాట్లు చేయాలని బాన్సువాడ డిఎస్పీ కి సూచించడం జరిగింది. క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు ప్రతీ పోలీసు సిబ్బందితో మాట్లాడడం జరిగింది. ప్రజలతో సమన్వయం చేసుకుంటూ వారిలో మరింత భద్రతా భావాన్ని పెంపొందించాలని సూచించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని సాంకేతిక, భద్రతా వనరులను సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల పారదర్శకతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్ని అయినా సహించేది లేదని బాన్సువాడ, బిచ్కుంద ప్రాంతాల్లో అక్రమ మద్యం, నగదు పంపిణీ వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణ కోసం నిరంతర తనిఖీలు చేపట్టాలని, ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలందరూ ఎటువంటి ఒత్తిడిలకు లొంగకుండా, ధైర్యంగా ఓటు వేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. శాంతియుత, నిష్పక్షపాత, పారదర్శక వాతావరణంలో ఎన్నికల నిర్వహణనే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో అవసమగు అన్ని బందోబస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల విజయవంతానికి తోడ్పడాలని జిల్లా ఎస్పీ సూచించారు.





# 16వ వార్డు బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభం

**కోదాడ, ఫిబ్రవరి 4(వుదయం):**
కోదాడ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 16వ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షేక్ కరీముల్లా బాబా ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కరీముల్లా బాబాకు శుభాకాంక్షలు తెలిపారు.కరీముల్లా బాబా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడని, వార్డు అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తారని పేర్కొంటూ, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.





## మధ్యాహ్న భోజనంలో జాగ్రత్తలు

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి
- హబ్సీపూర్ పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- కూరలు పలచగా ఉండటంపై అసహనం.. నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక

**దుబ్బాక, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచికరంగా ఉండాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట దుబ్బాక మండలం హబ్సీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వండిన అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, ఆలుగడ్డ టమాట కూరలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మెనూ పాటిస్తున్నప్పటికీ, కూరలు సాంబారు మాదిరిగా పలచగా ఉండటంపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల పోషకాలకు అనుగుణంగా తగినంత ఆహారం వండాలని, నాణ్యత పాటించని పక్షంలో ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్న పిల్లలకు వడ్డించే భోజనాన్ని తనిఖీ చేశారు. పిల్లలు ఇష్టంగా భోజనం చేసేలా చూడాలని, భోజనం తర్వాత వారు ఆడుకోవడానికి తగిన వసతులు కల్పించాలని, విశ్రాంతి తీసుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట స్థానిక అధికారులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నతే తల్లిదండ్రులకు అసలైన బహుమతి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**మధిర,ఫిబ్రవరి 4 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన సోషల్ జస్టిస్ డే వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతిపెద్ద బహుమతి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు.ఎర్రుపాలెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాలలో నిర్వహించిన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి విద్యార్థినిలతో కలిసి కలెక్టర్ సామాజిక ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజంగా తెలంగాణలో నిర్మించే దిశగా ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వేను విజయవంతంగా నిర్వహించి, రిపోర్టును ఫిబ్రవరి 4, 2025న అసెంబ్లీలో ప్రవేశ పెట్టిందని అన్నారు.కుల,మత విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడం కోసం సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టిందని అన్నారు. సామాజిక న్యాయం ఉన్న సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వినియోగించుకుంటూ పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు చేసి మంచి విద్యా సంస్థలు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన డైట్, కాస్మొటిక్ ఛార్జీలు, ఇతర మౌళిక వసతులు



మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు.ప్రభుత్వ గురుకులాలకు ప్రజల నుంచి మంచి డిమాండ్ ఉందని అన్నారు.మంచి విద్యాసంస్థల్లో నేడు పిల్లలు చదువుతున్నారని, అనేక ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన ల్యాబ్, క్రీడలు ఆడేందుకు వసతులు మన గురుకులాల వద్ద ఉన్నాయని తెలిపారు.పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు మనం ఇచ్చే అతి పెద్ద బహుమతి అవుతుందని,భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లో రిగ్రెట్ ఫీల్ కాకుండా ఉండాలని అన్నారు. చదువు, క్రీడలు, మనం చేసే పనిలో పిల్లలు తమ ఎనర్జీని 100 శాతం అందించాలని అన్నారు.విజయం వెంటనే రాదని, అనేక ఓటములు,అడ్డంకులను అధిగమిస్తేనే మంచి విజయం సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే 10,ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటి ఛైర్మెన్ బండారు నరసింహారావు,ఎర్రుపాలెం మండల తహసీల్దారు ఉషా శారద, ఎంపిడివో బి.సురేందర్, అధికారులు పాల్గొన్నారు.




## పాఠశాలల అభివృద్ధి పనులపై కలెక్టర్ దృష్టి

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశం
- ఉపాధి హామీ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష

**సిద్దిపేట, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రక్షణ గోడలు మరియు అవసరమైన చోట మరుగుదొడ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులపై ఆమె సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత విద్యాలయాలకే: జిల్లాలో చేపట్టిన అంగన్వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఉప కేంద్రాలు, మహిళా సమాఖ్య భవనాలు, ధాన్యపు నిల్వ గదుల పనుల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో రక్షణ గోడలు, మరుగుదొడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అభియాంత్రిక (ఇంజనీరింగ్) అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నిధులను వృధా చేయకుండా, నిర్దేశించిన పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేసి నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.ప్రతి వారం పనుల్లో పురోగతి ఉండాలని, నాణ్యత ప్రమాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ ఆదేశించారు. స్థలం అందుబాటులో ఉండి, ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే మొదలుపెట్టి ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య, పంచాయతీ రాజ్ కార్య నిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ కుమార్, సహాయ ఇంజనీర్లు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులను నూతన ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దండి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**

తరగతి గదిలో పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, బయట ప్రపంచంలో ఎదురయ్యే అనేక సమస్యలకు పరిష్కారాలు ఆలోచించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా తమ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలంటే ఉపాధ్యాయుల ప్రోత్సాహం కీలకమని ఆయన తెలిపారు.




భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంప్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపేలా ప్రాజెక్టులు రూపొందించేందుకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అలాంటి ప్రాజెక్టులను ఉత్పత్తుల రూపంలోకి తీసుకువచ్చే దిశగా విద్యార్థులను ప్రోత్సహించేలా ఈ బూట్ క్యాంప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. బూట్ క్యాంప్ ద్వారా ఉపాధ్యాయులు పొందిన జ్ఞానం అనుభవాలను తరగతి గదిలో విద్యార్థులకు అందించి వారి సృజనాత్మక ఆలోచనలు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు రూపొందించిన నవకల్పనలను ఉత్పత్తులుగా అభివృద్ధి చేయడంలో వాద్వానీ ఫౌండేషన్ భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పీఎం శ్రీ పాఠశాలలు భాగస్వాములుగా వ్యవహరించి విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నుండి విభం వ్యాస్ వాద్వానీ ఫౌండేషన్ నుండి శ్యామ్ డాక్టర్ హెచ్. శ్రీనివాస్ వరప్రసాద్ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ భరత్ కృష్ణ ప్రిన్సిపాల్ రవికుమార్ జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం సూర్యాపేట మహబూబాబాద్ హనుమకొండ జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుండి పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి(వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల పరిధిలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్మూలనకు అవగాహనే ఆయుధం

**ఖమ్మంవుదయం బ్యూరో 4 ఫిబ్రవరి 2026 :**

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా, ఖమ్మంలోని (ఆరోగ్య హాస్పిటల్‌లోని) జెమ్‌కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నేడు ప్రజల్లో క్యాన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు క్యాన్సర్ అవగాహన వాకథాన్ నిర్వహించారు. క్యాన్సర్ నివారణ, తొలిదశ గుర్తింపు ,సమయానుకూల చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం గా ఈ వాకథాన్ నిర్వహించామన్నారు. క్యాన్సర్ చికిత్సలో అవగాహనే మొదటి అత్యంత ముఖ్యమైన అడుగు అనే బలమైన సందేశం ప్రజలకు చేరాలన్నారు ."క్యాన్సర్ కు అవగాహనే ప్రథమ చికిత్స" అనే నినాదం తో ఈ వాకథాన్ ఉదయం 7:00 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుండి ప్రారంభమై, గవర్నమెంట్ హాస్పిటల్, ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా జెమ్‌కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వద్ద ముగిసింది. వివిధ వయస్సుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, క్యాన్సర్ అవగాహనకు తమ మద్దతును తెలిపారు.ఈ సందర్భంగా జెమ్‌కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సుధాకర్ కొట్లపాటి మాట్లాడుతూ... ఈ వాకథాన్ ప్రధాన



లక్ష్యం ప్రజలకు క్యాన్సర్‌కు సంబంధించిన సాధారణ లక్షణాలు, ప్రమాదకర కారణాలు , అలాగే తొలిదశలో స్క్రీనింగ్ ఎంత ముఖ్యమో వివరించడం అని తెలిపారు. ఖమ్మం వంటి టియర్ 3 నగరాల్లో అవగాహన లోపం మరియు ఆలస్యంగా ఆసుపత్రికి రావడం వల్ల చాలా సందర్భాల్లో క్యాన్సర్ చివరి దశల్లో గుర్తించబడుతోందన్నారు. ఈ వాకథాన్ ద్వారా తొలిదశ అవగాహన అనేక ప్రాణాలను కాపాడగలదని, కుటుంబాలపై పడే మానసిక , ఆర్థిక భారం తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఒకప్పుడు క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా భావించబడినప్పటికీ, నేటి ఆధునిక వైద్యంతో తొలిదశలో గుర్తిస్తే చాలా క్యాన్సర్లు పూర్తిగా నయం కావచ్చని తెలిపారు. అయినప్పటికీ, అవగాహనే ఇంకా అతిపెద్ద సవాలుగా ఉందన్నారు. కాబట్టి చిన్న లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.అనంతరం జెమ్‌కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నుక్కసాని సుబ్బారావు, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్. హరీష్ రావూరి, ఆంకోపాథాలజిస్ట్ డాక్టర్ అమృత జి లు మాట్లాడుతూ... జెమ్‌కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఒకే చోట సంపూర్ణ క్యాన్సర్ చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. ఇక్కడ ట్రూబీమ్ రేడియేషన్ థెరపీ వంటి ప్రపంచ స్థాయి ఆధునిక సాంకేతికతతో పాటు, ఖచ్చితమైన నిర్ధారణకు ఉపయోగపడే అత్యాధునిక స్కానర్ సౌకర్యం ఉందన్నారు. అనుభవజ్ఞులైన ఆంకాలజీ వైద్య బృందం ఆధునిక మౌలిక వసతులతో, ఖమ్మం మరియు పరిసర జిల్లాల ప్రజలకు ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను దగ్గరగా అందించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు.




## అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి

**వరంగల్ టౌన్, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులతో సామాజిక న్యాయ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ఫిబ్రవరి 4, 2025న రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించిందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.దివ్యాంగులు, నిరుపేదలందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, వృద్ధులకు న్యాయం, సేవా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.సామాజిక న్యాయం అనేది వ్యక్తి జీవితంలో విద్యార్థి దశ నుంచే అలవాటుగా మారాలనే ఉద్దేశంతో ఈ రోజున పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి భంగం కలగకుండా ఉండేందుకే కమిషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చట్టాలు న్యాయం జరిపించేందుకు ఉన్నప్పటికీ, పిల్లలు చిన్ననాటి నుంచే పెద్దలను గౌరవించే విలువలు అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని, పెద్దల పట్ల సామాజిక భద్రత కలిగి ఉండేలా విద్యా సంస్థల నుంచే అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే కేసులు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయని, ఇవి కేవలం చట్టాల ద్వారా మాత్రమే కాకుండా సమాజంలో మార్పు వచ్చినప్పుడే తగ్గుతాయని అన్నారు. అందుకే సామాజిక న్యాయంతో పాటు సామాజిక భద్రత కూడా అత్యంత ముఖ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, డిబిసిడిఓ పుష్పలత, ఆర్డీవో సుమ, జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

### చేతి గుర్తును గెలిపించండి

## అల్గునూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**కరీంనగర్, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డిని గెలిపిస్తే అల్గునూరు సమగ్ర అభివృద్ధికి పాటుపడతామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అల్గునూరులో మున్నూరు కాపులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ జరిగే ఎన్నికల పోలింగ్ లో చేతి గుర్తుకు ఓట్లేసి కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డిని గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో గోపు మల్లారెడ్డిని ఆశీర్వదిస్తే అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. ఇప్పటికే అల్గునూరులో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా చేపటాల్సిన వాటిని త్వరలో ప్రారంభిస్తామన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా కుల సంఘాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతున్నదని చెప్పారు. అల్గునూరు అన్నారు. అల్గునూరు గ్రామంపైన,ముఖ్యంగా అల్గునూరు ప్రజలపైన తనకు ప్రత్యేక అభిమానమని, కష్టకాలంలో తనకు వెన్నంటి ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేసి మరోమారు అభిమానాన్ని చాటుకున్నారు. తన మాదిరిగా స్థానికుడైన గోపు మల్లారెడ్డిని కూడా ఆదరించి అక్కున చేర్చుకోవాలని ఆయన కోరారు.గ్రామాభివృద్ధి విషయంలో ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఎవరి అంచనాలకు అందని విధంగా అల్గునూరును అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామన్నారు. అన్ని కుల సంఘాలను అభివృద్ధి పర్చాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పని చేస్తున్నదని కవ్వంపల్లి చెప్పారు. కుల సంఘాలకు ప్రభుత్వ స్థలాలు ఇవ్వడమే కాకుండా వాటి నిర్మాణాలకు నిధులు కూడా



మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వివరించారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చెప్పే మాటలను నమ్మవద్దని, అన్నివర్గాల అభివృద్ధికి పాటుపడుతున్న కాంగ్రెస్ పార్టీనే ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు కంది లక్ష్మినారాయణ రెడ్డి, చిందం కిష్టయ్య, కంది అశోక్ రెడ్డి, దాసం నాగేందర్, జాప రాఘవ రెడ్డి, జేవీ మల్లారెడ్డి, మామిడి నరేందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, ప్రశాంత్ గౌడ్,ఎం.స్వాతి శ్రీకాంత్ గౌడ్, అట్ల అనిల్ కుమార్ ముదిరాజ్, తొర్తి అరవింద్ తోపాటు మున్నూరు కాపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



- ఎమ్మెల్యే కవ్వంపల్లి

**కరీంనగర్, ఫిబ్రవరి 04 (వుదయం ప్రతినిధి):**

కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. బుధవారం కరీంనగర్ నగర పాలక సంస్థ 7వ డివిజన్ పరిధిలోని సదాశివపల్లిలో ఆయన ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగానే కుల సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల ఆర్థిక అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.కుల సంఘాలకు ప్రభుత్వ స్థలాలు ఇవ్వడమే కాకుండా వాటి నిర్మాణాలకు నిధులు కూడా మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వివరించారు. కుల సంఘాల భవనాల్లో సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఐక్యతగా ఉండడానికి ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా కార్పొరేషన్ ఎన్నికల్లో 7వ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న స్థానికులు బండి మమతమల్లేశంను గెలిపించాలని, చేతి గుర్తుకు ఓట్లేసి సదాశివపల్లి ఓటర్లు తమ ఐక్యతను చాటాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు చెప్పే మాటలను నమ్మవద్దని, కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని ప్రజలంతా గుర్తించుకోవాలని కవ్వంపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, 7వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి బండి మమత, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి మల్లేశం, పార్టీ నాయకులు రామిడి తిరుపతి, బండి చంద్రయ్య, మాచర్ల తిరుపతి, సింగిరెడ్డి అనంతరెడ్డి, ఏనుగు చుక్కారెడ్డి,ఏనుగు ఎల్లారెడ్డి, సింగిరెడ్డి మనోహర్ రెడ్డి, కుల సంఘాల నాయకులు ఎస్. సత్తయ్య, ఉడుత కోటేశ్వర్, నాగెల్లి నర్సయ్య, పాండ్రాల రవి, రాములు, పత్తెం తిరుపతి,ఎస్.మల్లయ్య, చిలుక శేఖర్, పంతం కిషన్. ఎస్.లింగారెడ్డి, బండి పర్షయ్య, ఎండీ బాబా,షేక్ మీర్, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా పథంలో తుమ్మల అభిమానులు

### తుమ్మల యుగంధర్ జన్మదిన సందర్భంగా విద్యార్థులకు అల్పాహార వితరణ

**దమ్మపేట ఫిబ్రవరి 4 (వుదయం ప్రతినిధి):**

తమ అభిమాన నాయకుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తనయుడు తుమ్మల యుగంధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. మంత్రి స్వగ్రామమైన గండుగులపల్లిలో బుధవారం అభిమానుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో, గండుగులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ( జెడ్పిహెచ్ఎస్)లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అభిమానులు పౌష్టికరమైన అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.. తుమ్మల యుగంధర్ ప్రజాసేవలో తన తండ్రి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కేవలం ఒక్క రోజుతో ముగించకుండా, వరుసగా 22 రోజుల పాటు ఈ అల్పాహార వితరణ కొనసాగిస్తామని వారు సంకల్పించారు.ఈ సందర్భంగా అభిమానులు పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి యుగంధర్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, యర్రా వసంతరావు, కె.వి సత్యనారాయణ కాసాని నాగప్రసాద్, పైడి సాయి మరియు గండుగులపల్లి గ్రామ పెద్దలు, తుమ్మల యువసేన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తమ నాయకుడిపై ఉన్న ప్రేమాభిమానాలను ఇలా సేవా కార్యక్రమాల రూపంలో చాటుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## కాంగ్రెస్ అభ్యర్థి కోడి శ్రీనివాస్ ప్రచారం

**చండూరు, ఫిబ్రవరి 04 (వుదయం విలేఖరి):**

చండూరు మున్సిపాలిటీ 6వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోడి శ్రీనివాసులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన వార్డులోని ప్రతి ఇల్లు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో చండూరు అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. చేయి గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో



కాంగ్రెస్ వార్డు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'యాప్ ఉంటేనే రైతులకు యూరియా' సరఫరా

- జిన్నారం ఏవో రవీందర్ రెడ్డి

**జిన్నారం జనవరి 4 (వుదయం ప్రతినిధి):**

రైతులకు యూరియా పంపిణీపై జిన్నారం మండల వ్యవసాయాధికారి రవీంద్రనాథ్ రెడ్డి రైతులకు కీలక సూచనలు చేశారు. బుధవారం ఆయన మున్సిపల్ లోని వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఇకపై యాప్ ద్వారా మాత్రమే యూరియా విక్రయాలు జరుగుతాయని స్పష్టం చేశారు. యూరియా కావాల్సిన రైతులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లలో యాప్ ఇన్స్టాల్ చేసి యూరియా విక్రయాలు జరపాలన్నారు. మరిన్ని వివరాల కోసం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని వెల్లడించారు.



# గ్రామీణ పేదలకు కొండంత అండ




**సర్పంచ్ అబ్దుల్ రషీద్**
**ఊర్కొండ, ఫిబ్రవరి 4**
**(వు దయం ప్రతి నిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా ఉరవకొండ మండలం ఉరుకొండ పేట గ్రామం ఈరోజుగ్రామాల్లోని పేద కుటుంబాలకు ఉపాధి హామీ పథకం ఒక గొప్ప వరమని, ప్రతి కుటుంబానికి పని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఊర్కొండపేట సర్పంచ్ అబ్దుల్ రషీద్ అన్నారు.బుధవారం మండల పరిధి లోని ఊర్కొండపేట గ్రామంలో సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు కలిసి ఉపాధి హామీ పథకం పనులను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ జాబ్ కార్డు పొంది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు కూలీలకు చేతినిండా పని దొరుకుతుందని ఆయన పేర్కొన్నారు.ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు మాట్లాడుతూ, పనుల వద్ద కూలీలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, పనుల్లో పారదర్శకత పాటిస్తూ కూలీలు తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇబ్రాహీం ,ఉపాధి హామీ కాలమ్మ,నాయకులు అమర చింతల శ్రీనివాసులు,కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సామాజిక న్యాయ దినోత్సవం

**– అడిషనల్ కలెక్టర్ మాధురి**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 4**
**(వుదయం )**




వివక్ష, అసమానతలకు తావు లేకుండా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యమని అడిషనల్ కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా జరుపు కుంటున్నట్లు తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాధురి మాట్లాడుతూ, సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులు, సమానత్వం, సోదర భావం వంటి విలువలను ప్రతి పౌరుడు ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా అందరితో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విశాలాక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ రాష్ట్ర అధ్యక్షుడిగా
# నాగూర్ల ఎన్నికపై హర్షం

**జయశంకర్ భూపాలపల్లి 04**
**(వుదయం ):**



ఫర్టిలైజర్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నికపై ఫర్టిలైజర్ అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కట్కం అశోక్ హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా కట్కం అశోక్ బుధవారం వుదయం ప్రతినిధి తో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు,విత్తనాలు అందించడంలో ఫర్టిలైజర్ షాప్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.అలాంటి బాధ్యతాయుతమైన పదవికి నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం రైతు సమాజానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను గుర్తించి, పరిష్కార దిశగా ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఫర్టిలైజర్ రంగంలో ఉన్న అనుభవం, సేవాభావం, నాయకత్వ లక్షణాలతో నాగూర్ల వెంకటేశ్వర్లు ఈ పదవికి పూర్తిగా న్యాయం చేస్తారని వెల్లడించారు నూతనంగా ఎన్నికైన నాగూర్ల వెంకటేశ్వర్లు, కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

# అయిజ అభివృద్ధియే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం
## ఏఐసిసి ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్

**అలంపూర్ ,ఫిబ్రవరి 04**
**(వుదయం )**



జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఐజ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బుధవారం వివిధ వార్డుల్లో తిరుగుతూ అక్కడి ఓటర్లను కలుస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి అభివృద్ధి పథకాల గురించి వివరిస్తూ ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏ ఒక్కరికి కూడా కనీసం రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని,ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత బస్ ప్రయాణం, ఉచిత కరెంట్ ఇచ్చిందన్నారు. ఐజ పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇప్పటికే 600 ఇండ్లను ఐజ కి ఇచ్చామని, ఇపుడు పోటీలో ఉన్న 20 మంది కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఇంకా 600 ఇండ్లు ఐజా పట్టణానికి మంజూరు చేస్తామని సంపత్ కుమార్ తెలిపారు. పేదోళ్ల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు. ఐజ పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం కోసం కొద్ది రోజుల క్రితమే 15 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలవడం జరిగిందని సంపత్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యావంతులను, యువకులను, రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తులకు అవకాశం ఇచ్చింది కనుక వారిని గెలిపించి మీ మీ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవాల్సిందని తెలిపారు.ఐజ పట్టణంలో హైమాస్టర్ లైట్లు ఏర్పాటు చేసి ఐజను కాంతుల మధ్య నిలబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ అని, అయిజని అభివృద్ధి చేయడం తప్ప మాకు ఇంకో పని లేదన్నారు. ఐజ అభివృద్ధి లక్ష్యంగా ధ్యేయంగా ముందుకు సాగుతామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో మీ యొక్క విలువైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సంపత్ కుమార్ కోరారు. మార్చి 30 తర్వాత నుంచి అర్హులందరికీ పెన్షన్ ఇచ్చే బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ తీసుకుంతుందని తెలిపారు. ప్రజలకు ఏది కావాలన్నా అది కేవలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మాత్రమే సాధ్యమవుతుంది. కనుక ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా నిలిచి విలువైన ఓట్లు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సంపత్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐజ పట్టణ పరిధిలో పోటీ చేస్తున్నటువంటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మరియు మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప గారు,సింగిల్ విండో మాజీ చైర్మన్ సంకపురం రాముడు గారు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి గారు, మేడికొండ లక్ష్మీ కాంతారావు , ప్రజల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వృత్తిపరమైన నైపుణ్యం
## నిరంతర అభ్యాసమే విజయానికి సోపానం

**విధుల నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలి శిక్షణలో నేర్చుకున్నది క్షేత్రస్థాయిలో అమలు చేయాలి, ప్రజల మన్ననలు పొందే అధికారులే నిజమైన పరిపాలకులు, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,**

**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 04**
**(వుదయం )**




ప్రజాస్వామ్య వ్యవస్థలో పరిపాలనకు కేంద్రబిందువు ప్రజలే, అలాంటి ప్రజల మన్ననలు పొందాలంటే అధికార యంత్రాంగం తన బాధ్యతలను మరింత నైపుణ్యంతో, సమర్థతతో నిర్వహించాల్సిన అవసరం ఉంటుందని అందుకు అనుగుణంగానే నైపుణ్యాల పెంపుదలకు అధికారులు క్షేత్రస్థాయి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. హైదరాబాద్ మానవ వనరుల అభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రెండో బ్యాచ్, గ్రూప్–1 అధికారుల నల్లమల్ల ట్రెక్కింగ్ మరియు స్టడీ టూర్‌ను బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ శిక్షణ కేంద్రంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు కేవలం నిబంధనల అమలుకే పరిమితం కాకుండా ప్రజల అవసరాలను అర్థం చేసుకుని స్పందించే దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. అదే నిజమైన పరిపాలనకు కొలమానం అని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, సమయపాలన, స్పష్టమైన సమాచార వ్యవహారం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.పారదర్శకత, నైతిక విలువలను పాటించడం ద్వారా పరిపాలనపై ప్రజల నమ్మకం మరింత బలపడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా వినడం, సానుకూల దృక్పథంతో పరిష్కారాలు చూపించడం ద్వారా అధికారుల బాధ్యతలు మరింత సమర్థవంతంగా నిర్వహించగలమని అన్నారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని ప్రామాణికంగా తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సేవలు సులభంగా అందేలా వ్యవస్థలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంటుందని అన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అధికారులపై గౌరవం పెరుగుతుందని, అలాంటి అధికారులు ప్రజల మన్ననలు పొందుతారని పేర్కొన్నారు. పరిపాలన అనేది ఒక్క రోజులో ధ్యమయ్యేది కాదని, అది అధికారుల నిరంతర కృషి, నైపుణ్యాభివృద్ధి, సేవాభావం కలయికతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రోగ్రాం డైరెక్టర్ హెచ్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.... క్షేత్రస్థాయి పర్యటనలతోనే అధికారుల నైపుణ్యాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ఈ పర్యటనను తమ నైపుణ్య అభివృద్ధికి విజయవంతంగా మలుచుకోవాలని ఆయన సూచించారు.అనంతరం నల్లమల అటవీ ప్రాంతంలోని సలేశ్వరం అక్కమాంబ గృహాలను సందర్శనకు బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, నాగరాజు అసిస్టెంట్ డైరెక్టర్ , గ్రూప్–I సర్వీస్ అధికారులు 2026 (బ్యాచ్–I) తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధిపై
# ప్రజలకు అవగాహన




**ఖానాపూర్, ఫిబ్రవరి 4(**
**వుదయం విలేకరి)**

ఖానాపూర్ నియోజకవర్గం, ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జన్నారం ప్రభుత్వ వైద్యురాలు ఉమాశ్రీ ఆదేశాల మేరకు తపాలపూర్ గ్రామంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ మనిషి తమ రోజువారీ అలవాట్లలో మార్పులు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, క్యాన్సర్ బారిన పడకుండా మన ఆహారపు అలవాట్లను, ధూమపానం, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం అని సూచించారు. ఎన్సిడి కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించడం జరుగుతుందని, పద్నాలుగు ఏళ్ల వయసు విద్యార్థులకు హెచ్ పి వి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని అలాగే మహిళలు మామోగ్రఫీ, పాప్ స్మియర్ పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. మనం దైనందిన కార్యక్రమాల్లో ఖచ్చితంగా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఏ ఎన్ ఎం మాధవి, పంచాయితి కార్యదర్శి రమేష్, ఆశా కార్యకర్తలు లలిత, విజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ఆఫీసుపై అదనపు కలెక్టర్ నిఘా"

**శాయంపేట, ఫిబ్రవరి 04**
**(వుదయం ) :**




శాయంపేట తహసిల్దార్ కార్యాలయాన్ని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి, సాదాబైనామా, జాతీయ రహదారులు, మీ సేవా సర్టిఫికెట్స్, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, తదితర రికార్డులను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. అదే విధంగా మండలానికి సంబంధించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందని తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్టిఫికెట్స్ త్వరితగతిన జారీ చేయాలని తహసిల్దార్ ను ఆదేశించారు. సర్టిఫికెట్స్ జారీ విషయంలో జాప్యం చేయకూడదని తెలియజేశారు. భూభారతి, సాదా బైనామా, రెవెన్యూ అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, ఎంపీడీవో ఫణి చంద్ర, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ

**హనుమకొండ, ఫిబ్రవరి 04**
**(వుదయం ) :**






హనుమకొండ జిల్లాలో బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ తరహా శిక్షణ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లాలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించడం విశేషం.వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 244 మంది బూత్ లెవల్ ఏజెంట్లు, 26 మంది డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ అధికారులతో (BLOలు) కలిసి తాజా ఓటర్ లిస్ట్ ఆధారంగా ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయాల్సిందిగా సూచించారు.ఈ పరిశీలనలో ముఖ్యంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, ఒక వ్యక్తికి ఒకటికి మించి ఓట్లు ఉన్న డబుల్ లేదా డూప్లికేట్ ఓటర్లను గుర్తించాల్సి ఉంటుందని అధికారులు వివరించారు. ఈ ప్రక్రియ రాబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కు ముందస్తు సిద్ధతగా అత్యంత కీలకమని తెలిపారు.ఓటర్ లిస్టను రాబోయే ఎన్నికల్లో పారదర్శకత, నిష్పక్షపాతత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మార్గదర్శకాలు, సూచనల మేరకు ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు.ఎన్నికల సూపరింటెండెంట్ జగత్ సింగ్ శిక్షణ ఇచ్చారు , ఈ కార్యక్రమంలో హనుమకొండ, కాజీపేట తహసీల్దారులు జి. రవీందర్ రెడ్డి, రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, కార్పొరేటర్లు రాజు, మానస రాంప్రసాద్, విజయ లక్ష్మి సురేందర్, డివిజన్ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు అవగాహన సదస్సు






**మధిర,ఫిబ్రవరి 4, (వుదయం )**

మధిర మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల కోసం అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్,తహసీల్దార్ రాంబాబు, టౌన్ సీఐ రమేష్,ఎన్నికల అధికారులు పాల్గొని, ఎన్నికల నిబంధనలు,ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలు,
ఖర్చుల వివరాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు.ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని వారు సూచించారు.

## జర్నలిస్టుల హక్కుల సాధన
# కమిటీ ఏకగ్రీవ ఎన్నిక"



**శాయంపేట ,ఫిబ్రవరి 4**
**(వుదయం)**

శాయంపేట మండల కేంద్రంలో వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల సాధన కమిటీ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా చల్ల రాజి రెడ్డి, గౌరవ సలహాదారులుగా కాలేశ్వరం నరసయ్య, అధ్యక్షులుగా కోడిమల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా చెన్నబోయిన బుచ్చిబాబు, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ అబ్దుల్లా, బాసాని బాలకృష్ణ, కార్యదర్శిగా తుడుం రాజు, సంయుక్త కార్యదర్శులుగా మోటంరవి, ఉప్పునర్సయ్య, ప్రచార కార్యదర్శిగా బంక ప్రవీణ్, కోశాధికారిగా జక్కుల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బలిజ వేణు, జక్కుల శ్రీనివాస్, జక్కుల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు చల్లారాజిరెడ్డి, అధ్యక్షులు కొడిమాల రాజేందర్ మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టుల హక్కుల సాధన కమిటీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కమిటీనీ శాయంపేట సర్పంచ్ ఉమా–రవి పాల్, మైలారం సర్పంచ్ నూనె దివ్య–తిరుపతి, పత్తిపాక ఉప సర్పంచ్ తుడుం రాజు సత్కరించారు.

# సిపిఐ 11వ వార్డ్ కౌన్సిలర్
## అభ్యర్థిగా షేక్ ఖాసీంబి జోరుగా ప్రచారం

**సత్తుపల్లి, ఫిబ్రవరి 4**
**(వుదయం )**




సత్తుపల్లి మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా సిపిఐ బలపరిచిన షేక్ ఖాసీంబి తన కంకి కొడవలి గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి తిరిగి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసింబి ఉద్దండు మాట్లాడుతూ గెలిపిస్తే 11వ వార్డును అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేయిస్తానని, వార్డు సమస్యలు పరిష్కరిస్తానని , ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో దండు ఆదినారాయణ యోబు, కుదాన్ సాహెబ్ బీబీ కాసింది హుస్సేన్ బి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దాం అభివృద్ధి చేసుకుందాం
## ఏఐసీసీ సెక్రటరీ, రాష్ట్ర పరిశీలకులు పి. విశ్వనాథ్

**పరకాల టౌన్, ఫిబ్రవరి 04**
**(వుదయం ) :**



పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించడానికి పరకాల పట్టణ ప్రజలు సిద్ధంగా ఉన్నారుబుధవారం రోజున పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 5వ వార్డు పరిధిలోని ఏసిపి కార్యాలయం వెనుక భాగాన నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో ఏఐసీసీ సెక్రటరీ, రాష్ట్ర పరిశీలకులు, మాజీ ఎంపీ పి. విశ్వనాథ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.5 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పంచగిరి మాధవి శ్యాంప్రసాద్ గెలుపునకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పరకాల పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.5వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పంచగిరి మాధవి శ్యాంప్రసాద్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, అభివృద్ధి మూసుకులో దోచుకు తిన్నారన్నారు. పట్టణ కేంద్రంలో ఒక ప్రత్యేకమైన డిపిఆర్ వ్యవస్థను ఏర్పాటు చేసి డ్రైనేజ్ వ్యవస్థ,రోడ్లు, ఎలక్ట్రిసిటీ,మంచినీటి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి జరుగుతుందన్నారు.

## 11వ వార్డులో పోస్టర్ ఆవిష్కరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు



**సత్తుపల్లి ,ఫిబ్రవరి 4 (వుదయం ప్రతినిధి)** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11 వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి షేక్ నాగుల్ మీరా ను కేటాయించిన హస్తము గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొడ్డకుల గోపాలరావు సుఖభోగి రాము నాయకులు కార్యకర్తలతో హస్తం గుర్తు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గోడలకు పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో కరిముల్లా కరిముల్లా రాజా సిలార్ సాజిదా నాగూర్ బి మీరాభి నసీమా అరుణ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట మండల

# ప్రగతిపై ప్రత్యేక దృష్టి

**జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం**



**దమ్మపేట, ఫిబ్రవరి 4**

**(వుదయం )**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లోని పలు గ్రామాల్లో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం పాల్గొన్నారు ముందుగా బోగ్గం వారి ఓణీల వేడుక కార్యక్రమంకి హాజరు అయి చిరంజీవి కి ఆశీర్వాదం ఇల్లంధు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ప్రజాపంథా మాస్ లైన్ నాయకుల కలయిక,ఆత్మీయంగా సోయం అని పలకరింపు సున్నం రాములు పార్థివదేహం కి నివాళులు అర్పించి ,కుటుంబ సభ్యులు మనో ధైర్యం నింపిన సోయం వీరభద్రం చిల్లగుంపు గ్రామానికి చెందిన బొగ్గం రాము మనవరాలు ఓణీల అలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని దీవించి అనంతరం ములకలపల్లి మాజీ జెడ్పి టిసి సున్నం.నాగమణి మామ సున్నం రాములు స్వర్గస్థులు అయ్యారు అని విషయం తెలుసుకోని తాళ్లమడ గ్రామం లో సున్నం రాములు పార్థివ దేహం నివాళులు అర్పించిన జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రంవారి వెంటా సున్నం సత్యనారాయణ యువజన నాయకుడు కాకా.శివశంకర్ ప్రసాద్,సున్నం ప్రసాద్, ప్రజాపంథ (మాస్ లైన్ ) నాయకులు అమర్లపూడి రాము, గోకినేపల్లి ప్రభాకర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌తోనే

# పురపాలక అభివృద్ధి సాధ్యం



**: ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**

**కోదాడ ,ఫిబ్రవరి 4(వుదయం)**

మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కోదాడ పట్టణంలోని 22వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తునాం కృష్ణ ఎన్నికల కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలంటే కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు భారీ మెజారిటీతో విజయం అందించాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనమని తెలిపారు. రానున్న రోజుల్లో మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ పాలన మరింత బలోపేతంగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

22వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి తునాం కృష్ణ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

# గడప గడపకు ప్రచారం

**అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తాటి**



**అశ్వారావుపేట ఫిబ్రవరి 4**

**(వుదయం ):**

అశ్వారావుపేట మున్సిపాలిటీ తెలుగు దేశం పార్టీ బలపరిచిన బి ఆర్ ఎస్ పార్టీ 10 వ వార్డు అభ్యర్థి విజయార్థం అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ,ముమ్మరంగా గడప గడపకు ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ 10 వ వార్డు అభ్యర్థులైన కోటగిరి కిషోర్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ప్రచారంలో భాగంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని, గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని. అభివృద్ధి కేవలం బి ఆర్ ఎస్ తో సాధ్యమని, మున్సిపాలిటీ పురోభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు,మండల నాయకులు, వార్డు ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థులకు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమం లో వగ్గేల పూజా తదితరులు పాల్గొన్నారు...

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న పట్టణ అధ్యక్షుడు సత్యం



**చండూరు, ఫిబ్రవరి 04**

**(వుదయం విలేఖరి):**

నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలోని బిజెపి పార్టీకి చెందిన పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్ బిజెపి పార్టీకి రాజీనామా చేసి బుధవారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో హైదరాబాదులో ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసాల జనార్ధన్ రెడ్డి,మొగుదాల దశరథ, కోయిగూర శంకర్,మొగుదాల శేఖర్,ప్రశాంత్,మొగుదాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.నివాస్ కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్ 1టౌన్ సీఐ కరుణాకర్ 3టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి పాల్వంచ సీఐ సతీష్ ఇల్లందు సీఐ సురేష్ చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు మరియు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# 2వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**నాయుడు రాధిక**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 4**

**(వుదయం )**



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 2వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి నాయుడు రాధిక వెంకటేశ్వరరావు సీనియర్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాయుడు రాధిక మాట్లాడుతూ హస్తం గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు బట్టి విక్రమార్క తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఐ డి సి చైర్మన్ మువ్వా విజయబాబు మట్టా రాగమయి దయానంద్ , రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ల సహకారంతో 2వ వార్డును అభివృద్ధి చేస్తానని , కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తారని తెలిపారు. వార్డ్ లో ఉన్న సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. వార్డులో ఉన్న ప్రజలు విశ్లేషకులు తమకు ఆదరిస్తున్నారని తెలిపారు.

నాయుడు వెంకటేశ్వరరావుకు జిల్లా స్థాయిలో మంచి పేరు ఉందని, ఎస్ఎఫ్ఐ లో నాయకత్వం వహించారని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వారని, గతంలో పదో వార్డులో ప్రజలకు రేషన్ కార్డులు మంజూరు చేయించారని, పైప్లైన్లు డ్రైనేజీ, సిసి రోడ్లు నిర్మించాలని, ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలకు సబ్సిడీ లోన్ ఇప్పిచ్చారని అందరికీ సహాయ సహకారాలు అందించే గుణం ఉందని నాయుడు రాధిక వెంకటేశ్వరరావు దంపతులు విద్యావేత్తలు కావడంతో ఘన విజయం సాధించడం ఖాయమని విశ్లేషకులు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

**– ప్రశాంతంగా ఓటింగ్ నిర్వహణకు ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశం**

**భద్రాద్రి కొత్తగూడెం,**

**ఫిబ్రవరి 04 (వుదయం తినిధి)**



మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనను విడుదల చేశారు.ఇందులో భాగంగానే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులతో ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ 08 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 04 స్టాటిక్ సర్వేలయన్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కొత్తగూడెం కార్పొరేషన్ ఇల్లందు అశ్వారావుపేట మున్సిపాలిటీలకు ఈ నెల 11వ తేదీన జరగనున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 101 పోలింగ్ స్థానాలలోని 288 పోలింగ్ కేంద్రాలలో ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రాలు 148 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు 125 మరియు 15 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు.మున్సిపాలిటీల వారీగా సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఎన్నికల పోటీలో నిలుచున్న అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల వద్ద నుండి అనుమతులు పొందిన తర్వాతనే తమ ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.అనుమతులు లేనియెడల ఎన్నికల నియమావళి ప్రకారం అట్టి అభ్యర్థులపై కేసుల నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ఓటర్లను ప్రలోభపరిచే విధంగా ఎవరైనా నగదు మద్యం ఇతరత్రా సామాగ్రిని అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ డీసిఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్ 1టౌన్ సీఐ కరుణాకర్ 3టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి పాల్వంచ సీఐ సతీష్ ఇల్లందు సీఐ సురేష్ చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు మరియు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# చండూరు మున్సిపల్ పీఠం బీఆర్ఎస్‌దే'

**సర్వేలన్నీ అనుకూలం**

**– బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ బెదిరింపులు ఆపాలి**

**– మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**

**చండూరు, ఫిబ్రవరి 04**

**( వుదయం విలేఖరి):**



కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా మునుగోడు నియోజకవర్గం, చండూరు మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి శూన్యం అని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చండూరు మున్సిపాలిటీలో విలేకరులతో మాట్లాడారు. సర్వే రిపోర్టులు అన్ని బీఆర్ఎస్ పార్టీకే అనుకూలంగా ఉన్నాయన్నారు. అందుకే రెండు ఎక్స్ ఆఫీసియో ఓట్లు చండూరులో పెట్టుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ అభ్యర్థులను ప్రచారం చేయకుండా బెదిరింపులకు గురించేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. రాని మంత్రి పదవి కోసం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పదే పదే పాకులాడుతున్నాడని ఎద్దేవా చేశారు.ఎమ్మెల్యే ఉన్నప్పుడు తాను మంజూరు చేయించిన నిధుల్లో ఇంకా రూ.6 కోట్లు ఎమ్మెల్యే ఖర్చు చేయలేకపోతున్నారని, ఆయన అవగాహన రహితం వల్ల చండూరులోని డబుల్ రోడ్డు అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఒకసారి అధికారులతో రివ్యూ పెడితే పనులన్నీ పూర్తి అవుతాయి కానీ దానిపై దృష్టి పెట్టడం లేదన్నారు. భజనపరులను వెంబడేసుకుని ఆయన భజనకే తప్పా మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిపై ఆయనకు ధ్యాస లేదన్నారు. చేతగాని ఎమ్మెల్యేను గెలిపించుకున్నామని చండూరు ప్రజలు బాధపడుతున్నారన్నారు. గతంలో తాము పనులు చేసుకుంటూ పోతే ఇప్పుడు ఎమ్మెల్యే ప్రతీకార రాజకీయాలు చేస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల్లో ఓడిపోతున్నామని కాంగ్రెస్ పైసలను నమ్ముకుందని, తాము మాత్రం ప్రజలనే నమ్ముకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కావాలంటే కాంగ్రెస్ ను ఓడించి బీఆర్ఎస్ కౌన్సిలర్లను గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. అనంతరం మున్సిపాలిటీలోని 1వ వార్డు, 3వ వార్డులో వివిధ పార్టీల నుండి 60 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారందరికీ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, బొడ్డు సతీష్ గౌడ్, గోపిడి వెంకట్ రెడ్డి, చొప్పరి దశరథ, సామ యాదవ రెడ్డి పాల్గొన్నారు

# విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**(బెల్లంపల్లి ,వుదయం ప్రతినిధి)**విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



ఈ క్రమంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, 100 శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

అంతకుముందు మండలంలో టి జి ఐ ఐ సి సంబంధిత భూమిని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు

.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్స్ కోడ్స్ లను రద్దు చెయ్యాలి

**మెదక్ , ఫిబ్రవరి 04(వుదయం ప్రతినిధి)** నాలుగు లేబర్స్ కోడ్స్ లను రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నా దేశ వ్యాప్తంగా జరిగే సమ్మె ను జయప్రదం చెయ్యాలని సీపీఐ ఎమ్ ఎల్ సీపీ పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు నిచ్చారు.కేంద్రంలో 4 వ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, పెట్టుబడి దారుల అనుకూల విధానాలు అమలు చేస్తూ , ప్రజలను కోలుకునే విధంగా తయారు చేస్తూ , పెట్టు బడి దారులకు, అన్ని రకాల మేలు చేస్తుంది అని మండి పడ్డారు, పేదలు నిర్మించుకున్న భూమి, భక్తి, విముక్తి, అడివి, ఆదివాసీ పోరాటాలను , ఆదివాసీలను చంపి ఆదివాసీలను కంది శికులుగా మార్చి వేశారు ,

# గులాబీ జెండా ఎగరేస్తాం

**లింగాల కమల్ రాజు**

**మధిర, ఫిబ్రవరి 4**

**(వుదయం )**



రానున్న ఎన్నికల్లో మధిర మున్సిపాలిటీ పై మరోసారి గులాబీ జెండా ఎగరేస్తామని మాజీ జడ్పీ చైర్మన్, బీ.ఆర్.యస్ పార్టీ మధిర అసెంబ్లీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు దీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా మధిర లో హ్యాట్రిక్ విజయం బీ.ఆర్.యస్ పార్టీకి రావడం ఖాయమన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, మధిర మున్సిపాలిటీ లో కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులే బీ.ఆర్.యస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు.కాంగ్రెస్ పాలనలో మధిర పట్టణం లో అభివృద్ధి కన్నా విధ్వంసం ఎక్కువగా జరిగిందన్నారు. పట్టణం లో మంచిగా ఉన్న సీసీ రోడ్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పేరుతో నాశనం చేశారని దానికి ఒక ముగింపు అనేది లేకుండా చేసారన్నారు. బీ.ఆర్.యస్ ప్రభుత్వం లో మధిర ప్రజలకు ట్యాంక్ బండ్ తో పాటుగా పార్కులు, ఓపెన్ జిమ్ సెంటర్లను, ఇండోర్ స్టేడియం లాంటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.పాత కూరగాయల మార్కెట్ వద్ద అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటు చేశామన్నారు.నిరంతరం విద్యుత్ కోతలతో ఎప్పుడు కరెంట్ వస్తుందో పోతుందో తెలియని పరిస్థితుల నుండి మధిర ప్రజలను బయటపడేసేందుకు నూతన సబ్ స్టేషన్లను ఏర్పాటు తో పాటుగా ఉన్న సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేశామన్నారు. ఎండాకాలం వస్తే పట్టణం లో బోరు బావుల్లో నీళ్లు ఉండేవి కాదని అ సమయం లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసుకునే పరిస్థితి ఉందని అలాంటి పరిస్థితి లేకుండా మధిర శివాలయం వద్ద ఏటి మీద కాజ్ వే ఏర్పాటు చేసి పట్టణం లో నీటి ఎద్దడి లేకుండా చేశామన్నారు. పట్టణం లో డివైడర్ నిర్మాణం తో పాటుగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి మధిర ప్రతిష్టను పెంచడం జరిగిందన్నారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో పట్టణం లో కోట్లాది రూపాయలతో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణం లో పరిశుభ్రత విషయం లో ఎక్కడ వెనుకడుగు వేయకుండా ప్రత్యేక వాహనాలు,సిబ్బంది ని మున్సిపాలిటీ కి కేటాయించి ప్రతి రోజు పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు.పట్టణాలు,పల్లెలు అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ దే అన్నారు. భట్టి విక్రమార్క మధిర ప్రజలకు ఉపయోగ పడే ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేసింది లేదని,మధిర ప్రజల ఓట్లతో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎన్నడూ లేనిది కేవలం మున్సిపల్ ఎన్నికల సమయం లో ఎందుకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు అంటూ హడావుడి చేస్తున్నారని ప్రశ్నించారు. శాసనసభ ఎన్నికల సమయం లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అటకెక్కించారని విమర్శించారు.

మధిర పట్టణం లో పేదలకు ఎందుకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం లేదని, ప్రతి వార్డులో ఉన్న పేదలకు 100 ఇల్లు ఇచ్చే ఓట్లు అడగాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని డ్రామాలు వేసిన మధిర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం - ప్రభుత్వ బాధ్యత

**జర్నలిస్టుల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై వివరణ**

**టి జె ఎం యు యూనియన్**

**పినపాక,,ఫిబ్రవరి 4(వుదయం)**



తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (ఎన్ యు జె ఐ అనుబంధం)టి జె ఎం యు యూనియన్ ఆధ్వర్యములో ఖమ్మం లో జరగ బోయే ఖమ్మం జిల్లా జెనరల్ బాడీ సమావేశానికి జర్నలిస్టులకు ఆహ్వానం.టి జె ఎం యు యూనియన్ వ్యవస్థాపకులు&రాష్ట్ర అధ్యక్షులు ఒక ప్రకటన విడుదల చేశారు. 05/02/2026 న గురువారం సి పి ఐ ఎం పార్టీ ఆఫీస్ పక్కన మంచికంటి భవన్ ఖమ్మం నందు ఉదయం 10 గంటలకు నిర్వహించు చున్నాము.కావున జిల్లా వ్యాప్తంగా ఖమ్మం జిల్లా జర్నలిస్టులు, నియోజకవర్గం,వివిధ మండలాల వారు అందరూ తప్పకుండా రాగలరు అని తెలియజేస్తున్నాం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి కూడా కొంత మందిని ఈ ఖమ్మం సమావేశానికి హాజరు కావాలని ఆసక్తి కలిగిన జిల్లా కమిటీ వారిని,సభ్యులను కూడా ఆహ్వానించడం జరిగింది.ఈ సమావేశములో ముఖ్య అతిథులుగా సి పి ఐ ఎం పార్టీ కార్యదర్శి నున్న నాగేశ్వరరావు జర్నలిస్టుల నుద్దేశించి వారి సలహాలు సూచనలు ఇచ్చి ప్రస్తుతం జరుగుతున్న జర్నలిస్టుల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై వివరణ ఇచ్చి ప్రసంగిస్తారు.విశిష్ట అతిథి:- గోరెంట్ల జానకి రామయ్య ఏం ఏ ఎల్ ఎల్ బి స్టేట్ లీగల్ అడ్వైజర్ గా హాజరయ్యి మన సమావేశానికి వచ్చి యూనియన్ లో జర్నలిస్టులు కి ఎదురయ్యే పలు అక్రమ కేసులపై ప్రసంగించెదరు. కావున జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులకు ఎదురయ్యే పలు సమస్యలు,అక్రిడేషన్ లు,ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులు,ఇతరత్ర సమస్యలు,నూతన జిల్లా కమిటీ, నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం పలు అంశాలపై చర్చ గోష్ఠి నిర్వహిస్తున్నట్లు యూనియన్ వ్యవస్థాపక &రాష్ట్ర అధ్యక్షులు ఐ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని యూనియన్ కి సహకరించి అందరు కలసి కట్టుగా వచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాం. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రతి ఒక్కరు ఒకే పేపర్ పై మీ ఆధార్,మీ సంస్థ ఐడి కార్డ్ జిరాక్స్ తీసుకొని దానితో పాటు మీ పాస్ ఫోటో సుకొని రాగలరని మనవి చేస్తున్నాను

# అవగాహనతోనే టీబీ నియంత్రణ సాధ్యం

**లక్షెట్టిపేట, జనవరి 4**

**(వుదయం )**



ప్రతిఒక్కరూ టీబీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని వెంకట్రావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ అన్నారు. బుధవారం చందారం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రజలకు క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండలం లోని కొత్తూర్ గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా రెండవ విడత కార్యక్రమంలో అనుమానితులందరికీ పోర్టబుల్ మొబైల్ ఎక్స్ రే ద్వారా ఎక్స్ రే పరీక్షలు నిర్వహించి టీబీ నిర్ధారణ చేసినట్లు తెలిపారు.గత మూడు రోజుల నుండి కొత్తూర్, దౌడెపల్లి, తిమ్మాపూర్ గ్రామాలలో క్యాంపులు నిర్వహించి 265 మందికి ఎక్స్ రే పరీక్షలు 80 మందికి తెమడ పరీక్షలు,

200 మందికి షుగర్, బీపి తోపాటు సాధారణ పరీక్షలు నిర్వహించి మందులను అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమం లో వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్లు శోభ , టీబీ సూపర్ వైజర్ సురేష్ ,ఎంఎల్ హెచ్ పి లు సుమలత, అక్షయ , హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎం యేసువర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

# జోరుగా ఎన్నికల ప్రచారం

**కాంగ్రెస్ పార్టీ నాయకుల జోరు ప్రచారాలు, పార్టీలో చేరికలు**




**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 04**

**(వుదయం ప్రతినిధి)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యం లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే రెండవ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మార్త మారుతి ప్రచార కార్యక్రమంలో పాల్గొనగా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆశీస్సులతో రెండవ వార్డ్ అభ్యర్థి పుల్లూరి తిరుమల ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 12వ వార్డు స్వతంత్ర అభ్యర్థి బెజ్జంకి కవితను కాంగ్రెస్ పార్టీలోకి డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథరెడ్డి ఆహ్వానించగా వారు పార్టీ కండువా కప్పుకొని పార్టీలోకి చేరారు. గోపతి భాగ్యను గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాస్,నీలం శ్రీనివాస్,తీగల రమేష్,రాస సంపత్, ముక్తి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి కళ్యాణ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**కామారెడ్డి, ఫిబ్రవరి 4 (వుదయం):** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ మధుమోహన్ బుధవారం తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 99087 12421 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని, కంట్రోల్ రూమ్ కు వచ్చే ఫిర్యాదులను వెంట వెంటనే పరిశీలిస్తూ, పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

## పరగడుపున అరటి పండును తినొచ్చా?



అరటి పండులో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇది మన శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే, దీని వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, చాలా మంది దీనిని పరగడుపున తీసుకుంటారు. ఇలా తీసుకోవడం మంచిదేనా? ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తాయా? మనలో చాలా మంది అరటి పండును పరగడుపున తింటారు. అయితే, అసలు ఇలా తినొచ్చా? లేదో అని కూడా తెలుసుకోకుండా తినేస్తారు. పరగడుపున అరటి పండును తీసుకుంటే.. అది సరిపోను శక్తినివ్వదని వైద్యులు చెబుతున్నారు. ఇంకా ఇది ఆ సమయంలో ఐరన్ ను గ్రహించ లేదు. దీని వలన ఇమ్యూనిటీ పవర్ కూడా తగ్గిపోతుంది. ఇక బరువు తగ్గాలనుకునే వారు దీనిని ఎక్కువగా తీసుకోకూడదు. బనానాలో క్యాలరీలు చాలా తక్కువ ఉంటాయి. దీనిని తీసుకున్న గంటకే ఆకలి వేస్తుంది. ఇక ఏదోకటి తినేస్తారు. ఆ తర్వాత బరువు కూడా అమాంతం పెరుగుతారు. అరటి పండులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇంకా ఇది కడుపు నొప్పిని కూడా తీవ్రతరం చేస్తుంది. కాబట్టి, అరటి పండును ఎక్కువగా తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. పరగడుపున తీసుకుంటే అరటి పండ్లను తీసుకుంటే గ్యాస్, ఎసిడిటీ ఎక్కువ అవుతుంది. దీని వలన మగ వారికీ, ఆడ వాళ్ళకి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. (ఔ*ఇ: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది) పరగడుపున తీసుకుంటే అరటి పండ్లను తీసుకుంటే గ్యాస్, ఎసిడిటీ ఎక్కువ అవుతుంది. దీని వలన మగ వారికీ, ఆడ వాళ్ళకి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి.

## అమ్మాయిలకు ఇది అమృతం?

ఆడవాళ్ళు ఎప్పుడూ ఏదోక సమస్యతో ఇబ్బంది పడుతూనే ఉంటారు. అయితే, వాటిని తగ్గించుకోవడం కోసం హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతూనే ఉంటారు. వాటిలో ప్రధాన సమస్య కాళ్ళ పగుళ్ళు. ఒక్క రూపాయి కూడా లేకుండా ఇంట్లో ఉండే వాటితోనే ఇక్కడ చెప్పిన చిట్కాతో తగ్గించుకోండి. చలి కాలం రాగానే చాలా మంది అమ్మాయిలకు చర్మం పొడిబారడం, కాళ్ళ పగుళ్లు రావడం వంటివి జరుగుతుంటాయి.



అయితే, వీటిలో 'కాళ్ల పగుళ్లు' సమస్య ఎంతో మందిని వేదనకు గురి చేస్తుంది. నడిచేటప్పుడు కూడా కొంచం ఇబ్బందిగా ఉంటుంది. అయితే, దీని నుంచి బయటపడటానికి ఎన్నో క్రీములు వాడుతారు. అయినా కూడా ఎలాంటి ఉపయోగం ఉండదు. దాని కంటే ఇంట్లో ఉండే వాటితోనే ఈ సమస్యకు గుడ్ బై చెప్పొచ్చు. తయారీ విధానం: పల్లీల పొట్టును ఒక గిన్నెలోకి తీసుకుని గ్రైండ్ చేయాలి. ఆ తర్వాత దీనిలో ఒక టీ స్పూన్ కొబ్బరి నూనె, తేనె వేసి మిక్స్ చేయాలి. ఆ తర్వాత దీనిలో కొద్దిగా పాలు పోసి పేస్ట్ లా చేయాలి. పాదాలను ముందుగా నీటితో శుభ్రపరచి.. ఆ తర్వాత ఈ పేస్ట్‌ను పగుళ్లు ఉన్న ప్రదేశంలో రాసి 10 నిముషాల పాటు ఉంచి నీటితో శుభ్ర పరచుకోండి. ఇలా చేసిన తర్వాత రక్తప్రసరణ కూడా మెరుగుపడి పగుళ్లు తగ్గుతాయి. అమ్మాయిల్లో ఎవరైతే ఈ కాళ్ళ పగుళ్ళ వల్ల బాధ పడతారో వాళ్ళు వారంలో రెండు సార్లు ఇలా చేస్తే, పాదాలు మెత్తగా అవుతాయి. ఖరీదైన క్రీములు వాడే కంటే, ఇంట్లో ఉండే వాటితోనే సులభంగా వాడుకోండి.

## పసుపులో ఆ రెండు కలిపితేనే అది పవర్ ఫుల్

పసుపును మనం సహజమైన యాంటీబయాటిక్ అని, గొప్ప యాంటీ ఇన్‌ఫ్లమేటరీ అని నమ్ముతాం. కానీ, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ పూజా రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మనం పసుపును విడిగా తీసుకుంటే అందులోని ప్రయోజనాలు శరీరానికి 1% కూడా అందవు. పసుపులోని ప్రధాన సమ్మేళనమైన 'కర్కుమిన్'ను గ్రహించే శక్తి మన శరీరానికి చాలా తక్కువగా ఉండటమే దీనికి కారణం. మనం పసుపు తిన్న వెంటనే మన కాలేయం (ఒతిలవతీ) దానిని రక్తంలోకి చేరకముందే విచ్ఛిన్నం చేసి బయటకు పంపిస్తుంది. పసుపు తన పూర్తి స్థాయి ప్రభావాన్ని చూపించాలంటే దానికి తోడుగా కొన్ని పదార్థాలు అవసరమని సైన్స్ చెబుతోంది. డాక్టర్ పూజా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో పసుపు గ్రహణ శక్తిని పెంచే మార్గాలను వివరించారు. మన అమ్మమ్మల కాలం నాటి పసుపు, మిరియాల పొడి నెయ్యి కాంబినేషన్ వెనుక ఉన్న అసలు రహస్యం ఇప్పుడు ఆధునిక వైద్య పరిశోధనల్లో కూడా నిరూపితమైంది. కేవలం ఒక చిటికెడు మిరియాల పొడి చేర్చడం వల్ల పసుపు పనితీరు 20 రెట్లు పెరుగుతుందని ఆమె చెబుతున్నారు. ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం. మిరియాల పొడి : పసుపును మిరియాల పొడితో కలిపి తీసుకుంటే, శరీరంలో దాని గ్రహణశక్తి ఏకంగా 100 శాతం పెరుగుతుంది. మిరియాల్లో ఉండే 'పైపెరిన్' అనే పదార్థం, లివర్ కర్కుమిన్‌ను విచ్ఛిన్నం చేయకుండా అడ్డుకుంటుంది. దీనివల్ల పసుపు నేరుగా రక్తంలోకి ప్రవేశిస్తుంది. కొవ్వు పదార్థాలు : కర్కుమిన్ నీటిలో కరగదు, కేవలం కొవ్వులో మాత్రమే కరుగుతుంది. కాబట్టి పసుపును నెయ్యి లేదా కొబ్బరి నూనె వంటి ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకున్నప్పుడు మాత్రమే అది శరీరానికి అందుతుంది. ప్రాచీన విజ్ఞానం: అందుకే మన పెద్దలు పసుపును కూరల్లో నూనెతో వేయించడం లేదా పాలలో నెయ్యి, మిరియాల పొడి వేసి ఇచ్చేవారు. ఈ మూడు కలిసినప్పుడు అది ఒక శక్తివంతమైన ఔషధంగా మారుతుంది. ఇకపై పసుపు పాలు తాగినా లేదా కూరల్లో వాడినా, అందులో ఒక చిటికెడు మిరియాల పొడి కొద్దిగా నెయ్యి ఉండేలా చూసుకోండి. అప్పుడే పసుపులోని అసలైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మానికి, ఆరోగ్యానికి అందుతాయి.



## కీళ్లు నొప్పులుగా ఉన్నాయా?



ఉరుకుల పరుగుల జీవితంలో రక్తపోటు, అధిక బరువు, కీళ్ల నొప్పులు నిద్రలేమి వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ మందుల షాపుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మన ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారం ఉంది. అదే అశ్వగంధ. దీనిని 'ఇండియన్ జిన్సెంగ్' అని కూడా పిలుస్తారు. శరీరానికి గుర్రపు వేగాన్ని, శక్తిని ఇచ్చే గుణం దీనికి ఉండటం వల్లే దీనికి ఆ పేరు వచ్చింది. అశ్వగంధను టీ రూపంలో తీసుకోవడం వల్ల కలిగే లాభాలను ఆయుర్వేద నిపుణులు వివరిస్తున్నారు. అశ్వగంధ కేవలం ఒక మూలిక మాత్రమే కాదు, అది శరీరంలోని హార్మోన్లను క్రమబద్ధీకరించే ఒక శక్తివంతమైన ఔషధం. ఒత్తిడిని తగ్గించే కార్టిసాల్ నియంత్రణ నుండి, పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచడం వరకు ఇది ఎంతో మేలు చేస్తుంది. దాల్చిన చెక్క, అల్లం, యాలకులు కలిపి తయారు చేసే ఈ టీ రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల్లోనూ సాటిలేనిది. రోగ నిరోధక శక్తి : చలికాలంలో మారుతున్న సీజన్లలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలను ఎదుర్కోవడానికి ఇది శరీరానికి అవసరమైన బలాన్ని ఇస్తుంది. ఒత్తిడి ఆందోళన: శరీరంలో ఒత్తిడిని కలిగించే 'కార్టిసాల్' హార్మోన్‌ను ఇది అదుపులో ఉంచుతుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత చేకూరి, ఆందోళన తగ్గుతుంది. బరువు నియంత్రణ: అశ్వగంధ టీ శరీర మెటబాలిజంను (జీవక్రియ) వేగవంతం చేస్తుంది. దీనివల్ల కొవ్వు నిల్వలు కరిగి, బరువు తగ్గడం సులభమవుతుంది. కీళ్ల నొప్పులు: ఇందులోని 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ' గుణాలు ఆర్థరైటిస్ మరియు కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. కీళ్లలో దృఢత్వాన్ని తగ్గించి నడకను సులభతరం చేస్తుంది. మంచి నిద్ర: నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ టీని క్రమం తప్పకుండా తీసుకుంటే నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది.

## వాకింగ్ యోగా చేద్దామా!

చక్కటి ఆరోగ్యం కోసం కొంతమంది యోగా చేస్తే, మరికొందరు నడకని ఎంచుకుంటారు. ఇంకొందరు... రెండింటినీ విడివిడిగా చేస్తుంటారు. అయితే, నడవడం విసుగ్గా అనిపించినా, యోగా సెషన్‌కి సమయం కేటాయించలేకపోయినా... ఏం పరవాలేదు. రెండింటినీ కలిపి వాకింగ్ యోగా ప్రాక్టీస్ చేసేయండి అంటున్నారు నిపుణులు. దీంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. అదెలాగంటారా? ఆసనాలు, స్ట్రెచ్‌లు కలిపి చేయడమే! ఉదాహరణకు నడుస్తూనే... సైడ్ స్ట్రెచ్ తీసుకోవడం, షోల్డర్ రోల్స్, యాంకిల్ రొటేషన్స్ చేయడం, దీర్ఘశ్వాస తీసుకోవడం వంటివన్నీ ఈ తరహానే. నెమ్మదిగా ఈ వాకింగ్ యోగా పోశ్చర్‌ని సరిదిద్దడంతో పాటు ఫ్లెక్సిబిలిటీనీ, బ్యాలెన్స్‌నూ మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణ లోపాలను సరిదిద్దుతుంది. ఒత్తిడి కూడా అదుపులో ఉంటుంది. లో-ఇంపాక్ట్ మూమెంట్స్ కావాల్సిన వారు, వృద్ధులు, జాయింట్ సమస్యలు ఉన్నవారు... తీవ్రమైన వర్కవుట్లు లేకుండానే శ్వాస సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.



## గార్డెన్‌లో ఉండే ఈ కూరగాయతో.. క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చు!



ముఖ్యంగా క్యాన్సర్ సమస్యతో ఎంతో మంది బాధ పడుతున్నారు. దీని కోసం వేలకు వేలు పెట్టి మందులను వాడుతుంటారు. కానీ, వాటి కన్నా మన గార్డెన్ లో ఉండే వాటితోనే ఈ ప్రాణాంతక సమస్యకు చెక్ పెట్టొచ్చు. ఈ మధ్య కాలంలో అందరూ ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా గడుపుతున్నారు. అయితే, ఇదే సమయంలో సమయానికి ఫుడ్ కూడా సరిగా తినలేకపోతున్నారు. దీని వలన అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. మన అందరి పెరట్లో పచ్చిమిర్చి మొక్క ఉంటుంది. అయితే, కొందరు దీనిని పక్కన పెట్టేస్తారు. మరి కొందరు అన్ని కూరల్లో వేసుకుని తింటారు. అయితే, సరైన విధంగా తీసుకుంటే ఇది మనకీ ఎంతో మేలు చేస్తుంది.పచ్చిమిర్చిలో మన శరీరానికి కావాల్సిన విటమిన్లు, పోషకాలు ఉంటాయి. ఇవి ఇమ్యూనిటీ పవర్ ను పెంచి అనారోగ్య సమస్యలు రాకుండా చేస్తాయి. జలుబు, దగ్గుతో ఇబ్బంది పడే వారికీ ఇది ఎంతో మేలు చేస్తుంది.అంతేకాదు, ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియాను కూడా తొలగిస్తుంది. దీనివల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలు కూడా రాకుండా ఉంటాయని నిపుణులు కూడా చెబుతున్నారు. ఈ మిర్చిలో ఉండే ఫైబర్ తిన్న ఫుడ్ ను జీర్ణం చేస్తుంది. అలాగే, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు కూడా రావు. ఇది అన్ని కూరగాయల్లో చిన్నది కానీ, దాని లాభాలను చూసి అందరూ ఆశ్చర్యపోవాల్సిందే. ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లయితే రు వైద్యున్ని సంప్రదించి తీసుకోవడం మంచిది.

## వారానికి ఒక్క పెగ్ వేసినా రిస్క్ తప్పదా?

ఒక్క పెగ్ వేస్తే ఆరోగ్యం బాగుంటుందని చాలా మంది నమ్ముతుంటారు. కానీ, డాక్టర్ ఎర్నెస్ట్ హాక్ వంటి నిపుణులు మాత్రం వారానికి ఒక్క డ్రింక్ తీసుకున్నా అది ప్రమాదకరమే.. మద్యం విషయంలో సురక్షితమైన పరిమితి అంటూ ఏదీ లేదు అని కుండబద్దలు కొడుతున్నారు. అమెరికాలో 2019లో నమోదైన 1.8 మిలియన్ క్యాన్సర్ కేసుల్లో సుమారు లక్ష కేసులు మద్యం వల్లే సంభవించాయి. పొగాకు, రేడియేషన్, ఆస్బెస్టాస్.. వీటి వల్ల క్యాన్సర్ వస్తుందని అందరికీ తెలుసు. కానీ, ఆల్కహాల్ కూడా అదే స్థాయి ప్రమాదకరమైన 'కార్సినోజెన్' (క్యాన్సర్ కారకం) అని చాలా మందికి తెలియదు. అమెరికాలో జరిగిన తాజా సర్వే ప్రకారం, సగం మంది అమెరికన్లకు మద్యం వల్ల క్యాన్సర్ వస్తుందనే విషయమే తెలియదు. కానీ, వైద్య శాస్త్రం మాత్రం మద్యం సేవించడం వల్ల ఏడు రకాల క్యాన్సర్ల ముప్పు స్పష్టంగా పెరుగుతుందని హెచ్చరిస్తోంది. అసిటాల్డిహైడ్ : శరీరం మద్యాన్ని విచ్ఛిన్నం చేసినప్పుడు 'అసిటాల్డిహైడ్' అనే విష పదార్థం తయారవుతుంది. ఇది మన కణాలలోని డీఎన్ఏ, ప్రోటీన్లను దెబ్బతీస్తుంది. ఫలితంగా కణాలు అదుపు తప్పి పెరిగి క్యాన్సర్‌కు దారితీస్తాయి. ఫ్రీ రాడికల్స్ ఉత్పత్తి: మద్యం సేవించడం వల్ల శరీరంలో హానికరమైన 'ఫ్రీ రాడికల్స్' పెరుగుతాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (మంట) కలిగించి డీఎన్ఏను నాశనం చేస్తాయి. హార్మోన్ల అసమతుల్యత: ఆల్కహాల్ వల్ల శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు పెరుగుతాయి. దీనివల్ల ముఖ్యంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ముప్పు గణనీయంగా పెరుగుతుంది. పోషకాల గ్రహణశక్తి దెబ్బతినడం: మద్యం వల్ల విటమిన్లు, పోషకాలను శరీరం గ్రహించలేకపోతుంది, ఇది రోగనిరోధక శక్తిని తగ్గించి క్యాన్సర్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. మద్యం ప్రభావం పురుషుల కంటే మహిళలపై ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.మహిళల్లో: వారానికి ఒక డ్రింక్ కంటే తక్కువ తీసుకునే వారిలో క్యాన్సర్ ముప్పు 16% ఉంటే, రోజుకు ఒక పెగ్ వేసే వారిలో అది 19% కి, రెండు పెగ్గులు తీసుకునే వారిలో 22% కి పెరుగుతుంది. పురుషుల్లో: ఈ ముప్పు వరుసగా 10%, 11%, 13% గా ఉంటుంది. మహిళల శరీర బరువు తక్కువగా ఉండటం మరియు మద్యాన్ని అరిగించే ఎంజైములు తక్కువగా ఉండటం వల్ల వారు త్వరగా క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంది.



## కిడ్నీల్లో రాళ్లు ఉన్నాయా? ఈ సహజ పానీయం వరం లాంటిదే!

ప్రతి సీజన్‌లోనూ మనకు లభించే అద్భుతమైన పానీయం కొబ్బరి నీరు. దీనిని ప్రకృతి సిద్ధమైన ఎనర్జీ డ్రింక్ అని పిలుస్తారు. ఎటువంటి రసాయనాలు లేదా అదనపు చక్కెరలు లేని ఈ స్వచ్ఛమైన నీరు మన శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను పుష్కలంగా అందిస్తుంది. కేవలం దాహం తీర్చుకోవడమే కాకుండా, తల నుండి కాలి గోటి వరకు ఆరోగ్యానికి ఈ నీరు ఒక వరప్రదాయినిలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కొబ్బరి నీళ్లలో పొటాషియం, సోడియం, మెగ్నీషియం కాల్షియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో నీటి సమతుల్యతను కాపాడుతూ హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. ముఖ్యంగా జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తపోటును నియంత్రించడంలో సహజమైన చర్మ సౌందర్యాన్ని పెంచడంలో దీనికి సాటిలేదు. బరువు తగ్గాలనుకునే వారికి మరియు జిమ్ వెళ్ళేవారికి ఇది ఒక ఉత్తమమైన ప్రత్యామ్నాయం. సహజ ఎలక్ట్రోలైట్: వ్యాయామం చేసినప్పుడు లేదా ఎండలో తిరిగినప్పుడు శరీరం కోల్పోయిన ఖనిజాలను కొబ్బరి నీరు తక్షణమే తిరిగి నింపుతుంది. ఇది అలసటను తగ్గించి శక్తిని ఇస్తుంది. జీర్ణ వ్యవస్థకు మేలు: ఆమ్లత్వం, గ్యాస్ మరియు మలబద్ధకం వంటి సమస్యలతో బాధ పడేవారికి కొబ్బరి నీరు అద్భుతంగా పనిచేస్తుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణ: ఇందులో కేలరీలు చాలా తక్కువ. ఇది తాగడం వల్ల కడుపు నిండిన అనుభూతి కలిగి, అనారోగ్యకరమైన స్నాక్స్ వైపు మనసు వెళ్లకుండా చేస్తుంది. గుండె ఆరోగ్యం: పొటాషియం అధికంగా ఉండటం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. కిడ్నీ పనితీరు: ఇది ఒక సహజ మూత్రవిసర్జనకారి. శరీరం నుండి విషాలను బయటకు పంపి, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది. చర్మ సౌందర్యం: ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి సహజమైన మెరుపును ఇస్తాయి. ముఖంపై ముడతలను తగ్గించి యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.



## వెల్లుల్లి.. తింటున్నారా?



ఉల్లిలాగే.. వెల్లుల్లి కూడా ఆరోగ్యానికి ఎంతో మంచిది. వెల్లుల్లిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు. వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అది శరీరం లోపల రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతుంది. ఇందులోని యాంటీ క్లాటింగ్ గుణాలే దీనికి కారణం. ముఖ్యంగా గుండె జబ్బుతో బాధపడే వారు వెల్లుల్లిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల గుండెకు రక్తప్రసరణ మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. కానీ వివిధ రకాల శస్త్రచికిత్సలు చేయించుకోబోయే వారు మాత్రం వెల్లుల్లి వినియోగం విషయంలో ఓసారి వైద్యుడిని సంప్రదించి తగిన సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. అధిక బరువుతో ఇబ్బందిపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ప్రయోజనం పొందే అవకాశాలున్నాయంటున్నారు నిపుణులు. కారణం వెల్లుల్లిలో ఉండే అలిసిన్ అనే పదార్థమే. ఇందులోని ఔషధ గుణాలు రక్తంలోని ట్రైగ్లిజరైడ్స్‌ని తగ్గించి, శరీర బరువును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. వెల్లుల్లి తీసుకోని వారితో పోల్చితే.. తరచూ ఆహారంలో భాగంగా దీన్ని తీసుకునే వారిలో జలుబు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు తక్కువగా వస్తాయట! వీటితో పాటు వెల్లుల్లిలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాల కారణంగా గొంతు సంబంధిత సమస్యలు బాధించవు. అందుకే గొంతు నొప్పితో బాధపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చంటున్నారు నిపుణులు.

## వెనెజువెలా చమురుతో భారత్‌కు 3 బిలియన్ డాలర్లు ఆదా

అమెరికాతో ట్రేడ్ డీల్‌పై అంగీకారానికి వచ్చిన భారత్.. వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లకు సిద్ధమైంది. ఈ నిర్ణయంతో మన దేశానికి ఏటా దాదాపు 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.27వేల కోట్లు) ఆదా కానుందట. ఈ మేరకు ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది.



భారత్ చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే దిగుమతుల వ్యయం భారీగా తగ్గుతుందని ఈ నివేదిక పేర్కొంది. "వెనెజువెలా చమురు బ్యారెల్‌పై 10–12 డాలర్ల వరకు డిస్కౌంట్ లభిస్తే.. ఆ చమురును ఎంచుకోవడం భారత్‌కు లాభదాయకమే. రవాణా వ్యయం, ఇతర ఖర్చులన్నీ తీసేసినా ఏటా మన దేశానికి చమురు దిగుమతుల బిల్లు 3 బిలియన్ డాలర్ల మేర తగ్గుతుంది. ప్రస్తుతం చమురు ధరల డేటా ప్రకారం.. వెనెజువెలా ముడిచమురు బ్యారెల్ ధర దాదాపు 51 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది" అని ఎస్‌బీఐ రీసెర్చ్ తమ నివేదికలో తెలిపింది. భారత్ తమ ముడి చమురు కొనుగోళ్లను రష్యా నుంచి వెనెజువెలాకు మళ్లిస్తే.. ఖర్చు విషయంలో అనేక అంశాలను పరిగణించాల్సి ఉంటుంది. డిస్కౌంట్ ఎంత వస్తుంది.. రవాణా ఖర్చులు, సమయం, బీమా వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని మన వ్యయాలను లెక్కలేసుకోవాలి. భౌగోళికపరంగా వెనెజువెలా మనకు చాలా దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి చమురు రవాణాకు పట్టే సమయం.. పశ్చిమాసియా దేశాలతో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ. ఇక, రష్యా నుంచి వచ్చే సమయం కంటే రెట్టింపు. దీంతో వెనెజువెలా చమురుకు రవాణా వ్యయం అదనపు భారం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, రష్యా నుంచి డిస్కౌంట్ ధరకు చమురు సుదీర్ఘ కాలం లభించే అవకాశం లేదనే వాదనలు కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధ పరిస్థితులు తగ్గుముఖం పడితే డిస్కౌంట్ ఆగిపోవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వేళ వెనెజువెలా చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గు చూపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఇండియా-యూఎస్ డీల్ పై లోక్‌సభలో కేంద్రం ప్రకటన



భారత్ –యూఎస్ ట్రేడ్ డీల్ పై పీయూష్ గోయల్ ప్రసంగం సమయంలో లోక్ సభలో గందరగోళం ఏర్పడింది. ప్రసంగాన్ని విపక్ష సభ్యులు అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళన మధ్యే గోయల్ తన ప్రసంగాన్ని కంటి న్యూ చేశారు. ఈ క్రమంలో విపక్ష సభ్యుల తీరుపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్ర హం వ్యక్తం చేశారు. నిరసన తెలిపే విధానం ఇదేనా సీనియర్లు, గతంలో ప్రభుత్వాన్ని నడిపిన వారు వ్యవహరించే తీరు ఇదేనా అంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో విపక్ష సభ్యులు ఆందోళన విరమించక పోవడంతో సభ ను మధ్యహానం 2 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు.

భారత్–అమెరికా ట్రేడ్ డీల్‌పై కేంద్రం పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేసింది. ఇవాళ లోక్ సభలో మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంతో భారత్ సేఫే అని స్పష్టం చేశారు. మన రైతులకు ఈ డీల్ రక్షణ ఇస్తుందన్నారు. మోడీ–ట్రంప్ రెగ్యులర్ టచ్ లోనే ఉన్నారని తెలిపారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదన్నారు. ఈ ఒప్పందంతో భారతీయ ఎగుమతులకు లాభం చేకూరనుందని ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. అయితే కాగా భారత్ తో వాణిజ్య ఒప్పందానికి అగీకరిస్తున్నామని యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ మొన్న ప్రకటించిన సంగతి తెలిసిందే. మా వస్తువులపై సున్నా సుంకాలకు, రష్యా చమురు నిలిపివేతకు భారత్ అంగీకరించిందని మోడీ నాకు గొప్ప స్నేహితుడు అని ట్రంప్ తన సోషల్ డియా అకౌంట్ లో పోస్టు చేశారు. ఈ డీల్ తో 25 శాతం అదనపు సుంకాలు భారత్ పై ఉండబోవని యూఎస్ స్పష్టం చేసింది. ఇకపై సుంకాలు 18 శాతానికి తగ్గుతాయని తెలిపింది. ట్రంప్ ప్రకటను భారత ప్రభుత్వం సైతం ధృవీకరించగా ఇవాళ పార్లమెంట్ లో అధికారికంగా ప్రకటించింది.

# జియో బ్లాక్‌రాక్ సంపద నిర్వహణ సేవలు




దేశీయ సంపద నిర్వహణ పరిశ్రమలో 20 కోట్ల మందికి సేవలు అందించే అవకాశం ఉందనే అంచనాతో, జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ 'ప్రత్యేకించిన సూచనలు అందించడానికి' ఒక టెక్ ప్లాట్‌ఫామ్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ సేవల కోసం వినియోగదారులు ఏడాదికి రూ.350 ప్రారంభ ధర చెల్లించాల్సి ఉంటుంది. బ్లాక్‌రాక్ అలాడిన్ టెక్నాలజీతో నడిచే ఈ ప్లాట్‌ఫామ్, మ్యూచువల్ ఫండ్ ఎంపికలపై సలహాలు అందిస్తుంది. అంతర్జాతీయంగా 14 లక్షల కోట్ల డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తూ, మన దేశంలో జియోతో కలిసి బ్లాక్‌రాక్.. పెట్టుబడి సలహా వేదికను తీసుకొచ్చింది. ఇందులో నమోదైన వినియోగదారుల రిస్క్ ప్రొఫైల్, పెట్టుబడి లక్ష్యాలను తెలుసుకుని, వారికి సలహాలను అందించడానికి ఈ ప్లాట్‌ఫామ్ ప్రయత్నిస్తుందని కంపెనీ తెలిపింది. రోజువారీ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొంది. రూ.లక్ష విలువైన పర్యవేక్షణ ఆస్తులకు ఏడాదికి రూ.350 చెల్లించాలి. తదుపరి ఆస్తుల విలువలో 0.35% చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రారంభంలో తొలి 3 నెలలు ప్లాట్‌ఫామ్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చని కంపెనీ ఎండీ, సీఈఓ మార్క్ పిల్గ్రెమ్ వెల్లడించారు.

# బిజినెస్

## గూగుల్ కీలక నిర్ణయం.. బెంగళూరులో భారీ క్యాంపస్



అమెరికా వర్క్ వీసాల హెచ్1బి నిబంధనలను మరింత కఠినతరం చేసిన విషయం తెలిసిందే. కొత్తగా హెచ్1బి వీసా తీసుకోవాలనుకునే ఉద్యోగులు, కంపెనీలు అక్షరాలా లక్ష డాలర్లు చెల్లించాల్సిందే. దీంతో విదేశీ ఉద్యోగులను నియమించుకోవడం అక్కడి కంపెనీలకు కత్తిద సాములా మారింది. ఈ నేపథ్యంలో టెక్ దిగ్గజమైన తన భవిష్యత్ వర్క్ ఫోర్స్ ను ఎక్కడ విస్తరించాలన్నదానిపై కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. వీసాల కోసం ఎదురుచూడకుండా.. భారత్ పై మరింత పెట్టుబడి పెట్టేందుకు గూగుల్ సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు 20 వేల మందికి పైగా ఉద్యోగులకు ఆ కంపెనీలో పనిచేసే అవకాశం లభిస్తుందని బ్లూమ్ బర్గ్ నివేదిక వెల్లడించింది. వైట్ ఫీల్డ్ లోని అలెంబిక్ సిటీ ఈ ప్రాజెక్టుకు కేంద్రంగా నిలవనుంది. బెంగళూరులో ఉన్న ప్రధాన ఐటీ కారిడార్లలో ఇది కూడా ఒకటి. గూగుల్ మాతృసంస్థ అయిన అల్ఫాబెట్ ఇప్పటికే అక్కడ ఒక ఆఫీస్ ను లీజుకు తీసుకోగా.. మరో రెండు టవర్లకు ఆప్షన్లు పొందింది. సుమారు 24 లక్షల చదరపు అడుగుల్లో మూడు టవర్లు ఉన్నాయి. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం.. 6.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న టవర్.. కొద్ది నెలల్లోనే సంస్థ ఉద్యోగులకు అందుబాటులోకి రానుంది. మిగతా రెండు టవర్ల నిర్మాణం ఏడాది కాలంలో పూర్తయ్యే అవకాశం ఉంది. వీటిలో అల్ఫాబెట్ అధికారికంగా ఒక టవర్ కు సంబంధించిన లీజు గురించి మాత్రమే వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో సుమారు 14 వేల మంది గూగుల్ ఉద్యోగులు ఉండగా.. వైట్ ఫీల్డ్ క్యాంపస్ పూర్తిస్థాయిలో ప్రారంభమైతే.. గూగుల్ ఇండియా వర్క్ ఫోర్స్ మరింత రెట్టింపు కానుంది. దీనివల్ల గ్లోబల్ కార్యకలాపాల్లో భారత్ కు మరింత ప్రాధాన్యం పెరగుతుందని నిపుణులు చెప్తున్నారు. గత ఏడాది బెంగళూరులో గూగుల్ అతిపెద్ద క్యాంపస్‌ను ప్రారంభించింది. ఇందులో వినోద సదుపాయాలు, భారీ క్యాంటీన్లు ఉన్నాయి. అప్పటి నుంచి నియామకాలు వేగంగా జరుగుతున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ లీడర్‌షిప్, మెషిన్ లెర్నింగ్, చిప్ డిజైన్, అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ వంటి విభాగాల్లో వందలాది ఉద్యోగాల కోసం గూగుల్ ప్రకటనలు జారీ చేసింది. కొన్ని పోస్టులకు పీహెచ్‌డీ అర్హతలు కూడా నిర్దేశించింది. యూట్యూబ్ కూడా జనరేటివ్ ఏఐ టూల్స్ అభివృద్ధి కోసం భారత్‌లో తన ఇంజినీరింగ్ టీమ్‌ను విస్తరిస్తోంది.

# తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరిగాయి ..!



తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

# బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో నూతన బస్సుల తయారీ

బ్లేడ్ బ్యాటరీ టెక్నాలజీతో కొత్త ఎలక్ట్రిక్ బస్సులను తయారు చేయనున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ వెల్లడించింది. వచ్చే త్రైమాసికం నుంచే వీటిని ఉత్పత్తి చేయనున్నట్లు ఎంఇఐఎల్‌కు చెందిన ఒలెక్ట్రా ఓ ప్రకటనలో పేర్కొంది. భారత ఇవి బస్ రంగంలో తొలిసారిగా ఒలెక్ట్రా అభివృద్ధి చేసిన బ్లేడ్ బ్యాటరీ ప్యాక్‌కు లభించిన సర్టిఫికేషన్ సంస్థకు కీలక మైలురాయిగా నిలిచిందని సంస్థ ఎండి మహేష్ బాబు వెల్లడించారు. ఇది సంస్థ టెక్నాలజీ ఆధారిత వృద్ధి వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.



శుభ్రమైన, సమర్థవంతమైన, సుస్థిర మొబిలిటీ పరిష్కారాల ద్వారా దేశంలో విద్యుత్ వాహన రంగంలో వస్తున్న మార్పులకు ఒలెక్ట్రా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) ఆర్థిక ఫలితాలకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మహేష్ బాబు మాట్లాడుతూ.. బ్లేడ్ బ్యాటరీ సాంకేతిక పరిజ్ఞానంతో నూతన బస్సుల ఉత్పత్తి ప్రణాళికను వెల్లడించారు. క్రితం క్యూ3లో 385 ఎలక్ట్రిక్ వాహనాలను డెలివరీ చేసి సంస్థ కొత్త రికార్డును నెలకొల్పిందన్నారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే డెలివరీలు 37 శాతం పెరిగాయి. కంపెనీ ఆదాయం 29 శాతం పెరిగి రూ.663.60 కోట్లకు చేరింది. కంపెనీ నికర లాభం రూ.46.68 కోట్లుగా నమోదయ్యింది.

# క్రీడలు



## ఫైనల్లోకి దూసుకెళ్లిన ఇంగ్లండ్

అండర్ 19 వన్డే ప్రపంచ కప్ 2026లో భాగంగా జరిగిన తొలి సె ఫైనల్ పోరులో అదరగొట్టింది ఇంగ్లాండ్. ఆస్ట్రేలియా జట్టును చిత్తుగా ఓడించి ఫైనల్ కు చేరుకుంది.ఈ మొదటి సె ఫైనల్ లో ఇంగ్లాండ్ ఏకంగా 27 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఈ అండర్ 19 వన్డే వరల్డ్ కప్ లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్ లో ఇంగ్లాండ్ మొదట బ్యాటింగ్ చేసింది. ఈ నేపథ్యంలో 50 ఓవర్లు ఆడిన ఇంగ్లాండ్ జ 19 జట్టు ఏడు వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. ఇక ఈ లక్ష్యాన్ని చేదించే క్రమంలో ఆస్ట్రేలియా తేలిపోయింది. 47.3 ఓవర్లు ఆడిన ఆస్ట్రేలియా, 250 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. ఇక ఈ విజయంతో ఇంగ్లాండ్ ఫైనల్ కు వెళ్ళగా.. ఆస్ట్రేలియా ఇంటి దారి పట్టింది. బుధ వారం ఆఫ్ఘనిస్తాన్ వర్సెస్ ఇండియా మధ్య రెండో సె ఫైనల్ ఉంది. ఇందులో గెలిచిన జట్టు, ఇంగ్లాండ్ తో ఫైనల్ ఆడనుంది.

## పాక్ వివాదంపై గౌతమ్ గంభీర్ ఏమన్నాడంటే..!

టీ 20 వరల్డ్ కప్ 2026 మరికొన్ని రోజుల్లోనే భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. అయితే.. గ్రూప్ స్టేజ్‌లో భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను తాము బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించిన విషయం



తెలిసిందే. కానీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ఈ విషయాన్ని ఐసీసీకి అధికారికంగా తెలపలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భారత్, పాక్ మ్యాచ్‌పై అనిశ్చితి నెలకొంది. ఈ అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి టీమ్‌ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ నిరాకరించాడు. (బుధవారం) భారత్, దక్షిణాఫ్రికాల మధ్య వార్మప్ మ్యాచ్ జరగనుంది. దీనికోసం అతడు ముంబయి బయలుదేరాడు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో విలేకరులు గౌతమ్‌కు పాక్ వివాదంపై ప్రశ్నలు సంధించారు. అయితే అతడు సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి ముందుకు కదిలాడు. పాకిస్థాన్ ప్రభుత్వం తమ క్రికెట్ జట్టు.. వరల్డ్ కప్ ఆడేందుకు అనుమతి ఇచ్చింది. కానీ.. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మాత్రం ఒప్పుకోలేదు. ఇది ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఐసీసీ ఇప్పటికే పీసీబీకి హెచ్చరికలు జారీ చేసింది. రెవెన్యూపరంగా భారత్, పాక్ మ్యాచ్‌కు ప్రాధాన్యమున్న విషయం తెలిసిందే. భారత్, పాకిస్థాన్, నబియా, నెదర్లాండ్, యూఎస్‌ఏ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి.

## పాకిస్థాన్.. దానికదే పెద్ద శత్రువు:

### టీ20 వరల్డ్‌కప్ 2026 ముంగిట పాక్

వివాదం వేళ టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. నాలుగైదు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందన్నాడు. బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ ఫిబ్రవరి 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించిన విషయం తెలిసిందే. 'నూటికి నూరుశాతం భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరుగుతుంది. మరో నాలుగైదు రోజుల్లో పాకిస్థాన్ దారికొస్తుంది. భారత్, పాక్ పోరును చూడాలని నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. ఒకవేళ పాకిస్థాన్.. భారత్‌తో మ్యాచ్ ఆడకుంటే జరగబోయే పరిణామాల గురించి అశ్విన్ ప్రస్తావించాడు. 'పాకిస్థాన్ భారీ ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. బ్రాడ్‌కాస్టర్లు పెద్ద మొత్తాల్లో నష్టపోతారు.



మిగతా బోర్డులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఐసీసీ టింగ్‌లో ఈ విషయం ప్రస్తావనకు వస్తుంది. పీఎస్‌ఎల్ కోసం విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసీలు రావు' అని అశ్విన్ విశ్లేషించాడు. 'భారత్, పాకిస్థాన్ ఇప్పటికే తటస్థ వేదికల్లో పోటీ పడుతున్నాయి. దీంతో ఇక్కడ వేదిక అనేది సమస్యే కాదు. కాబట్టి ఓ ప్రత్యర్థితో నేను ఆడను అనడం ఆమోదయోగ్యం కాదు. పాకిస్థాన్‌కు పాకిస్థానే పెద్ద శత్రువు. దీనంతటికీ వారి మైండ్ సెట్టే కారణం' అని రవిచంద్రన్ అశ్విన్ పేర్కొన్నాడు. టీ20 వరల్డ్ కప్ 2026 భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్నాయి. ఈ మెగా టోర్నీలో మొత్తం 20 దేశాల జట్లు పాల్గొనబోతున్నాయి.

## ఉమెన్ ఐపిఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) లో సూపర్ సక్సెస్ ఫ్రాంచైజీల్లో ఒకన చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్‌కె) త్వరలోనే మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) లోనూ అడుగుపెట్టబోతోంది. గత కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ.. నేడు సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించారు. మహిళల క్రికెట్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడం తమ తదుపరి ప్రాధాన్యత అని విశ్వనాథన్ స్పష్టం చేశారు. తాము త్వరలోనే మహిళల క్రికెట్‌లో పెట్టుబడి పెట్టబోతున్నామని, డబ్ల్యూపీఎల్‌లో చెన్నై జట్టును తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. బీసీసీఐ జట్లను విస్తరించాలని నిర్ణయించినప్పుడు సీఎస్కే యాజమాన్యం బిడ్డింగ్‌లో పాల్గొని జట్టు సభ్యులను కొనుగోలు చేస్తుందని క్లారిటీ ఇచ్చారు. ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సీఎస్కేకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు అదే బ్రాండ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లోకి వస్తుండటంతో అభిమానులు అంతులేని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముంబై ఇండియన్స్, ఆర్సీబీ వంటి జట్లు డబ్ల్యూపీఎల్‌లో రాణిస్తుండగా.. తాజాగా చెన్నై కూడా తోడైతే లీగ్ స్థాయి మరింత పెరుగుతుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

## మరో వివాదం.. పాక్ జెర్సీపై ఐఎస్ఐ లోగో

టీ20 వరల్డ్ కప్ లో భారత్ తో మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ జట్టు వివాదం రేపిన



విషయం తెలిసిందే. ఓవైపు దీనిపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా.. మరోవైపు ఆటగాళ్ల కోసం పాక్ సిద్ధం చేసిన జెర్సీపై మరో వివాదం రేగింది. టీ20 వరల్డ్ కప్ కోసం సిద్ధం చేసిన పాకిస్థాన్ జెర్సీపై అటవీ మేక 'మార్ఖోర్' బొమ్మ కనిపించడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఆకుపచ్చ రంగులో ఉన్న జెర్సీపై మధ్యలో నల్లటి రంగులో మార్ఖోర్ చిత్రాన్ని ప్రింట్ చేశారు. పాకిస్థాన్ జాతీయ జంతువు మార్ఖోర్.. అదే విధంగా ఇదే చిహ్నాన్ని ఆ దేశ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ కూడా ఉపయోగిస్తోంది. ఈ నేపథ్యంలోనే పాక్‌ఆటగాళ్ల కోసం రెడీ చేసిన జెర్సీపై మార్ఖోర్ బొమ్మ కనిపించడాన్ని నెటి జన్లు తప్పుబడుతున్నారు.

## 2027 వరల్డ్ కప్‌లో రోహిత్, కోహ్లీ.. ధోని సంచలన వ్యాఖ్యలు

భారత క్రికెట్ జట్టులో సీనియర్ ప్లేయర్లు అయిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ప్రస్తుతం భీకర ఫామ్‌లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే వారు ఇద్దరు 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలని ఇప్పటినుంచి ఫ్యాన్స్ సోషల్ డియా వేదికగా చర్చ మొదలెట్టారు. ఈ డిమాండ్ పై టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ స్పందిస్తూ.. వార్తల్లో నిలిచారు. 2027 ఐసీసీ వన్డే ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఆడటంపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ యూట్యూబ్ ఛానెల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో ధోనీ మాట్లా డుతూ.. ఒక ఆటగాడికి వయస్సు అనేది కేవలం సంఖ్య మాత్రమేనని, ఫిట్‌నెస్, ప్రదర్శన బాగున్నంత కాలం ఎవరైనా జట్టులో కొనసాగవచ్చని రోహిత్, విరాట్‌లకు మద్దతుగా నిలిచారు. యూట్యూబ్ యాంకర్ ధోనిని ప్రశ్నించగా.. ఆయన స్పందిస్తూ.. "ఎవరైనా వచ్చే ప్రపంచ కప్ ఎందుకు ఆడకూడదు? నా దృష్టిలో వయస్సు అనేది ఒక క్రైటీరియానే కాదు. కేవలం ప్రదర్శన, ఫిట్‌నెస్ మాత్రమే ముఖ్యం" అని ధోనీ స్పష్టం చేశారు. అనుభవం గురించి మాట్లాడుతూ.. 30 ఏళ్ల వయసున్న వారు జట్టుకు ఎంతో అవసరమని, కేవలం 20–25 మ్యాచ్‌లు ఆడిన వారిని అనుభవజ్ఞులుగా పరిగణించలేమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం కోసం ఆడాలనే పట్టుదల ఉంటే వారిని ఎవరూ అడ్డుకోకూడదని, ఒకవేళ ఫిట్‌నెస్ లేకపోతే అప్పుడు జట్టు నుండి తొలగించవచ్చని ధోనీ కుండబద్దలు కొట్టారు. ఇదిలా ఉంటే రోహిత్, కోహ్లీ కాంబోకు క్రికెట్ ప్రపంచంలో ప్రత్యేక అభిమానులు ఉన్నారు. కేవలం వీరిద్దరి బ్యాటింగ్ చేసేందుకు మాత్రమే టీవీల ముందు కుర్చేనే అభిమానులు కూడా ఉంటారు. ఈ క్రమంలో గత సంవత్సరం మేలో టెస్టులకు రిర్మెంట్ ప్రకటించిన తర్వాత, రోహిత్, విరాట్‌ల వన్డే ఫామ్‌పై తీవ్రమైన చర్చ జరుగుతోంది. అయితే గణాంకాలు చూస్తే విరాట్ కోహ్లీ అప్రతిహతమైన ఫామ్‌లో ఉన్నారు. ఆస్ట్రేలియా సిరీస్ నుంచి ఇప్పటివరకు ఆడిన 9 వన్డేల్లో కోహ్లీ 88 సగటుతో 616 పరుగులు సాధించాడు. అందులో మూడు సెంచరీలు కూడా బాదారు. మరోవైపు రోహిత్ శర్మ కూడా 51.12 సగటుతో 409 పరుగులు చేసి తన సత్తా చాటుకున్నారు. న్యూజిలాండ్ సిరీస్‌లో రోహిత్ కాస్త తడబడినా, దేశవాళీ క్రికెట్‌లో (విజయ్ హజారే ట్రోఫీ) రాణించి తన రిథమ్‌ను కాపాడుకుంటున్నారు.



# వుదయం సినిమా



## బైకర్ పవర్ ఫుల్ గ్లింప్స్ విడుదల



అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ చిత్రం 'బైకర్'. 1990-2000 కాలం నాటి పీరియాడిక్ బ్యాక్డ్రాప్‌లో సాగే ఈ కథలో శర్వా ఒక ప్రొఫెషనల్ మోటార్‌సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్, సాంగ్స్‌కు ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా ఏప్రిల్ 3న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్‌లో శర్వానంద్ బైకర్ లుక్ చాలా స్టైలిష్‌గా ఉండి అంచనాలను పెంచేసింది. 'బైకర్' అంటే కేవలం రేసింగ్ యాక్షన్ మాత్రమే కాదు, ఇందులో హార్ట్ టచింగ్ ఫ్యామిలీ డ్రామా కూడా ఉండబోతోంది. మూడు తరాలకు చెందిన వ్యక్తులు ఒకే రేసింగ్ కల కోసం ఎలా పోరాడారు? వారి మధ్య ఉండే ఎమోషనల్ బంధాలు ఏంటి? అన్న కోణంలో ఈ సినిమా ఉండబోతోంది. స్పీడ్, అంబిషన్, ఫ్యామిలీ రిలేషన్స్‌తో కూడిన ఒక మల్టీ జనరేషనల్ వండర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించారు.

ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాలో మరో బిగ్ సర్ప్రైజ్ ఏంటంటే, యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈరోజు రాజశేఖర్ పుట్టినరోజు కావడంతో మేకర్స్ ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఒక పవర్ ఫుల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. రాజశేఖర్ ఇందులో 'బుల్లెట్ సునీల్' అనే మాజీ రేసర్ పాత్రలో కనిపిస్తున్నారు. వింటేజ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై రఫ్ అండ్ టఫ్ మేకోవర్‌లో ఉన్న రాజశేఖర్‌ను చూస్తుంటే పాత వింటేజ్ యాంగ్రీ మ్యాన్ గుర్తొస్తున్నారు. ఇది కేవలం అతిథి పాత్ర మాత్రమే కాదు, కథను పూర్తిగా మలుపు తిప్పే కీలక పాత్ర అని తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. శర్వానంద్ వంటి నేచురల్ యాక్టర్‌తో రాజశేఖర్ వంటి సీనియర్ స్టార్ తోడవ్వడంతో 'బైకర్' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి స్పీడ్ చూపిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అసహ్యంగా మార్చకండి



సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటానికి ఆసక్తి చూపని లావణ్య.. ప్రస్తుతం చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. రామ్‌చరణ్- ఉపాసన దంపతులకు ఇటీవల కవలలు జన్మించడంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా చిరంజీవి కూడా మీడియాతో మాట్లాడుతూ తన ఆనందాన్ని వ్యక్తంచేశారు. అయితే, కొందరు చిరంజీవి ప్రెస్‌మీట్‌ను తప్పుపడుతూ విమర్శలు చేశారు. ఈతరంలో కూడా వారసుడి కోసం కోరుకునేవాళ్లు ఉన్నారా.. అని ఒక వ్యక్తి పెట్టిన పోస్ట్‌కు లావణ్య స్పందించారు. స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తూ పోస్ట్ పెట్టారు. "సాధారణంగా నేను ఇలాంటి పోస్ట్‌లపై స్పందించను. వాటిని అసలు పట్టించుకోను. కానీ, మీలాంటి వారి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు ఊహించలేదు. మీ పోస్ట్ చాలా అభ్యంతరకరంగా ఉంది. ఆనంద క్షణాలను మీ కామెంట్స్‌తో అసహ్యంగా మార్చకండి. చిరంజీవి మా అందరితో ఎలా ఉంటారో మీకు తెలుసా.. ఆయన కుటుంబంలోని మహిళలను ముఖ్యంగా మనవరాళ్లను ఎలా చూసుకుంటారో మీకు తెలియదు. ఆయన మహిళలపై చూపే గౌరవంలో ఒక్క శాతం చూపే పురుషులు కూడా బయట తక్కువే. మీకు తెలియని విషయాల గురించి కామెంట్స్ చేయకపోవడం మంచిది" అని తన పోస్ట్ లో రాసుకొచ్చారు. లావణ్య స్పందించిన అనంతరం ఆ వ్యక్తి తన పోస్ట్ ను తొలగించడం గమనార్హం.

## ఆయనతో నన్ను పోల్చొద్దు



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు ఈరోజు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా కనిపించనున్నట్లు మహేశ్‌బాబు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు.

"నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీస్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం" అని రాజమౌళి తెలిపారు.

హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. "అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను" అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. తాజా ఇంటర్వ్యూలో ప్రియాంక తాను ఈ సినిమాను అంగీకరించేముందు రాజమౌళికి ఓ విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. దాని గురించి ఆమె మాట్లాడుతూ.. "నేను ఇండియన్ సినిమాలో నటించి 6 సంవత్సరాలు అయింది. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర చాలా గొప్పగా ఉంటుందని రాజమౌళి చెప్పినప్పుడు ఆయనకు ఒక విజ్ఞప్తి చేశా. 'దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పా. ఆయన చాలా పాటలు ఉన్నాయని చెప్పారు. మేం ఇప్పటికే ఒక పాట షూటింగ్ కూడా పూర్తిచేశాం. అది నాకు చాలా నచ్చింది. రోజూ దాన్ని పాడుకుంటూనే ఉన్నాను. అందులో డ్యాన్స్ అదిరిపోతుంది" అని ప్రియాంక పంచుకున్నారు.



## లెజెండ్ శరవణన్ లీడర్ గ్లింప్స్



వ్యాపారవేత్త అరుళ్ శరవణన్ 'ది లెజెండ్'తో నటుడిగా మారిన సంగతి తెలిసిందే. లెజెండ్ శరవణన్ గా గుర్తింపు పొందారు. ఆయన కథానాయకుడిగా దురై సెంథిల్‌కుమార్ దర్శకత్వంలో 'లీడర్' సినిమా రూపొందుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా గ్లింప్స్ ను బుధవారం విడుదల చేశారు. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంతో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. 'పిల్లలకు తండ్రే హీరో' అంటూ హీరో చెప్పిన డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది.

## కథ విన్నప్పుడు చాలా భయపడ్డాను



ఈ సినిమాలో తన పాత్రకు హుందాతనం చాలా కీలకమని, ముఖ్యంగా శ్రీరాముడిగా కనిపించే సందర్భాల్లో శరీర భాష, నిలబడి మాట్లాడే తీరు వంటి ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని చెప్పారు. పాత్రలోకి పూర్తిగా వెళ్లేందుకు దాదాపు ఏడాది పాటు శిక్షణ తీసుకున్నానని, ఇందులో భాగంగా 2-3 నెలలు కలరీ వంటి యుద్ధవిద్యను కూడా నేర్చుకున్నానని ఆయన వెల్లడించారు. అంతేకాదు, రాజమౌళి సూచన మేరకు తన రన్నింగ్ స్టైల్‌ను మార్చుకోవాల్సి వచ్చిందని, కేవలం రెండు నిమిషాల షాట్ కోసం ఆరు నెలల పాటు కఠినమైన ట్రైనింగ్ తీసుకున్నానని చెప్పారు. 6 నెలల ట్రైనింగ్ తర్వాత.. ఆ షాట్‌ను స్క్రీన్‌పై చూసినప్పుడు తనకు ఎంతో సంతోషం కలిగిందని.. ఆ ఒక్క షాట్ కోసం ఆరు నెలలు చేసిన శిక్షణ నిజంగా విలువైనదిగా అనిపించిందంటూ ఎమోషనల్ అయ్యారు. అంతేకాకుండా తన నడక మారింది.. నిలబడే విధానం మారింది.. అన్నీ మారిపోయాయి" అంటూ మహేష్ బాబు చెప్పుకొచ్చారు.

## సెన్సార్ కంప్లీట్ చేసుకున్న సుమతీ శతకం

సీరియల్స్ తో ఫేమస్ అయిన అమర్ దీప్ చౌదరి గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత బిగ్ బాస్ హౌస్‌లో అడుగు పెట్టి అక్కడ తన గేమ్‌తో రన్నరప్‌గా నిలిచారు. ఇక బయటకు వచ్చాక వరుస షోస్, సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటున్నాడు. అలాగే బీబీ జోడీలో తన డ్యాన్స్‌తో అదరగొడుతున్నాడు. ఇక బిగ్ బాస్ హౌస్ నుంచి బయటికి వచ్చాక అమర్ దీప్, సైలీ చౌదరి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'సుమతీ శతకం'.

ఎం. ఎం. నాయుడు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. జీరో కట్స్‌తో ఈ సినిమా యు.ఏ సర్టిఫికెట్ పొందిందని, సెన్సార్ వారు కూడా అభినందించారని మేకర్స్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ స్పెషల్ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'U/A సర్టిఫైడ్.. కుటుంబాలు మరియు హృదయాలను ఒకేలా చూసే చిత్రం.. ఫిబ్రవరి 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది' అని రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

కాగా అమర్ దీప్ మాస్ మహారాజ్ రవితేజ వీరాభిమాని అన్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించిన కంటెంట్ చూసిన రవితేజ తాజాగా స్పందిస్తూ.. సినిమా కంటెంట్ నాకు బాగా నచ్చింది. ఈ మూవీ మంచి హిట్ కావాలని, అతని భవిష్యత్తు అద్భుతంగా ఉంటాలంటూ ఎక్స్ వేదికగా ఓ వీడియో పోస్ట్ చేశాడు. దీంతో ఈ సినిమాపై మరింత హైప్ పెరిగిపోయింది. మరి ఈ సినిమాతో హీరోగా అమర్ దీప్ ఎలాంటి విజయం సాధిస్తాడో చూడాల్సి ఉంది.



## అదొక్కటే చాలు..

'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెలుగు ఆడియన్స్ కు పరిచయమైన స్టార్ బ్యూటీ మీనాక్షి చౌదరి మనందరికీ సుపరిచితమే. ఆ తర్వాత 'హిట్:ది సెకెండ్ కేస్', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', 'గోట్:ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్', 'సంక్రాంతికి వస్తున్నాం', 'అనగనగా ఒక రాజు' వంటి సినిమాలతో ఈ భామ మంచి హిట్లను తన ఖాతాలో వేసుకుంది. అలా దాదాపు అన్ని సినిమాలు హిట్ కావడంతో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను దక్కించుకుంది. తాను నటించిన సినిమాలన్నీ మంచి సక్సెస్ అవుతున్న నేపథ్యంలో మీనాక్షి లక్కీ హీరోయిన్ అయిపోయింది. రీసెంట్‌గా నటించిన 'అనగనగా ఒకరాజు' మూవీతో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. నవీన్ పొలిశెట్టిహీరోగా నటించిన ఈ చిత్రానికి మారి దర్శకత్వం వహించాడు. ఇక సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుంది. ప్రజెంట్ ఈ ముద్దుగుమ్మ అక్కినేని హీరో నాగ చైతన్య సరసన 'ఎన్‌సీ-24' మూవీతో పాటు యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ సరసన ఓ సినిమాలో యాక్ట్ చేస్తోంది. అలా ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియా లో యాక్టివ్ గా ఉంటుంది మీనాక్షి. ఈ క్రమంలో ఈ భామకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న వీడియోలో.. లైఫ్‌లో స్ట్రెట్ ఏమ్ వద్దు.. ఓన్లీ ఫుడ్ చాలు అని చాలా ఫుడ్ ఐటమ్స్ ముందు పెట్టుకుని తింటున్నది. బిర్యానీ తింటూ ఇదే నా మోటివేషనల్ వీడియో.. డెకెట్.. సెంచరీ అని చెబుతూ నవ్వేస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారగా.. నెటిజన్లు వివిధ రకరకాలుగా స్పందిస్తున్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.